thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 105 కరీంనగర్ మంగళవారం, 24 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇప్పటికీ ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలంటారా?

న్యూఢిల్లీ/హైదరాబాద్ : ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో ఇంతకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫారసు చేస్తామన్న పాకిస్థాన్‌పై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ ఘనకార్యం చేసినందుకు ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాకిస్థాన్ కోరుకుంటోందా? అని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో గత నెలలో భారత్-పాక్ మధ్య ఘర్షణ సందర్భంగా ట్రంప్ జోక్యం చేసుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును సిఫారసు చేయనున్నట్టు శనివారం పాకిస్థాన్ ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్‌పై అమెరికా నేరుగా దాడులకు దిగింది. ఇరాన్ అణు కేంద్రాలపై అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా దాడులకు పాల్పడిందని ఒవైసీ అన్నారు. సుమారు 60 లక్షలకు పైగా భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉన్నారని.. యుద్ధం నేపథ్యంలో ప్రవాస భారతీయుల భద్రతపై ఆందోళన కలుగుతోందన్నారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇవాళ సిట్ విచారణకు హాజరయ్యారు అప్పటి సీఎస్ శాంతి కుమారి. ఫోన్ ట్యాపింగ్ చేసిన ఎస్ఐబీ.. రివ్యూ ప్యానెల్‌నూ తప్పుదోవ పట్టించిందని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ పంపిన నంబర్లను రివ్యూ చేసి అభ్యంతరం తెలిపినట్టు ఆమె వెల్లడించారు. అయినా యథేచ్ఛగా ట్యాపింగ్ జరిగింది. ఇంతకూ ఎస్ఐబీ ఎవరి కంట్రోల్ లో పనిచేసింది..? ఆ విభాగానికి బాస్ ఎవరు..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. గతంలో విచారణ సందర్భంగా మాజీ డీఎస్పీలు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, డీసీపీ రాధాకిషన్ రావు స్టేట్ మెంట్లను సిట్ తీసుకుంది. వారిచ్చిన నేరాంగీకరపత్రంలో అప్పటి బీఆర్ఎస్ సుప్రీం ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు చెప్పారు. ఈ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు మాత్రం అప్పటి డీజీపీ, ప్యానల్ ఆదేశాలతోనే ట్యాపింగ్ చేసిట్టు చెప్పారు. ప్రతి విషయం ప్యానల్ ముందుంచామని, ఆ మేరకు ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు. దీంతో సిట్ ఇవాళ ప్యానల్ లో సభ్యురాలిగా ఉన్న శాంతి కుమారిని విచారణకు పిలిచింది. ఆమె నుంచి స్టేట్ మెంట్ తీసుకున్నది. గతంలో అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు స్టేట్ మెంట్ ను సిట్ ఇదివరకే తీసుకున్నది. అందరూ తమనకు ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు తప్పుదోవ పట్టించారని చెప్పారు.



## ఉజ్జయిని మహంకాళి బోనాలకు రండి..
## సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక

హైదరాబాద్ : జులై 13న సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళిఅమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆలయ అధికారులు ఆహ్వానించారు. సోమవారం సెక్రటేరియట్ లో మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి ఉజ్జయిని మహంకాళి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. మరో వైపు ఈ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి మండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బనకచర్లపై చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కి గత కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో పాటు పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీలోగా కమిషన్‌కి అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పీసీ ఘోష్ కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన పూర్తి నివేదిక ఇవ్వాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది.

రేపు(మంగళవారం) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9 లక్షల ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లియర్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాగా, మంత్రివర్గ సమావేశానికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు.

# నేడు రైతు భరోసా పండుగ!

# సంబరాలు చేసుకుందాం...






తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లోనే కోట్లాది రూపాయల నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఇది ఎకరానికి రూ.12,000 చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించబడిందని భట్టి స్పష్టం చేశారు. ఈ భారీ నిధుల విడుదల, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను చాటుతోంది.

**వ్యవసాయ వృద్ధికి చేయూత..** గాంధీభవన్‌లో టీపీసీసీ (తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కోఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ఈ వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ (అఖిల భారత కాంగ్రెస్ కమిటీ) ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ (కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ) సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధుల పంపిణీ ఈ నెల జూన్ 16న ప్రారంభమై.. జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ స్వల్ప వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో నిధులను రైతులకు చేరవేయడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం. వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ఇది గణనీయంగా తగ్గిస్తుంది. విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు వంటి వాటికి ఈ నిధులు ఉపయోగపడతాయి. ఇది రైతులను అప్పుల ఊబి నుండి కాపాడి, ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తుంది. తద్వారా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

**రైతు భరోసా సంబరాలు ..** రైతు భరోసా నిధుల విడుదల నేపథ్యంలో.. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలను పెద్ద ఎత్తున చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. ఈ సంబరాలు.. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచి, విశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదపడతాయి. రైతులు తమకు అందిన సహాయాన్ని బహిరంగంగా ఆనందంగా జరుపుకోవడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధత అందరికీ తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. రైతులకు నీటిపారుదల సౌకర్యాలు, పంటలకు మద్దతు ధరలు, పంట నష్టాలకు పరిహారం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించనుంది. రైతు భరోసా పథకం తెలంగాణలోని లక్షలాది మంది రైతన్నల జీవితాల్లో కొత్త ఆశలను నింపి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు దగ్గర నుంచి కూడా 4 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రైతుభరోసా నిధులు జమ చేయలేదు. మొదటి సారి ఈ విధంగా ఎకరాలతో సంబంధం లేకుండా.. ప్రతీ భూమికి రైతుభరోసా అందించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయవర్గాల్లో విస్తృత చర్చ

## వచ్చే ఎన్నికల నాటికి లోక్‌సభ, అసెంబ్లీల పునర్విభజన ఖాయమనే సంకేతాలు




## విధి, విధానాలపైనే అందరి ఆసక్తి

## మహిళా రిజర్వేషన్లు, జమిలి ఎన్నికలు ఖాయమనే భావన

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు రంగం సిద్ధమవుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 శాతం పార్లమెంటు, అసెంబ్లి సీట్లు పెరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయ వర్గాల్లో కొత్త ఆశలు పుట్టుకొస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికలు ఖాయమనే భావనతో అందరిలో ఆసక్తి నెలకొంది. రాజకీయ పార్టీలు, కీలకనేతలు సీట్ల విభజనను ఏమేరకు ప్రభావితం చేయగలుగుతారనే అంశం చర్చనీయాంశమైంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలపై రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలు స్పష్టమైన మార్పుల తో జరుగుతాయనే అభిప్రాయం బలంగా వినిపిస్తోం ది. చట్టసభల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేష న్ల కల్పించే బిల్లు ఇప్పటికే ఆమోదం పొందగా, వచ్చే సార్వత్రిక ఎన్నికల నుంచి అమలు చేయాల్సి ఉంది. తాజాగా జనగణనతోపాటు కులగణన చేపడుతుండడంతో ఈ లెక్కల ఆధారంగా బీసీ వర్గాలకు సైతం చట్టసభల్లో రిజర్వేషన్లకు గ్రీన్‌సిగ్నల్ వస్తుందనే ఆశాభావం వెల్లడవుతోంది. ఈ కీలక మార్పుల తోపాటు జనగణన ముగిసిన వెంటనే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు రంగం సిద్ధమవుతుండడంతో లోక్‌సభ సీట్లను పెంచే ప్రాతిపదిక ఆధారంగా రాష్ట్రంలో సీట్ల సంఖ్య ఏమేరకు పెరుగుతుందనే అంశంపై స్పష్టత రానుండగా, లోక్‌సభ సీట్ల కు తీసుకున్న ప్రామాణికతనే అసెంబ్లీ సీట్లు పెంచడానికి తీసుకుంటారా..?లేకఏపీ పునర్విభజన చట్టం లో పేర్కొన్న ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ల సీట్ల సంఖ్యను పెంచుతారా..?అనే అంశంలోనూ స్పష్ట త రావాల్సి ఉంది. రాజకీయ పార్టీలు, కీలకనేత లు సీట్ల విభజనను ఏమేరకు ప్రభావితం చేయగలుగుతారనే అంశంతోపాటు, డీలిమిటేషన్ విధి విధానాలు ఎలాఉంటాయనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా వస్తున్న సమాచారం ప్రకారం లోక్‌సభ సీట్లను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న సీట్లకు 20 శాతం అదనంగా పెంచుతారనే సంకేతాలు వస్తున్నాయి. లోక్‌సభ సీట్ల పునర్విభజనను జనా భా ప్రాతిపదికన చేపడితే కుటుంబ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేసి జనాభా నియంత్రణకు తోడ్పడిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ఆందోళనల నేపథ్యంలో కేంద్రం జనాభాతో సంబం ధం లేకుండా రాష్ట్రాలవారీగా 20శాతం సీట్లు పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల సరిహద్దులు మారడంతో పాటు, కొత్త జిల్లాల సరిహద్దులు, కొత్త మండలాల సరిహద్దుల ఆధారంగా నియోజకవర్గాల ఏర్పాటు జరుగుతుందని, ప్రస్తుతమున్న నియోజకవర్గాల పరిధిని సర్దుబాటు చేస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పునర్విభజన నోటిఫికేషన్ వస్తే పూర్తి స్పష్టత వస్తుందని, రాజకీయపార్టీలు సైతం ప్రస్తుతం అంతర్గతంగా కసరత్తు చేస్తున్నప్పటికీ నోటిఫికేషన్ వచ్చాక తమ పార్టీల వారీగా ప్రతిపాదనలు ఇచ్చేదాన్ని బట్టి మార్పులు, చేర్పులుంటాయని చెబుతున్నారు.

**మహిళలకు సీట్లు ఖాయం...** జనగణన, కులగణన, అనంతరం నియోజకవర్గాల పునర్విభజనతోపాటు జమిలి ఎన్నికలు జరిపే విషయమై కేంద్రం పట్టుదలగా ఉండడంతో రాబోయే సార్వత్రిక ఎన్నికలు జమిలిగా జరుగుతాయని అంచనా వేస్తున్నారు. జమిలి నిర్ణయం తీసుకుంటే 2028 చివరలో జరగాల్సిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను ఆరు నెలలు వాయిదా వేసి, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలతో కలిపి నిర్వహిస్తారని చెబుతున్నారు. అదేవిధంగా మహిళలకు రిజర్వేషన్లు అమల్లోకి రానుండడంతో తెలుగు రాష్ట్రాల్లో వారికి భారీగానే సీట్లు ఇచ్చే అవకాశం మెండుగా ఉండనుంది. అయితే ఏ నియోజకవర్గాలు మహిళలకు కేటాయిస్తారనే అంశం కొత్తగా రూపొందే నియోజకవర్గాల ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎంపిక చేస్తారని తెలుస్తోంది. అదేవిధంగా బీసీలకూ చట్టసభల్లో రిజర్వేషన్లు ప్రకటిస్తే ఆ మేరకు ఆయా వర్గాలకు సీట్ల కేటాయింపు ఉంటుందని అశిస్తున్నారు. మొత్తంగా రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పలు మార్పులు, చేర్పుల మధ్య, పలు కీలక సామాజిక సమీకరణాల నడుమ కొనసాగుతాయనే అంశం స్పష్టమవుతుందని, రాజకీయాల్లో పూర్తిమార్పు రాబోతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

చురకలు
మంగళవారం 24 జూన్ 2025



# 2018 ఎన్నికల నుంచే ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2018 ఎన్నికల వేళ ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులకు తాజాగా ఆధారాలు లభించాయి. ప్రణీత్‌రావు నుంచి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావుకు ట్యాపింగ్ సమాచారం చేరేది. ప్రభాకర్ రావు ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్‌ప్రసాద్‌కు చెందిన రూ. 70లక్షల డబ్బును టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్‌రావు బంధువులకు చెందిన రూ. కోటి కూడా ఫోన్ ట్యాపింగ్‌తో వచ్చిన సమాచారం మేరకే సీజ్ చేశారని తెలుస్తోంది. బేగంపేట పరిధిలో రాధాకిషన్‌రావు, ఆయన బృందం రూ. కోటి సీజ్ చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సమాచారం. నల్గొండ కాంగ్రెస్ నేతల అనుచరుల నుంచి రూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే బాధ్యత నాయకులదే: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. "రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలి"అని సూచించారు.

## రైతుభరోసా సంబరాలు చేపట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.





# కాళేశ్వరంపై మాది.. పార్టీది ఒకే అభిప్రాయం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే భారాస నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని భాజపా ఎమ్మెల్యే రాజా సింగ్ మండిపడ్డారు. బండి సంజయ్‌పై భారాస నేతలు చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని వ్యాఖ్యానించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాది.. మా పార్టీది ఒకే అభిప్రాయం. ఈ ప్రాజెక్టుపై ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా చెప్పిన మాటలకే మేమూ కట్టుబడి ఉంటాం. భారాస నేతల వైఖరి చూస్తుంటే 'ఉల్టా చోర్ కొత్వాల్ డాంటే' అన్నట్లుగా ఉంది. ప్రధాని మోదీ చెప్పినట్లు భారాస కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంది. ఇది వాస్తవం కాదా? రూ. 8వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ. 1.20లక్షల కోట్లకు పెంచలేదా?ఆనాడు కేసీఆర్ స్వయం ప్రకటిత ఇంజినీరు అవతారం ఎత్తి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. ఈనాడు ఆయన కుమారుడు ఎన్‌డీఎస్ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తిస్తున్నారు"అని రాజాసింగ్ విమర్శించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇవాళ(సోమవారం) విచారణ జరిపింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే ఇంకా పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలనే నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటీషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే.






# ఎంపీ రఘునందన్‌కు బెదిరింపు కాల్

## 'సాయంత్రంలోగా చంపేస్తాం..' ఎంపీ రఘునందన్‌కు బెదిరింపు కాల్

హైదరాబాద్: భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్ ఫిర్యాదు చేశారు.



# హర్మూజ్ విషయంలో ఇరాన్‌కున్న ఆప్షన్లు ఏంటీ..?

ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా బంకర్ బస్టర్లతో విరుచుకుపడటంతో టెహ్రాన్ ప్రతీకార వాంఛతో రగిలిపోతోంది. దాని ఎదుట కూడా ఆప్షన్లు పరిమితంగానే ఉండటంతో హర్మూజ్ జలసంధిని ఆయుధంగా వాడుకోవడానికి వ్యూహరచన చేస్తోంది. గతంలోను పలుమార్లు దీనిని మూసేస్తానని హెచ్చరించినా.. అంత సాహసం చేయలేదు. ఈ జలసంధిని కొన్ని గంటలు లేదా రోజులు మూసేస్తేనే ముడిచమురు ధరలు భగ్గుమంటాయని జేపీ మోర్గాన్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 70శాతం ద్రవ్యోల్బణానికి , ఆర్థికవృద్ధిని దెబ్బతీయడానికి కారణమవుతాయని వెల్లడించారు.

అమెరికా దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలంటే దానికి చాలా మార్గాలున్నాయి. అయితే ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయాలంటే తన అతిపెద్ద చమురు కస్టమర్ అయిన చైనా అనుమతి ఉండాలి. ప్రతిదాడులకు సిద్ధం కావాలంటే చాలా విషయాలను టెహ్రాన్ దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే ఇరాన్ తీరప్రాంత రక్షణ వ్యవస్థలను అమెరికా, ఇజ్రాయెల్ నాశనం చేసే అవకాశం కూడా ఉంది.

**వాణిజ్య నౌకలపై వేధింపులు..** ఇరాన్ హర్మూజ్ తీర ప్రాంతంలో తిరిగే నౌకలపై స్వల్ప వేధింపుల నుంచి తీవ్రస్థాయి చర్యల వరకు పాల్పడవచ్చు. గతంలో ఇరాన్ తమ ప్రాదేశిక జలాల్లో నుంచి వెళుతున్న నౌకలను కొన్నిసార్లు నిలిపేసిన సందర్భాలున్నాయి.

వాణిజ్య నౌకల వద్దకు ఇరాన్‌కు చెందిన చిన్న క్రాఫ్ట్ బోట్లు చేరుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకొంటున్నట్లు బహ్రెయిన్‌కు చెందిన మారిటైమ్ ఫోర్స్ వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి చర్యలు ఉద్రిక్తతలకు దారితీస్తాయి.


**జామింగ్ చర్యలకు పాల్పడటం..** షిప్పింగ్ పరిశ్రమను ప్రధానంగా ప్రభావితం చేసే అంశం ఇది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మొదలైన నాటినుంచి ఈ మార్గంలో ప్రయాణించే నౌకల జీపీఎస్ సిగ్నల్స్‌లో తీవ్ర అవరోధాలు ఎదురవుతున్నాయి.

జూన్ 13 నుంచి ప్రతిరోజు దాదాపు పెద్దసంఖ్యలో నౌకలకు ఇలాంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. దీంతో అవి సరైన మార్గాన్ని గుర్తించడం కష్టమవుతోంది.

**సముద్ర మైన్లతో ఉచ్చు పన్నడం..** హర్మూజ్‌లోని నౌకలు ఎదుర్కొంటున్న ప్రధాన ముప్పులో ఇది కూడా ఒకటి. ఇరాన్ కొత్తగా వీటిని పరిశీలిస్తే.. ఈ మార్గంలో రావాలంటే నౌకలు భయపడే పరిస్థితి తలెత్తుతుంది. 2019లో ఇరాన్ సీమైన్స్ వాడి నౌకలను దెబ్బతీసిందని అమెరికా ఆరోపించింది. అయితే అప్పట్లో ఇరాన్ దీనిని తోసిపుచ్చింది. ఈ మైన్స్ ముప్పు ఇరాన్ నౌకలకు కూడా పొంచి ఉంటుంది.

**హూతీల వలే దాడులు..** ఎర్ర సముద్రంలో హూతీ రెబల్స్ అనుసరిస్తున్న వ్యూహాన్ని హర్మూజ్‌లో ఇరాన్ పాటించడం. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకొని.. డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికా, యూకే వంటి పశ్చిమ దేశాలతో సంబంధాలున్న ఇరాన్ టార్గెట్లోకి వచ్చే అవకాశాలున్నాయి. సూయజ్ కాల్వలా దీనికి ప్రత్యామ్నాయ మార్గం లేదు. టెహ్రాన్ ఈ వ్యూహాన్ని ఎంచుకొంటే మాత్రం పంపిణీ వ్యవస్థలపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడుతుంది.

**చమురు సరఫరాను దెబ్బతీయడం..** హర్మూజ్ జలసంధిని మూయకుండా.. చమురు సరఫరాలను దెబ్బతీసే ఆప్షన్ కూడా ఇరాన్ ఎదుట ఉంది. 2019లో సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో చమురు ప్రాసెసింగ్ వ్యవస్థలపై దాడులు చేయించింది. ప్రపంచంలో 7శాతం ఉత్పత్తి ఇక్కడినుంచే జరుగుతుంది. పొరుగుదేశాల్లోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలున్నాయి. కానీ, అప్పుడు ఆయా దేశాలు కూడా టెహ్రాన్‌కు వ్యతిరేకంగా మారతాయి. ఖార్గ్ ద్వీపంలోని దాని చమురు క్షేత్రాలను ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకోవచ్చు.



# అందుకే ఇరాన్‌కు సాయం చేయట్లేదు..!

## ఇరాన్‌కు రష్యా ఎందుకు సాయం చేయలేదంటే.. పుతిన్ సమాధానమిదే!

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా కూడా రణరంగంలోకి దిగింది. టెహ్రాన్‌లో మెరుపుదాడులు చేసింది. ఇంత జరుగుతున్నా.. ఇరాన్‌కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. ఈ యుద్ధంలో తాము తటస్థంగా ఎందుకు ఉంటున్నామో వివరించారు. "ఒకప్పటి సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు 20లక్షల మంది ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడది దాదాపు రష్యన్ మాట్లాడే దేశమే. దానిని పరిగణనలోకి తీసుకునే ఈ ఉద్రిక్తతల్లో మేం తటస్థంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌లో పుతిన్ వెల్లడించారు. మిత్ర దేశాలపై రష్యా నిజాయతీని కొంతమంది విమర్శిస్తున్నారని, వారంతా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారేనని పుతిన్ మండిపడ్డారు. అరబ్ దేశాలతో తమకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందన్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్‌లో రష్యా అబ్జర్వర్‌గా ఉన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు అణ్వాయుధాలపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ నిన్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశానికి అణ్వాయుధాలను సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, వాటి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమైన వేళ.. తటస్థంగా ఉంటామంటూ పుతిన్ వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.



# త్వరలో తెలంగాణలో కొత్త క్రీడా పాలసీ

హైదరాబాద్: ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయన్నారు. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుభవార్త చెబుతుందని చెప్పారు. ఈరోజు జరిగే తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం త్వరలో ప్రతిష్మాత్మకంగా తీసుకువస్తున్న కొత్త క్రీడా పాలసీకి ఆమోదం తెలపనుందని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలామందికి న్యాయం జరగలేదన్నారు. వారికి త్వరలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, పారా ఒలింపిక్ పతక విజేత దీప్తి జివాంజీ పాల్గొన్నారు.

చురకలు






# టెలిగ్రామ్ సీఈఓ మరో సంచలన ప్రకటన

ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా 100 మందికి పైగా పిల్లలకు తాను బయోలాజికల్‌గా తండ్రినని గతంలో చెప్పిన పావెల్.. ఇప్పుడు ఆ పిల్లలందరికీ తన సంపదను పంచేస్తానంటూ మరో సంచలన ప్రకటన చేశారు. ఈమేరకు తన భవిష్యత్ ప్రణాళికను వెల్లడించారు. 15 ఏళ్ల పాటు తాను చేసిన వీర్యదానంతో ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 100 మంది పిల్లలు జన్మించినట్లు గతేడాది జులైలో ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి ప్రస్తావించిన ఆయన.. మరో ఆసక్తికర విషయాన్ని తెలిపారు. ఇటీవలే తాను వీలునామా రాశానని, అందులో ఈ సంతానం గురించి కూడా పేర్కొన్నట్లు తెలిపారు. తాను సహజంగా జన్మనిచ్చిన సంతానంతో పాటు ఈ 100 మంది పిల్లలకు కూడా తన ఆస్తిలో సమాన హక్కు ఉంటుందని వెల్లడించారు. దాదాపు 20 బిలియన్ డాలర్ల తన సంపదను వీరందరికీ సమానంగా పంచుతానని తన వీలునామాలో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే, ఈ సంపదను 30 ఏళ్ల వరకు వారు పొందలేరని, తన పిల్లలు స్వతంత్రంగా జీవించేలా ఎదగాలని కోరుకుంటున్నట్లు పావెల్ పేర్కొన్నారు. వివాహం కానప్పటికీ తనకు ముగ్గురు సహజీవన భాగస్వాములు ఉన్నారని, వారికి ఆరుగురు సంతానం అని టెలిగ్రామ్ సీఈఓ తెలిపారు. తన జీవితం ఎన్నో సవాళ్లతో ముడిపడి ఉందని, ఎంతోమంది శత్రువులు ఉన్నట్లు చెప్పారు. అందుకే, 40 ఏళ్ల వయసులోనే వీలునామా రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కథనం నెట్టింట వైరల్‌గా మారింది. వీర్యదానం గురించి పావెల్ గతేడాది పోస్ట్ చేస్తూ ఈ సంతానం విషయాన్ని వెల్లడించారు.

"నాకు 100 మందికి పైగా సంతానం ఉన్నారు. పెళ్లి చేసుకోకుండా ఒంటరి జీవితానికి ఇష్టపడుతున్న ఓ వ్యక్తికి ఇదెలా సాధ్యమైందని అనుకుంటున్నారా? 15 ఏళ్ల కిందట నా స్నేహితుడొకడు నన్ను కలిసి వింత సాయం కోరాడు. నా మిత్రుడికి, అతడి భార్యకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోవడంతో సంతానం కోసం నన్ను వీర్యదానం చేయమని అడిగాడు. అది విని నేను విపరీతంగా నవ్వుకున్నా. కానీ, ఈ సమస్య ఎంత తీవ్రమైందో ఆ తర్వాతే అర్థమైంది. దీంతో స్పెర్మ్ డొనేషన్‌లో రిజిస్టర్ చేసుకున్నా. అలా ఇప్పటివరకు 12 దేశాల్లో వందమందికి పైగా జంటలకు సంతానాన్ని అందించా. చాలా ఏళ్ల క్రితమే వీర్యదానాన్ని నేను ఆపినప్పటికీ.. ఇంకా ఫ్రీజ్ చేసిన నా కణాలతో ఎన్నో కుటుంబాలకు సంతానం కలిగిస్తున్నారని తెలుసుకున్నా" అని పావెల్ నాడు వివరించారు.

# రాజు గారి పెద్దరికం వైపు చంద్రబాబు మొగ్గు.. ఆ సీనియర్ కు నో ఛాన్స్!

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఏపీ విషయంలో అత్యంత శ్రద్ధతో ఉంది. మోదీ నేతృత్వంలో వరుసగా మూడుసార్లు ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. అయితే గత రెండుసార్లు ఏపీకి ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. అయితే ఈసారి మాత్రం ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు ప్రధాని మోదీ. ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామి కావడమే అందుకు కారణం. అయితే ఈసారి రాజకీయంగా కూడా ఏపీకి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. గవర్నర్ పోస్ట్ ఒకటి టీడీపీకి కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ తరుణంలో గవర్నర్ పోస్ట్ ఎవరికి ఇస్తారు? అన్నది హాట్ టాపిక్ అవుతోంది.

**ఇద్దరు సీనియర్ల మధ్య పోటీ..** తెలుగుదేశం పార్టీలో గవర్నర్ పోస్ట్ కు ఇద్దరు పెద్దలు వేచి చూస్తున్నారు. అందులో పూసపాటి అశోక్ గజపతిరాజు ఒకరు. మరొకరు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు. ఇద్దరు నేతలు సమకాలీకులే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారే. ఆ ఇద్దరు నేతలు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. వారసులను బరిలో దించి రిలాక్స్ అయ్యారు. ఇద్దరు కూడా గౌరవప్రదమైన పదవి విరమణ కోరుకుంటున్నారు. గవర్నర్ పోస్టును ఆశిస్తున్నారు. ఇప్పటివరకు రాజకీయాల్లో మునిగిపోయిన వారు.. రాజ్ భవన్ లో అడుగు పెట్టాలని ఆశపడుతున్నారు.

**అశోక్ గజపతిరాజు వైపు మొగ్గు..** అయితే విశ్వసనీయ సమాచారం మేరకు అశోక్ గజపతిరాజు వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్రం నుంచి సంకేతాలు వచ్చాయి. తమిళనాడు గవర్నర్ రవిని పక్కన పెడుతున్న తరుణంలో అక్కడ మంచి వ్యక్తిని గవర్నర్ గా నియమించాలన్నది కేంద్ర ప్రజల ప్లాన్. అందుకు అశోక్ గజపతి రాజు అయితే సరిపోతారని ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అశోక్ విషయంలో చంద్రబాబుతో పాటు లోకేష్ సానుకూలంగా ఉన్నారు. పార్టీని ఇరుకున పెట్టేలా ఎప్పుడు అశోక్ గజపతిరాజు వ్యవహరించలేదు. పార్టీతో పాటు అధినేత పట్ల విధేయతతోనే ఉన్నారు. అందుకే అశోక్ పెద్దరికాన్ని గౌరవించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.

**యనమలకు అవకాశం లేనట్టే..** మరోవైపు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేరు గవర్నర్ పోస్ట్ కు పరిశీలనలోకి ఉంది. ఇటీవల ఎమ్మెల్సీగా ఉన్న యనమల పదవీ విరమణ పొందారు. పార్టీతో పాటు అధినేతతో గ్యాప్ ఉందన్నది ఒక ప్రచారం. ఈ తరుణంలో స్వీయ చరిత్రను రాసుకున్నారు యనమల రామకృష్ణుడు. అందులో ఎన్టీఆర్ కంటే చంద్రబాబు పాలనా దక్షుడు అంటూ కొనియాడారు. కానీ ఎందుకో దీనిపై స్పందించలేదు చంద్రబాబు. కనీసం లోకేష్ సైతం నోరు తెరవలేదు. పైగా యనమల కుమార్తె దివ్య పై ఫిర్యాదులు వస్తున్నాయి. అందుకే యనమలను వదిలించుకునేందుకు చంద్రబాబు సిద్ధపడినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే యనమల మాత్రం పార్టీతో విభేదాలు పెట్టుకొని అనవసరంగా ఇబ్బందులు పడకూడదని భావిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇద్దరు సీనియర్ల లో ఒక్కరి వైపు మాత్రమే చంద్రబాబు మొగ్గుచూపుతుండడం విశేషం.




# ఆ సీనియర్ అధికారులను తొలగించండి.. ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం!

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ ఇటీవల కుప్పకూలి మంటల్లో దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలోనే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ ముగ్గురు అధికారులు సిబ్బంది షెడ్యూల్, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. "నిబంధనలు సరిగా పాటించకపోవడం వల్లే వారిపై చర్యలకు డీజీసీఏ ఉపక్రమించింది. లైసెన్సింగ్, సర్వీసింగ్ లోపాలు ఉన్నా ఎయిరిండియా విమాన సిబ్బందిని షెడ్యూల్ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎయిర్‌లైన్స్ వెల్లడించిన విషయాల ఆధారంగా అలసత్వంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేయాలని సిఫార్సు చేసింది. నిబంధనలు పాటించకుండానే షెడ్యూల్ చేశారు. అంతేకాకుండా, వారు ఈ తప్పిదాలపై జవాబుదారీతనంతో వ్యవహరించలేదు. ఎలాంటి జాప్యం చేయకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీసీఏ పేర్కొంది. వెంటనే వారిపై అంతర్గత క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యలను 10 రోజులలోపు డీజీసీఏకి నివేదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది" అని వెల్లడించాయి. అంతేకాకుండా వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు కొత్త వారినే కొనసాగించాలని తెలిపింది. బెంగళూరు నుంచి లండన్‌కు బయలుదేరిన రెండు విమానాల సమయ పరిమితి 10 గంటలు ఆలస్యంగా చేరుకొన్నాయి.

దీనిపై డీజీసీఏ ఎయిర్‌లైన్స్ ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీటికి సమాధానం చెప్పాలని ఏడు రోజుల గడువు విధించింది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది ఓ భవనంపై కూలిపోయింది. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు విమానం కూలినచోట మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంలో ఉన్న వైద్య విద్యార్థులు, పలువురు స్థానికులు కూడా కన్నుమూశారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 272 మంది. మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి, వారి కుటుంబీకులకు అందజేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే డీజీసీఏ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ ముగ్గురు అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# లోక్ సభ సీట్ల పెంపుపై మోడీ సర్కారు కొత్త ఫార్ములా!



దేశ వ్యాప్తంగా లోక్ సభ నియోజకవర్గాల పెంపు విషయంలో ఇప్పటికే బోలెడంత చర్చ జరిగింది. ఈ సందర్భంగా జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగితే పలు రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందున్న వాదనలు బలంగా వినిపించాయి. ఇలాంటి వేళ.. లోక్ సభ సీట్ల పెంపు అంశంపై కేంద్రంలోని మోడీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటివరకు చర్చలు జరిగిన దానికి భిన్నంగా.. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్లు పెరిగేందుకు వీలుగా ఒక ఫార్ములాను మోడీ సర్కారు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

దీని ప్రకారం రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా కాకుండా.. రాష్ట్రాల వారీగా ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సీట్లకు 20 శాతం నియోజకవర్గాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

ఈ లెక్కన ఉమ్మడి ఏపీలో మొత్తం 42 స్థానాలు ఉండేవి. అంటే.. 8 స్థానాలు పెరగనున్నాయన్న మాట. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత ఏపీ పరిధిలో 25 స్థానాలు ఉండగా.. తెలంగాణలో 17 స్థానాలు ఉండటం తెలిసిందే. అంటే.. 5 స్థానాలు ఏపీలో.. 3 స్థానాలు తెలంగాణలో పెరిగే వీలుందన్న మాట వినిపిస్తోంది. జనగణన ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచితే కొత్త ఆందోళనలు తెర మీదకు రావటం ఖాయమని చెబుతున్నారు. ఎందుకంటే.. 1971 జనాభా లెక్కల సేకరణ జరిగినప్పుడు దేశ జనాభా 55 కోట్లు మాత్రమే. ఇప్పుడు అది కాస్తా 145 కోట్లకు చేరుకుంది. నియోజకవర్గాల పెంపు వేళ.. దక్షిణాధి రాష్టరాలకు నష్టం వాటిల్లకుండా నియోజకవర్గాల సంఖ్య పెంచటం మంచిదని చెబుతున్నారు. అయితే.. ఇప్పటివరకు వినిపిస్తున్న వాదన ప్రకారం దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదిన జనాభా పెరిగినట్లుగా వినిపించే వాదనలో సాక్ష్యాలు లేవని.. జనగణన తర్వాతే ఈ విషయంపై స్పష్టత వసతుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. లోక్ సభ స్థానాల పెంపు అంశానికి సంబంధించి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో(జులై 21 నుంచి ఆగస్టు 11) సీట్ల పెంపు బిల్లును ప్రవేశ పెడతారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. 2029లో దేశ వ్యాప్తంగా లోక్ సభకు.. అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టేందుకు వీలుగా కేంద్రం తయారవుతుందని చెబుతున్నారు. పహల్ గామ్ లో ఉగ్రదాడి..ఆపరేషన్ సిందూర్.. పాక్ తో ఉద్రిక్తతలతో యుద్ధాన్ని మొదలుపెట్టి కేవలం నాలుగు రోజుల్లోనే ముగించటం లాంటి అంశాలపై అధికారపక్షాన్ని విపక్షాలు విరుచుకుపడాలని భావిస్తున్న వేళ.. అందరి చూపు కొత్త బిల్లు మీద పడేందుకు వీలుగా సీట్ల పెంపు అంశాన్ని తెర మీదకు తెస్తున్నట్లు చెబుతున్నారు.

# ఇరాన్ లో ఖమేనీని ఎక్కడ దాచారో తెలుసా..?

ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధంలో ఓ కీలక పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఈ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ ఇచ్చింది. ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలపై బంకర్ బ్లస్టర్ బాంబులతో విరుచుకుపడింది. ఈ సందర్భంగా మూడు అణుశుద్ధి కేంద్రాలను ధ్వంసం చేసినట్లు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ తెలిపారు. దీంతో.. ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ సందర్భంగా స్పందించిన ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి.. అమెరికా దాడిని తీవ్రంగా ఖండించారు. ఇక అగ్రరాజ్యానికి శాశ్వత గాయం ఖాయమైందని వ్యాఖ్యానించారు. మరోవైపు అటు ఇజ్రాయెల్ లోను, ఇటు అమెరికాలోనూ హై అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఖమేనీ ఎక్కడ అనే చర్చ తెరపైకి వచ్చింది! అవును... ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమారిస్తేనే యుద్ధం ముగిసినట్లు అని ఇజ్రాయెల్ ప్రధాని.. ఖమేనీ ఎక్కడున్నారో తెలిసినా ప్రస్తుతానికి ఆయనను చంపే ఉద్దేశ్యంలేదని ట్రంప్



వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమేనీ భద్రత విషయంలో ఇరాన్ కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఇరాన్ తో యుద్ధం మొదలై, నెతన్యాహు స్టేట్ మెంట్ అనంతరం ఖమేనీ బంకర్ లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. అయితే.. శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కొన్ని బంకర్లలో ఆశ్రయం పొందుతున్న పలువురు కీలక కమాండర్లు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇరాన్ లోని అణుస్థావరాలపై అమెరికా సైతం దాడులు మొదలుపెట్టింది. దీంతో... ఖమేనీ భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... ఎటువంటి సిగ్నళ్లకు అందకుండా ఉండడానికి ఆయన ఉన్న ప్రదేశంలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ లను పూర్తిగా నిలిపివేసినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో భారీ పేలుల్లను సైతం తట్టుకునేలా ఆయనను అత్యంత సురక్షితమైన బంకర్ ఉంచినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో బయట జరుగుతున్న విషయాలను, తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆయనకు చేరవేసేందుకు, భవిష్యత్ కార్యచరణపై చర్చించేందుకు.. ఆయనకు అత్యంత సన్నిహితులైన ముగ్గురు వ్యక్తులు ఆయనకు అందుబాటులో ఉన్నారని అంటున్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్ తో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ.. తన వారసుడి కోసం కసరత్తులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తనను ఐడీఎఫ్ దళాలు హతమారుస్తాయనే ఆందోళనలో ఉన్న ఖమేనీ.. తన వారసులుగా ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది.

# క్రేజీగా టెస్లా షోరూం అద్దెలు.. కళ్లు చెదరాల్సిందే

టెస్లా ఈవీ కార్లకుండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సంస్థ తాజాగా ఇండియాలో ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. భవిష్యత్ అంశాల్ని పక్కన పెడితే.. ఇప్పుడు మాత్రం ఈ సంస్థ ఏర్పాటు చేస్తున్న షోరూం అద్దెల మీద ఆసక్తికర చర్చ నడుస్తోంది. దీనికి కారణం.. ఈ డీల్ రియాల్టీ మార్కెట్ లో కొత్త రికార్డుల్ని క్రియేట్ చేస్తున్నాయి. భారతదేశంలో తన మొదటి టెస్లా షోరూంను ముంబయిలో ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచంలోనే ఈవీ వాహనాల్లో తిరుగులేని అధిక్యతను ప్రదర్శించే టెస్లా,. భారత్ లో తన మొదటి షోరూంను ఓపెన్ చేయటం ద్వారా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మార్కెట్ అయిన భారత్ లో ఎంట్రీ ఇస్తున్నట్లుగా చెప్పాలి. టెస్లా తన మొదటి కారు లాంచ్ విషయంలో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడయ్యే 'మోడల్ వై' తో భారత మార్కెట్ లోకి ఎంట్రీ ఇవ్వాలని భావిస్తోంది. వచ్చే నెలలో ముంబయిలో టెస్లా అధికారిక షోరూం షురూ కానుంది. అనంతరం దేశ రాజధాని ఢిల్లీలో ఇంకో షోరూంను ఏర్పాటు చేయనున్నారు. ముంబయిలోని టెస్లా షోరూం ఏర్పాటు చేస్తున్న ల్యాండ్ కు సంబంధించిన లీజు వ్యవహారాల్ని సీఆర్ఈ మ్యాట్రిక్స్ యాక్సెస్ అనే సంస్థ చూస్తోంది. ముంబయిలోని అత్యంత ఖరీదైన వాణిజ్య ప్రదేశమైన బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లో టెస్లా షోరూం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఐదేళ్ల కాంటాక్టు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ ఐదేళ్ల లీజు ఎంతో తెలుసా? అక్షరాల రూ. 23.38 కోట్లుగా చెబుతున్నారు. మొత్తం 4 వేల చదరపు అడుగుల స్థలంలో షోరూంను ఏర్పాటు




చేయనున్నారు. వాణిజ్య ప్రదేశానికి సంబంధించి ఇంతటి భారీ డీల్ దేశంలోనే రికార్డుగా పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఇదే అత్యంత ఖరీదైన షోరూం లీజు డీల్ గా పేర్కొంటున్నారు. ముంబయి నార్త్ అవెన్యూలోని మేకర్ మాక్సిటీ అనే కమర్షియల్ కాంప్లెక్స్ లో టెస్లా.. షోరూం స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ లీజు ఒప్పందం కూడా రికార్డుగా పేర్కొంటున్నారు. మొదటి ఏడాది నెలకు రూ. 35.26 లక్షలు చొప్పున షోరూం లీజుకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఏటా పెంచుకుపోయే ఈ లీజు మొత్తం ఐదేళ్లకు ప్రతి నెలా రూ. 42.86 లక్షలుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలతో పాటు ముంబయి కుర్లా ప్రాంతంలోని లోధా లాజిస్టిక్స్ పార్కులో 24,565 చదరపు అడుగుల స్థలాన్ని వేర్ హౌస్ కోసం లీజుకు తీసుకున్నారు. ఐదేళ్ల కాలానికి రూ. 24.38 కోట్ల అద్దెను చెల్లించేందుకు వీలుగా ఒప్పందాలు కుదుర్చుకోవటం గమనార్హం. కార్ల అమ్మకాల సంగతి ఎలా ఉన్నా.. తమ కార్యకలాపాలకు అవసరమైన స్థలాన్ని అద్దెకు తీసుకునే లీజు మొత్తంలో మాత్రం టెస్లా సరికొత్త రికార్డుల్ని క్రియేట్ చేస్తుందని మాత్రం చెప్పక తప్పదు.

చురకలు

## సంపాదకీయం

# యుద్ధంలో నరమాంస భక్షకులు..!

నరమాంస భక్షకులు అనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించిన అంశం అత్యంత షాకింగ్ గా ఉంది. ఇందులో భాగంగా.. ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైన్యంలో నరమాంస భక్షకులు ఉన్నారని.. సైనికులను వారు తింటున్నారని.. ఈ విషయం గురించి ఇద్దరు రష్యన్ సైనికులు చర్చిస్తున్న ఫోన్ కాల్ ను ఉక్రెయిన్ మిలటరీ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించిందని అంటున్నారు. అవును... ఉక్రెయిన్ తో యుద్ధంలో ఫ్రంట్ లైన్ లలో పనిచేస్తున్న ఒక రష్యన్ సైనికుడు.. ఒక సహచరుడిని చంపి అతని శవాన్ని తిన్న తర్వాత మరణించాడని కైవ్ పోస్ట్ తెలిపింది. దీంతో ఈ విషయం ఒక్కసారిగా తీవ్ర సంచలనంగా మారింది. ఈ సందర్భంగా.. తన దేశస్థుడైన 'ఫోమా'ను చంపిన నరమాంస భక్షకుడైన 'బ్రెలోక్' గురించి ఇద్దరు రష్యన్ సైనికులు చర్చిస్తున్నట్లు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి! ఈ సమయంలో... బ్రెలోక్ అతన్ని తిన్నాడని.. అతన్ని బయటకు తీసుకెళ్లి రెండు వారాల పాటు తిన్నాడని మొదటి కాల్ చేసిన వ్యక్తి మరో వ్యక్తితో చెప్పారని న్యూయార్క్ పోస్ట్ వెల్లడించింది! అలా నరమాంసం తిన్న బెర్లోక్.. తరువాత చనిపోయి కనిపించినట్లు 'అవుట్ లెట్' తెలిపింది. దీంతో.. ఉక్రెయిన్ లో పోరాడటానికి రష్యా హంతకులు, నరమాంస భక్షకులను నియమించుకుందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. 2012లో నలుగురిని చంపి, 22 సంవత్సరాల జైలు శిక్ష విధించబడిన సఖాలిన్ కు చెందిన డెనిస్ గోరిన్ అనే వ్యక్తి.. అతడు చంపిన నలుగురిలో ఒకరి శరీరంలోని కొంత భాగాన్ని తిన్నాడని మాస్కో టైమ్స్ వెల్లడించింది! అయితే... ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరపున పోరాడటానికి అతను 2023 లో విడుదలయ్యాడని తెలిపింది. అతను యుద్ధంలో గాయపడ్డాడని పేర్కొంది! ఇదే సమయంలో.. 2008లో ఇద్దరు యువతులను చంపి వారి అవయవాలను వండుకుని తిన్న కేసులో దోషిగా తేలిన మరో నేరస్థుడు నికోలాయ్ ఒగోలోబియాక్ సైతం.. 2023 లో రష్యా తరపున పోరాడటానికి విడుదలయ్యాడని చెబుతున్నారు. అదేవిధంగా... ముగ్గురు పురుషులను చంపి వారి గుండెల్లో ఒకదాన్ని ఫ్రై చేసిన కేసులో జైలు శిక్ష విధించబడిన దోషి డిమిత్రి మాలిషెవ్ ను కూడా రష్యా యుద్ధరంగంలోకి పంపినట్లు చెబుతున్నారు.

**పుతిన్ పై జెలెన్ స్కీ కీలక వ్యాఖ్యలు!:** సైనికుల మృతదేహాల అప్పగింత వ్యవహారంలో రష్యా తీరును ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తప్పుపడుతున్నారు. ఇదే సమయంలో.. ఆ దేశంతో జరుగుతున్న శాంతి చర్చలపైనా సందేహం వ్యక్తం చేశారు. అదేవిధంగా... రష్యా సైనికుల మృతదేహాలను కూడా ఉక్రెయిన్ సైనికులుగా చూపుతూ తమకు అప్పగిస్తున్నారని జెలెన్ స్కీ ఆరోపించారు. అమెరికాను సంతృప్తిపరిచి, ఆంక్షల నుంచి తప్పించుకునేందుకే రష్యా అధ్యక్షుడు పుతిన్ శాంతి చర్చల పేరిట నాటకం ఆడుతున్నారని విమర్శించిన జెలెన్ స్కీ.. దీనివల్ల ఉక్రెయిన్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటుందని వ్యాఖ్యానించారు.

# తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి - జూన్ 24... పాలగుమ్మి పద్మరాజు జయంతి



తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పీ.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనం లోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లిష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది. "గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మికే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ "గాలివాన" మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది. ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి. అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఆయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవి. ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. ఆయన సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజుకు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. 'బంగారుపాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్‌వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనుకోని అతిథి'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు. దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజును 'మా గురువు గారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు. తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు. ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పాత్రికేయ దిగ్గజం జి.వి. కృపానిధి - జూన్ 24...జి.వి. కృపానిధి జయంతి



The Hindustan Times
INDIA INDEPENDENT : BRITISH RULE ENDS
THE HINDUSTAN TIMES
INDIRA GANDHI SHOT DEAD
Funeral fixed for Saturday; 12-day mourning
Attack near house by two security guards
Army moves into riot-hit Delhi
Rajiv Gandhi sworn in PM

తెలుగు నేలపై జన్మించి ఆంగ్ల పత్రికా రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తెలుగు వారు ఎందరో ఉన్నారు. అలా స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం కూడా తమ సత్తా చాటుకున్నారు. ఆంగ్ల భాషపై పట్టు, పాత్రికేయ విలువల పట్ల తమ నిబద్ధత నిరూపించు కున్నారు. అలాంటి వృత్తి నిబద్ధత కలిగిన వారిలో చాలా మంది పేర్లు నేటి తరానికీ తెలియవు. లంకా సుందరం, కోటంరాజు పున్నయ్య, మానికొండ చలపతి రావు, కోటంరాజు రామారావు, ఖాసా సుబ్బారావు, వరదరాజులు నాయుడు, జి.ఎస్ భార్గవ, జి.కె. రెడ్డి, కుందూరి ఈశ్వరదత్తు, సి. వై.చింతామణి, కె.వి రామశర్మ, మల్లాది రామారావు, జి.వి కృపానిధి, సి.వి.హెచ్ రావు, ఎ.ఎస్ రామన్, మొదలైన వారెందరో మేధావులు ఉన్నారు. వారిలో పలు ఆంగ్ల పత్రికలలో తన సత్తా చాటిన అనుభవశాలి, పత్రికా సంపాదకులు జి.వి. కృపానిధి ఒకరు. కృపానిధి 1896, జూన్ 24వ తేదీన కృష్ణా జిల్లా, మచిలీపట్నంలో జన్మించారు. అయన విద్యాభ్యాసం మచిలీపట్నంలో జరిగింది. తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎ.ఆనర్స్ చదివి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనారు. మద్రాసు న్యాయ కళాశాలలో చదివి బి.ఎల్.పట్టా పొందారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసు నుండి ఒక ఆంగ్ల దినపత్రిక ప్రారంభించాలని నిర్ణయించుకుని 1928, అక్టోబరు 28 నుండి స్వరాజ్య అనే ఆంగ్ల దినపత్రికను ప్రకటించారు. కృపానిధి పత్రికలో మొదట కార్యాలయ నిర్వహణలో బాధ్యత వహించి తరువాత పత్రికా సంపాదక వర్గంలో సహాయ సంపాదకుడిగా చేరారు. ఆ పత్రిక ప్రారంభం నుండి 1935లో నిలిచిపోయే సమయానికి మూడు నెలల ముందు వరకు ఈ పత్రికలో పనిచేశారు. అయన ఇండియన్ న్యూస్ క్రానికల్ అనే పత్రికను స్థాపించిన వారిలో ఒకరు. ఆ పత్రిక 1947–50ల మధ్యకాలంలో వెలువడింది. కృపానిధి ఈ పత్రికకు అసోసియేటెడ్ ఎడిటర్‌గా వ్యవహరించారు. స్వరాజ్య పత్రిక నుండి వచ్చిన తరువాత ఢిల్లీలో దేవదాస్ గాంధీ సంపాదకత్వంలో వచ్చిన హిందుస్తాన్ టైమ్స్ పత్రికలో స్పెషల్ కరెస్పాండెంట్‌గా ప్రవేశించి కొంత కాలం పార్లమెంట్ కార్యకలాపాలను నివేదించిన విలేఖరిగా ఆ పదవిలో ఉండి, ఆ తర్వాత పత్రిక సంయుక్త సంపాదకునిగా (జాయింట్ ఎడిటర్)గా పనిచేశారు. స్వాతంత్ర్య సముపార్జన తర్వాత కృపానిధి ఆ పత్రికకు కొంతకాలం అసోసియేట్ ఎడిటర్ హెూదాలో కూడ పనిచేశారు. ఆయన సుమారు 15 సంవత్సరాలు హిందుస్తాన్ టైమ్స్ పత్రికలో వివిధ హెూదాలలో పనిచేశారు. హిందుస్తాన్ టైమ్స్ పత్రిక నుండి బయటకు వచ్చి, తర్వాత సౌత్ ఇండియా బుక్ ట్రస్ట్ ఛైర్మన్‌గా మూడు సంవత్సరాలు పనిచేసారు. తన సేవలు పత్రికా రంగానికే పరిమితం కావాలని పునరాలోచించి, తిరిగి పత్రికా రంగంలోనికే వెళ్ళి, బెంగుళూరు నుండి వెలువడే డెక్కన్ హెరాల్డ్ దినపత్రికలో పోతన్ జోసెఫ్ తర్వాత సంపాదకులుగా చేరారు. ఆ పత్రికకు 1958 నుండి 1966 వరకు మధ్య కాలంలో సంపాదకునిగా పనిచేశారు. డెక్కన్ హెరాల్డ్ పత్రికనుండి విరమించిన తరువాత ఆయన బెంగళూరులోనే తన విశ్రాంత జీవితాన్ని గడుపుతూ ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా వివిధ పత్రికలకు రచనలు చేశారు. పాత్రికేయులుగా, సంపాదకులుగా ఆంగ్ల పత్రికలలో విశిష్ట సేవలందించిన తెలుగువారిగా, కీర్తి ప్రతిష్టలను గడించిన కృపానిధి తమ 75వ యేట 1970, మే 5వ తేదీన బెంగుళూరులో మరణించారు. జర్నలిస్టులకు ఆదర్శనీయులుగా, మార్గదర్శకులుగా నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# పుల్లెల శ్రీరామ చంద్రుని రచనలు భారతీయ తత్త్వ శాస్త్రానికి మార్గదర్శక దీప స్తంభాలు

## జూన్ 24... పుల్లెల శ్రీరామ చంద్రుని వర్ధంతి సందర్భంగా సంస్కృత తత్త్వ ప్రబోధకుడి జీవన యాత్ర



భారతీయ తత్వశాస్త్రం, వేదాంత సిద్ధాంతం, సంస్కృత సాహిత్య పరిష్కారానికి తన జీవితాన్నే అంకితం చేసుకున్న మహా మనిషి పుల్లెల శ్రీరామ చంద్రుడు (అక్టోబరు 24, 1927 – జూన్ 24, 2015). 20వ శతాబ్దపు భారతీయ పండిత లోకంలో ఆయన ఒక వెలుగొందిన నక్షత్రంగా నిలిచారు. సంస్కృత భాష పట్ల అపారమైన ప్రేమ, వేదాల మీద లోతైన అవగాహన, తత్త్వ గ్రంథాలపై నిబద్ధత, విశ్లేషణ సామర్థ్యం ఆయన్ను ఋషి సమానంగా చేసి మానవ సంస్కృతిలో అమర చరిత్రగా నిలిపాయి. ఆయన జీవితం ఒక నిరంతర విజ్ఞానాధ్యయన ప్రయాణం. జీవన ధ్యేయంగా సంస్కృతం, తత్త్వ చింతనను స్వీకరించి, అన్వేషణను, అధ్యయనాన్ని, బోధనను త్రిబంధంగా మలిచిన వారిలో పుల్లెల ప్రథమ శ్రేణిలో నిలిచారు. పాండిత్యంలో, వ్యాస రచనలో, ఉపనిషత్ వ్యాఖ్యానంలో, వేదాంత విశ్లేషణలో ఆయనకు సమకాలీనుల్లో సాటి లేరు. ఆయన పదునైన తత్త్వ దృష్టి, సారగ్రాహిత్యం, భాషా పటిమ ఆయన రచనల్లో ప్రతిఫలించి, భక్తజన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. 1927 అక్టోబరు 24న తూర్పుగోదావరి జిల్లా ఐనవోలు మండలం ఇందుపల్లి గ్రామంలో పుల్లెల సత్యనారాయణ శాస్త్రి, సత్యవతి దంపతులకు జన్మించిన శ్రీరామ చంద్రుడు చిన్ననాటి నుంచే పాండిత్య వాతావరణంలో ఎదిగారు. తండ్రి వద్దే పంచ కావ్యాలు, నైషధం, అనర్ఘ రాఘవం వంటి ప్రాచీన కావ్యాలను, సిద్ధాంత కౌముదిని అధ్యయనం చేశారు. ఆయన విద్యారంభం నరేంద్రపురం లోని సంస్కృత పాఠశాలలో మొదలై మైలాపూర్ సంస్కృత కళాశాలలో వేదాంత శిరోమణి విద్యతో పరిపుష్టి చెందింది. ఆంగ్ల భాషను వి.వెంకటాచలం అనే సహపాఠి వద్ద నేర్చుకొని, హిందీలో విశారదగా ఉత్తీర్ణులై మలికిపురం హైస్కూలులో హిందీ పండితుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. విద్య పట్ల ఉన్న అసాధారణ అభిరుచి ఆయనను అనేక విశ్వ విద్యాలయాల దాకా తీసుకెళ్లింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో అలంకార శాస్త్రంలో ఎం.ఎ., ఆంగ్లంలో ఎం.ఎ., హిందీలో ఎం.ఎ. పూర్తి చేశారు. 1966లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్.డి పొందారు. "Contributions of Panditaraja Jagannatha to Sanskrit Poetics" అనే అంశంపై చేసిన పరిశోధన ఆయన్ను తత్త్వ సాహిత్యంలో అధ్యయన శ్రేణి లోనూ, విశ్లేషణా దృష్టి లోనూ అగ్రగామిగా నిలిపింది. ఉద్యోగ జీవితంలో మలికిపురం నుండి అమలాపురం, వరంగల్, హైదరాబాద్, తిరుపతి వరకు వివిధ కళాశాలల్లో సంస్కృత పండితునిగా, లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో సంస్కృత విభాగ అధిపతిగా, సంస్కృత అకాడెమీ డైరెక్టర్‌గా, సురభారతి సమితి కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన బోధనా శైలి లోతైన తత్త్వాన్ని సరళంగా వివరిస్తూ, శిష్యులకు ఆధ్యాత్మిక అధ్యయనంలో ఆరాటాన్ని కలిగించేదిగా ఉండేది. ఆయన రచనలు భారతీయ తత్త్వ శాస్త్రానికి మార్గదర్శక దీప స్తంభాలు. ఉపనిషత్తులపై ఆయన చేసిన వ్యాఖ్యానాలు – ఐతరేయ, కేన, కఠ, మాండూక్య, ఇశావాస్య, శ్వేతాశ్వతర, బృహదారణ్యక %–% విశ్లేషణా దృష్టిలో, భాషా నైపుణ్యంలో, తత్త్వనిష్ఠలో అత్యున్నతంగా నిలిచాయి. వేదాంత ప్రసారం కోసం రాసిన శంకర విజయం, ఉపనిషత్తుల సారం, శ్రీరామకృష్ణ పరమహంస చరితం, భగవద్గీత భావ దీపిక, వేదాంత దర్శనం, భారతీయ తత్త్వశాస్త్ర పరిచయం వంటి గ్రంథాలు ఆధ్యాత్మిక విభూతుల దృష్టికీ, సాధారణ పాఠకుల ప్రశ్నలకూ సమాధానాలుగా నిలిచాయి. బ్రహ్మసూత్ర శంకర భాష్యానికి తెలుగులో వ్యాఖ్యానం, భరతముని నాట్య శాస్త్రానికి తెలుగు వ్యాఖ్యానం, మహాభారత. సార సంగ్రహం" తో పాటు, శ్రీ వాల్మీకి రామాయణము (అనువాదం – 10 సంపుటాలు), అలంకార శాస్త్రంలో 16 గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానం వ్రాసిన ఏకైక పండితులు పుల్లెల. తమ పదునాలుగవ యేట నుండి రచనలు చేయడం ప్రారంభించారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషలలో 200లకు పైగా పుస్తకాలను వెలువరించారు. ఆయన భాషాశైలి శాస్త్రీయంగా ఉండి కూడా అర్థవంతంగా ఉంటుంది. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం భాషల్లో సమానమైన పట్టు కలిగిన పుల్లెల శ్రీరామ చంద్రుడు మల్టీ లింగ్వల్ స్కాలర్‌గా అంతర్జా తీయంగా గుర్తింపు పొందారు. భాషల మధ్య మాధుర్యాన్ని, తత్త్వాల మధ్య అన్వయాన్ని, భావాల మధ్య సంస్కారాన్ని నిర్మించిన తత్త్వవేత్త ఆయన. ఆయనకు భారత ప్రభుత్వం 2011లో పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ నుండి ఉత్తమ అనువాద పురస్కారం (1996), ఉత్తమ సాహితీ విమర్శ పురస్కారం (2002) లభించాయి. బిర్లా ఫౌండేషన్ వాచస్పతి పురస్కారం (2004), మహామహోపాధ్యాయ బిరుదు, తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ (2011), కేంద్ర రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ గౌరవ డి.లిట్ (2013), సి.పి. బ్రౌన్ అకాడమీ తెలుగు భాషా పురస్కారం (2011) తదితర ఎన్నో అవార్డులతో ఆయన్ను సత్కరించారు. రాష్ట్రపతి పురస్కారం, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల విశిష్ట సత్కారాలు ఆయన సేవలకు గౌరవ సూచకాలు. విద్యార్థులపై ఆయనకున్న మక్కువ, ఉపాధ్యాయ ధర్మంపై ఆయనకున్న నిబద్ధత ఆయనను గౌరవప్రదమైన గురువుగా మార్చాయి. పరిశోధన పరంగా విద్యార్థులకు సహకరించడంలో ఆయన చిరస్థాయిగా గుర్తింపు పొందారు. జ్ఞానాన్ని వితరణగా పరిగణించి, అధ్యయనాన్ని సాధనగా స్వీకరించి, తన శిష్య బృందానికి దారి దీపంగా నిలిచారు. శిష్యులు ఆయనకు కనకాభిషేకం చేసి, తన తత్త్వ ప్రయాణానికి అక్షర సాక్ష్యం ఇచ్చారు. ఆయన చివరి రోజుల్లో అనారోగ్యంతో బాధ పడుతూ, 2015 జూన్ 24న హైదరాబాద్ బంజారా. హిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. భారతీయ తత్త్వ విజ్ఞానానికి జీవ రూపం ఇచ్చిన పుల్లెల శ్రీరామ చంద్రుడు, తన జీవితాన్ని ధర్మ సిద్ధాంతానికి, వేదాంత ప్రచారానికి అంకితం చేశారు. ఆయన రచనలు, బోధనలు, జీవన ఆదర్శం భావితరాలకు బోధనా చరిత్రగా నిలిచిపోతాయి. పుల్లెల శ్రీరామ చంద్రుడి జీవితకథ, భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞాన సముపార్జనకు వెలకట్టలేని సంపద. భావితరాల్ని ప్రభావితం చేసే ఆయన సాహిత్య ప్రస్థానం, తపస్సుతో కూడిన పాండిత్యం, నిరంతర అధ్యయన సంకల్పం భారతీయ సంస్కృతిని, తత్త్వ దృష్టిని పదిలంగా నిలిపే శాశ్వత దీపం. అలాంటి మహానుభావుని వర్ధంతి (జూన్ 24) రోజున మనం ఆయనకు జ్ఞాపకార్థాంజలి ఘటించాల్సిందే. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# కన్నప్ప సినిమా: విశ్వాసాల నేపథ్యంలో వివాదాల వేళ




తెలుగు సినిమా సాంస్కృతికంగా, మతపరంగా మూలాలు గల కథలను సినిమాటిక్ శైలిలో మలచడంలో విశిష్టమైన సంప్రదాయం కలిగి ఉంది. ప్రత్యేకించి భక్తి, మత విశ్వాసాల ఆధారంగా నిర్మించిన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ తరహా చిత్రాల్లో కేవలం సాంస్కృతిక శక్తిని ప్రతిబింబించడమే కాక, సమకాలీన రాజకీయ భావజాలం లేదా వర్గవిచారణల కోణం వలయంగా వివాదాల ముంగిట నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మంచు విష్ణు ప్రధాన పాత్రలో రూపుదిద్దుకుంటున్న "కన్నప్ప" చిత్రం తీవ్ర మతపరమైన చర్చకు కేంద్రబిందువుగా మారింది. పారంపర్య పౌరాణిక ఆధారాలు కలిగిన ఈ కథలో, కన్నప్ప అనే గిరిజన యువకుడు తన అమాయకమైన, ఆత్మార్పణ భక్తితో శివుడిని ప్రసన్నం చేసుకున్న తీరు వివరించబడుతుంది. దేవాలయ ఆచారాలను త్రోసిపెట్టి, కంటి చూపు సమర్పించడానికీ వెనుకాడని భక్తునిగా అతని భక్తి శివుని అనుగ్రహాన్ని పొందుతుంది. అయితే, ఈ కథను ఆధారంగా తీసుకుని తెరకెక్కిస్తున్న చిత్రం ప్రచారంలోకి రాగానే, ఇందులోని కొన్ని అంశాలపై బ్రాహ్మణ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. చిత్ర ఫస్ట్‌లుక్‌తోపాటు లీకైన కథాంశ వివరాలపై స్పందించినవారు, ఇందులో బ్రాహ్మణ పూజారులను మానవత్వం లేని అహంకారస్తులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. "భక్తికి కులం అవసరం లేదు, కానీ చరిత్రకు బాధ్యత ఉంది" అనే నినాదంతో, వేదమార్గాన్ని అపహాస్యం చేసే దిశగా చిత్రణ జరగకుండా చూసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హిందూ ధార్మిక సంస్థలు, ఆలయ అర్చక సంఘాలు ఈ సినిమాపై తీవ్ర అభ్యంతరాలు వెలిబుచ్చిన తరుణంలో, సినిమా విడుదలపై న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభమయ్యింది. అందులో భాగంగా, బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఫిలింలోని కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణ వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయంటూ, సినిమా విడుదలపై తాత్కాలిక నిషేధం విధించాలనే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ ఎస్. సుబ్బారెడ్డి, చిత్రం విడుదలైన తర్వాత అభ్యంతరకరమైన విషయాలున్నాయో లేదో పరిశీలించి, అవసరమైతే తొలగించేందుకు ఆదేశాలు ఇవ్వగలమన్నారు. తదుపరి విచారణ ఆగస్టు 1కి వాయిదా వేసినట్టయింది. ఈ వ్యవహారంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, %జదీఖీజ% (సెన్సార్ బోర్డు) సీఈఓ, ఏపీ ఫిల్మ్ ఛాంబర్, దర్శకుడు ముఖేష్ కుమార్, నటులు మోహన్ బాబు, విష్ణు తదితరులకు నోటీసులు జారీ చేయడం కూడా జరిగింది. చిత్రబృందం తరఫున మంచు విష్ణు స్పందిస్తూ %–% "ఈ సినిమా ఎలాంటి మతాన్ని అవమానించే ఉద్దేశంతో రూపొందించలేదని, శివునిపై అపారమైన భక్తితో రూపొందుతున్నదని" స్పష్టం చేశారు. అవసరమైతే మతపరమైన ప్రముఖులకు ప్రివ్యూలు చూపించేందుకు సిద్ధమన్నారు. అయినప్పటికీ, వివాదం తగ్గలేదు. దీనికి ముఖ్యంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ఊహాగానాలు, వాస్తవాలకు మించిన ప్రచారం కూడా కారణంగా కనిపిస్తోంది. ఇలాంటి సందర్భాలలో, గత చరిత్రను పరిశీలిస్తే %–% మణిరత్నం 'రావణన్'లో రామాయణ పాత్రలను రాజకీయ కోణంలో చిత్రీకరించిన తీరు, 'దాసావతారం'లో విగ్రహాల విసర్జన అంశంపై వచ్చిన అభ్యంతరాలు, 'ఆదిపురుష్'లో సంభాషణలపై చెలరేగిన విమర్శలు %–% ఇవన్నీ మతపరమైన సున్నిత అంశాలను చిత్రీకరించడంలో జాగ్రత్త అవసరమని నిరూపిస్తున్నాయి. ఇక ఒకవైపు వామపక్ష సాహిత్య విమర్శకులు కన్నప్ప వంటి గిరిజన భక్తులను వర్ణవ్యవస్థను ప్రశ్నించే చిహ్నాలుగా మలచేందుకు ప్రయత్నించడమూ, మరోవైపు మత పరిరక్షక వర్గాలు సంప్రదాయ చిత్రణకే కట్టుబడి ఉండాలన్న దృక్పథమూ %–% ఈ రెండూ కూడినప్పుడు కలతలు తలెత్తకమానవు. ఈ ఉదంతం మనకు ఒక ముఖ్యమైన తాత్విక పాఠాన్ని నేర్పుతుంది %–% భక్తి వ్యక్తిగతమైనదే అయినా, దాని ప్రతినిధిత్వం సామాజికంగా ప్రతిఫలించేది కావున, కళాకారులు, దర్శకులు తమ స్వేచ్ఛను సముచితమైన బాధ్యతతో వినియోగించాలి. మత విశ్వాసాలపై ఆధారపడిన చిత్రాలు హృదయాల్ని హత్తేలా ఉండాలే గాని, మతాల మధ్య విచ్ఛిన్నాన్ని పెంచేలా కాకూడదు. "జ్ఞానం %–% భక్తి %–% కార్యం" అనే త్రిమూర్తిస్వరూప ధర్మాన్ని ఆధారంగా తీసుకుని రూపొందించిన కళా రూపకల్పన, భక్తిని సామాజికంగా విశ్లేషించగలగాలి. "కన్నప్ప" సినిమా ఎంతవరకు ఈ దిశగా పయనిస్తుందో, తుది సినిమా విడుదలయ్యేంతవరకూ నిరీక్షించాల్సిందే. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## అడ్డదారులే అక్రమాలకు మూలాలు..!

సత్తుపల్లి : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఓ దశలో రాష్ట్రవ్యాప్తంగా అధికార యంత్రాంగం విస్తృతంగా దాడులు జరిపి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. అయితే ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో నిఘా నామమాత్రంగా ఉండటంతో ఇసుకాసురులు మళ్లీ తెలంగాణలోకి అడుగుపెడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈప్రాంతంలో కొందరు నాయకులు ఇసుక మాఫియాకు కొమ్ముకాస్తుండటంతోనే ఈ పరిస్థితి దాపురించిందనే వాదనలూ వినిపిస్తున్నాయి.

**అమాంతం పెరిగిన గిరాకీ**

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయటంతో ఈప్రాంతంలో ఇసుకకు గిరాకీ అమాంతం పెరిగింది. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్కారు ఉచితంగా ఇసుక అందజేస్తోంది. మణుగూరు రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అధిక ఖర్చు అవుతుండటంతో సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులు



ఏపీ నుంచి తెప్పించుకుంటున్నారు. పైగా మణుగూరు వద్ద రీచ్‌ల నుంచి లభించే దానికంటే ఏపీలోని రాజమహేంద్రవరం, విజయవాడ నుంచే వచ్చే ఇసుక బాగుంటుందని, సరసమైన ధరకు లభిస్తోందని చెబుతున్నారు. ప్రజల అవసరాన్ని కొందరు ఇసుకాసురులు అవకాశంగా మలచుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే కాకుండా ఇతర నిర్మాణాలు చేపడుతున్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తెలంగాణ ఖజానాకు గండికొడుతూ ఏపీ నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తూ అక్రమంగా దండుకుంటున్నారు. ఏపీలో టన్ను ఇసుక ధర రూ.250–300 పలికితే.. తెలంగాణలో టన్ను ఇసుకకు రూ.550 వరకు డీడీ చెల్లించాలి. ఒక్కో లారీకి ఏపీ ఇసుకకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు లాభం వస్తుండటంతో అక్రమార్కులు ఈ దందాకు తెరలేపారు. ఒక్క సత్తుపల్లి నియోజకవర్గానికే ఏపీ నుంచి రోజుకు 15–20 లారీల ఇసుక వస్తుందంటే అక్రమ వ్యాపారం ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు అడపాదడపా దాడులు జరిపి కేసులు నమోదుచేస్తున్నా ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. 'ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నాం. ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడితే చర్యలు తీసుకుంటాం' అని ఏసీపీ ఎ.రఘుకు తెలిపారు.

## ఆకాశం వైపు.. అన్నదాత చూపు

కొత్తగూడెం: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు ఊరించి ఊసూరుమనిపించాయి. మే మాసం ద్వితీయార్థంలోనే వానాకాలం మొదలైందని రైతులు భావించారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయటంతో జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ముందస్తు తొలకరి జల్లులకు విత్తనాలు విత్తుకున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ విత్తుకునేందుకు కొందరు సిద్ధమవుతుండగా.. మొలకలు ఎండిపోకుండా నీళ్లు పోసి కాపాడుకునేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. పగలు ఎండలు కాస్తున్నప్పటికీ సాయంత్రం పూట ఆకాశం మబ్బులు పడుతుండటంతో వర్షం కురుస్తుందని ఎదురుచూస్తున్న రైతులకు రోజూ నిరాశే ఎదురవుతోంది.

**ఐదు మండలాలు మినహా..**

జూలూరుపాడు, చండ్రుగొండ మండలాల్లో అధికంగా, టేకులపల్లి, సుజాతనగర్, అశ్వాపురం మండలాల్లో సాధారణ వర్షపాతం సంభవించగా.. మిగతా 18 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 18 నాటికి జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం 89.20మి.మీ. నమోదుకావాల్సి ఉండగా.. కేవలం 43.40మి.మీ. వర్షం కురిసింది. గతేడాది జూన్ మాసంలో సగటు (134.40మి.మీ.) కంటే ఎక్కువగా 227.60మి.మీ. వర్షపాతం నమోదైంది. అయితే ఈసారి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరకగూడెం మండలంలో సాధారణ వర్షపాతం 97.30మి.మీ. కాగా ఇప్పటివరకు 2.30మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. గుండాలలో 74.40మి.మీ.కు 10.30మి.మీ, పినపాకలో 96.70మి.మీ.కు 13.30మి.మీ. వర్షం నమోదైంది. మిగతా మండలాల్లోనూ ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నాయి.

**భగీరథ ప్రయత్నమే..**

కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి తదితర మండలాల్లోని రైతులు తొలకరి వర్షాలకు పత్తి, మొక్కజొన్న, పెసర విత్తనాలు నాటారు. అవన్నీ మొలకలు వచ్చాయి. వర్షాలు ముఖం చాటేయటంతో మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. బోర్లు, మోటార్లున్న రైతులు పొలాలను తడిపేందుకు స్ప్రింక్లర్లు వాడుతున్నారు. ఏ సౌకర్యం లేని కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తేనే పంటలకు ప్రాణం అన్నట్లుగా పరిస్థితులు మారాయి.

**కరవుకు సంకేతమా..?**

ఎండాకాలంలో వర్షాలు, వర్షాకాలంలో ఎండలు వచ్చేంతగా పరిస్థితులు మారిపోయాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలం జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ఉంటుంది. అవి ఈ ఏడాది వారం ముందే రుతుపవనాలు వచ్చేశాయి. ముందస్తు రాకను ముప్పునకు సంకేతంగా భావించాలని వాతావరణశాస్త్ర పరిశోధకులు చెబుతున్నారు. జూన్‌లో కురవాల్సిన వర్షపాతం కంటే లోటు ఎక్కువగా నమోదైంది. ఇది ఇలాగే కొనసాగితే కరవు పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశాలు ఉంటాయి. వర్షాధార పంటలపై ప్రభావం పడుతుంది. రైతులు తక్కువ నీరు అవసరమయ్యే పంటల వైపు దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సాధారణం కంటే తక్కువ పంటల సాగు**

పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు లేకపోవటంతో సాధారణం కంటే తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. జిల్లాలో రైతులు పత్తి–48,076, వరి–183, మొక్కజొన్న–659, పెసర–44 ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది ఇదే సమయానికి వరి–1,175, పత్తి–77,878, మొక్కజొన్న–594, కంది–490 ఎకరాల్లో సాగయ్యాయి. మరోవైపు జులై చివరి నాటికి విత్తనాలు విత్తుకునే అవకాశముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# వలపు వల.. చిక్కితే విలవిల



హైదరాబాద్: ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన యువతి హాయ్ అంటూ ముచ్చట్లు మొదలుపెడుతుంది. గంటల వ్యవధిలో చాటింగ్, కాల్ తర్వాత నేరుగా నగ్న వీడియో కాల్. నిజంగా యువతులు చేసినట్లు నమ్మితే నిండా మునిగినట్లే. సైబర్ నేరగాళ్లు డబ్బు కొట్టేయడానికి నగ్న వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. నేరగాళ్లు ఆన్‌లైన్, సోషల్‌మీడియా నుంచి యువతుల ఫొటోలు సేకరించి వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ డీపీలుగా పెట్టుకుని సందేశాలు పంపిస్తారు. నిజంగానే యువతి అని భ్రమపడి కొందరు చాటింగ్ చేస్తూ వీడియో కాల్ వరకూ వెళ్తుంటారు. అవతలి వ్యక్తులు తాము నగ్నంగా ఉన్నామని, మీరూ ఉండాలంటూ నమ్మించి వీడియో రికార్డు చేస్తారు. వాటిని కుటుంబ సభ్యులకు పంపిస్తామని, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని బెదిరించి డబ్బులు డబ్బులు డిమాండ్ చేస్తారు. వాస్తవానికి యువతుల పేరుతో సైబర్ నేరగాళ్లు అశ్లీల వెబ్‌సైట్ల నుంచి సేకరించిన నగ్న వీడియోలను వీడియో కాల్‌లో ప్రదర్శిస్తారు. తాజాగా ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని హనీ ట్రాప్ చేసి రూ.38 లక్షలు వసూలు చేసిన తీరు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలు, కాల్స్‌లో యువతి పేరుతో మాట్లాడితే నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**ఇవీ జాగ్రత్తలు**

సామాజిక మాధ్యమాల్లో అపరిచిత నంబర్ల నుంచి యువతుల ఫొటోలతో సందేశాలు వస్తే నమ్మొద్దు.

అపరిచిత నంబర్ల నుంచి నేరుగా వీడియోకాల్ వస్తే స్పందించొద్దు.

కొన్నిసార్లు మనం ఎలాంటి కాల్ మాట్లాడకున్నా, సామాజిక మాధ్యమాల నుంచి సేకరించిన ఫొటోలను నగ్నంగా మార్చి మోసగిస్తారు. వీటికి భయపడొద్దు. మోసం చేసినట్లు గుర్తిస్తే వాట్సప్, సామాజిక మాధ్యమాల్లో ఆయా నంబర్లపై రిపోర్టు చేసే వెసులుబాటు ఉంది. పదేపదే చేస్తే బ్లాక్ చేయాలి. మనం చేసిన రిపోర్టు ఆధారంగా ఆయా సంస్థలు చర్యలు తీసుకుంటాయి.

ఒకవేళ మోసపోతే నేరుగా 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా.. స్థానిక పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలి.

# సంరక్షణే అసలు సమస్య!



మల్యాల : పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద నాటుతున్న మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో పలుమార్లు నాటినచోటే మళ్లీ నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది జిల్లాలోని 18 మండలాల్లో 37.44 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించనట్లు అధికారులు తెలిపారు. అందులో 12 లక్షల మొక్కలను ఇళ్ల ఆవరణలో నాటడానికి గ్రామస్థులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కరివేపాకు, మునగ, జామ, నిమ్మ, పూల మొక్కలు అందజేస్తామన్నారు. రహదారుల పక్కన వేప, చింత, కానుగ తదితర మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**85 శాతం ఉంటేనే బిల్లుల మంజూరు** గ్రామాల్లో ఏటా నాటే మొక్కల సంరక్షణకు ప్రభుత్వం లక్షలాది రూపా యలు ఖర్చు చేస్తోంది. ప్రతి మండలంలో దాదాపు 1.50 లక్షల వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షించడానికి దాదాపు రూ.2 కోట్ల వరకు నిధులు వెచ్చిస్తున్నట్లు అధికారుల ద్వారా సమాచారం. గ్రామపంచాయతీ పరిధిలో నాటిన మొక్కల్లో 85 శాతం బతికితేనే నిధులు చెల్లించాలి. కానీ నాటిన మొక్కల్లో 25 నుంచి 50 శాతం వరకు మాత్రమే మనుగడ ఉంటోంది. మొక్కలు నాటిన ప్రాంతాన్ని వాటి వివరాలను ఉపాధి సిబ్బంది జియోట్యాగింగ్ విధానంతో అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొంటున్నా ఎక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయి, ఎన్ని కనుమరుగయ్యాయన్న వివరాలు మాత్రం వెల్లడించడంలేదు. పశువులు తొక్కడం, మేయడంతో మొక్కలు దక్కడంలేదని సిబ్బంది పేర్కొంటున్నారు. రహదారులు, ఇళ్ల ముందు నాటిన మొక్కలు ఎదిగిన తర్వాత కోతుల బెడద కారణంగా ఇంటి యజమానులు నరికేస్తున్నారు.

**నిధుల రికవరీ– రఘువరన్, డీఆర్డీవో జగిత్యాల**

ఈ సంవత్సరం జిల్లాలో 37.44 లక్షల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. నాటినవాటిలో 85 శాతం దక్కకపోతే ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, క్షేత్రసహాయకులదే బాధ్యత. ఉపాధి పనుల సామాజిక తనిఖీ సమయంలో విచారణ సిబ్బందికి మొక్కలు కనిపించకపోతే వారి నివేదిక ప్రకారం నిధులు రికవరీ చేస్తాం. మొక్కల జియోట్యాగింగ్ వివరాలను అటవీ అధికారులకు అందజేస్తే వారే సమాచారాన్ని ఎంట్రీ చేస్తారు.

# దాతల సాయం.. పాఠశాలకు జీవం




ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గతేడాది కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు పాఠశాలలో సౌకర్యాలు లేమితో మూతపడే స్థితికి చేరింది. ఈ క్రమంలో బదిలీపై నూతన ఉపాధ్యాయులు రావడంతో సంవత్సర కాలంలో పాఠశాల రూపురేఖలను మార్చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, పాఠశాలలో అభివృద్ధి పనులు అత్యవసరమని గుర్తించారు. ఇందుకోసం దాతలను సంప్రదించి విరాళాలు సేకరించి సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల సంఖ్యను 70కి పైగా పెంచారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తేనే తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కలిగి విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరిం చిన అచ్చ విజయభాస్కర్‌తో పాటు ఉపాధ్యాయులు భావించారు. గ్రామస్థులతో వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సమస్యలను గ్రామస్థుల దృష్టికి తీసుకెళ్లారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏడాదిలోనే సుమారు రూ.4 లక్షల వరకు విరాళాలు అందజేశారు. ఆ నిధులతో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, నీటిట్యాంకు, పైపుల పనులను పూర్తి చేయడం, పిల్లలు ఆడుకునే పరికరాలు, గోడలకు రంగులు, చిత్రాలు, పోడియం, ప్రింటర్, సీసీ కెమెరాల ఏర్పాటు, నెట్ సౌకర్యం కల్పించారు. గ్రామానికి చెందిన మంగిలిపల్లి మహిపాల్ విదేశాల్లో వ్యాపారం చేస్తుంటారు.

పాఠశాలలో మూత్రశాలల నిర్మాణం నిలిచి పోవడంతో పాటు ఇతర సమస్యలపై 'ఈనాడు'లో కథనం వచ్చింది. కథనానికి స్పందించి మొదట రూ.1.10 లక్షలతో మూత్రశాలల నిర్మాణం, నీటి సౌకర్యాన్ని పూర్తి చేయించారు. రూ.95 వేలతో పాఠశాల గోడలకు రంగులు, దేశ నాయకుల, ఇతర చిత్రాలను గీయం చడం, రూ.80 వేలతో పిల్లలు ఆడుకునే జారుడు బల్ల, ఉయ్యాల, ఇతర ఆట పరికరాలను ఏర్పాటు చేయించారు. పాఠశాల వార్షికోత్స వానికి రూ.15వేల నగదును మొత్తంగా రూ.3లక్షలు విరాళంగా అందించారు. **పెరిగిన విద్యార్థుల సంఖ్య– విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయుడు** పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు ముందుకు వస్తున్నారు. వారి సాయంతో పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన బోధన, వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతుండడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. పాఠశాల అభివృద్ధికి మహిపాల్ రూ.3 లక్షల వరకు అందజేశారు.

## మురుగు.. కనుమరుగయ్యేలా..

ఖమ్మం : గతేడాది భారీ వర్షాలకు వరద ముంచెత్తటంతో ఖమ్మం నగరవాసులు విలవిలలాడారు. గతంలో కృష్ణాజలాలు పారిన ఎన్నెస్పీ కాల్వ ఇప్పుడు దుర్గంధభరితంగా మారింది. హరిత ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా చెరువులు, మున్నేరులోకి కలుషిత జలాలు చేరుతున్నాయి. స్వచ్ఛ ఖమ్మం కల సాకారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో అమృత్ పథకంలో భాగంగా తొలివిడతలో రూ.239కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**పూడిక మట్టితో కట్ట ఎత్తు పెంచి..**

అమృత్ నిధులతో ఖమ్మం నగరంలో ఎన్నెస్పీ కాల్వను విస్తరించటంతో పాటు యూజీడీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మించాల్సి ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో వరద ముప్పు పొంచి ఉండటంతో ఎన్నెస్పీ కాల్వలో పూడిక తీశారు. కాల్వను విస్తరించి పూడిక మట్టితో కట్ట ఎత్తు పెంచారు. కవేళా ప్రాంతంలోని అబ్బులేకాలం కాలనీలో ఎన్నెస్పీ కాల్వ పక్కనే యూజీడీ పనులు చేపడుతున్నారు. భూమిలో కాల్వ తవ్వి పైపులు వేశాక పూడ్చేసి మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడత నిధులతో 8.30కి.మీ. వరకు యూజీడీ పైప్‌లైన్ వేయాల్సి ఉండగా.. ఇల్లెందు రోడ్డు, అయ్యప్ప దేవాలయం, బైపాస్, సీతార్థ టవర్స్, కవేళా ప్రాంతం, ఖానాపురం హవేలీ పరిధిలో 3.10కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి.

**ఊరచెరువుకు విముక్తి**

పట్టణీకరణతో 30ఏళ్లలో పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకొని మూడు



డ్రైనేజీ జోన్ల పరిధిలో యూజీడీ పనులు చేపడుతున్నారు. నగరంలో ప్రతి ఇంటికీ 150 లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. అందులో 80శాతం నీరు తిరిగి మురుగుకాల్వల్లోకి చేరుతుందని అంచనా. కలుషిత జలాలు 35 మురుగుకాల్వల ద్వారా ఖానాపురం హవేలీలోని ఊరచెరువు, ఎన్నెస్పీ కాల్వ, పుట్టకోట చెరువులోకి ప్రవహిస్తున్నాయి. యూజీడీ ఏర్పాటుతో ఊరచెరువు, ఎన్నెస్పీ కాల్వలోకి వృథానీరు చేరదు. జల కాలుష్యం తగ్గుతుంది. ఆ డ్రైనేజ్‌నంతటినీ యూజీడీ మ్యాన్‌హోల్ ద్వారా పైప్‌లైన్లకు అనుసంధానిస్తారు. వర్షాకాలంలో వరదనీరు ఎన్నెస్పీ కాల్వలో ప్రవహిస్తుంది. మిగిలిన కాలాల్లో కాల్వ ఖాళీగా ఉంటుంది. మ్యాన్‌హోల్సను శుభ్రపరచటానికి కార్మికుల అవసరం లేకుండా జెట్టింగ్ మిషన్ వాడనున్నారు. యూజీడీ పైప్‌లైన్లను దిగువనున్న పుట్టకోట, ధంసలాపురం చెరువులకు అనుసంధానిస్తారు. మురుగునీరు చెరువులో కలవటానికి ముందు ఎస్టీపీ ద్వారా శుద్ధి చేస్తారు. ఇందుకోసం ధంసలాపురంలో 44 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే), పుట్టకోటలో 9.50 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ఎస్టీపీలు నిర్మించనున్నారు. వాటి నుంచి శుద్ధజలాలు చెరువుల్లో కలుస్తాయి. నగరం విస్తరించాక.. శుద్ధజలాలను రివర్స్ పంపింగ్ ద్వారా పరిసర కాలనీల్లోని ఉద్యానవనాలకు పంపి మురుగుదొడ్లు, పలు అవసరాలకు వినియోగించనున్నారు. 'అమృత్ నిధులతో చేపట్టే యూజీడీ, ఎస్టీపీల నిర్వహణ బాధ్యత పదేళ్ల వరకు గుత్తేదారుదే'నని మున్సిపల్ ప్రజారోగ్యశాఖ ఎస్ఈ వి.రంజిత్ 'ఈనాడు'కు తెలిపారు.

కేఎంసీ పరిధిలో అమృత్ పథకం స్వరూపం

యూజీడీ ప్రాజెక్టు విలువ: రూ.1,439కోట్లు

మొదటి విడతలో మంజూరైన నిధులు: రూ.239కోట్లు

చేపడుతున్న పనులు: ఎస్టీపీలు, యూజీడీ, ఎన్నెస్పీ కాల్వ విస్తరణ

పనుల గడువు: 2026 మార్చి 31

ప్రయోజనం పొందనున్న ప్రజలు: 3 లక్షలు

యూజీడీ నిర్మించే డివిజన్లు: 1 నుంచి 12, 14–16, 20, 21, 41.

## దోమలపై యుద్ధానికి సన్నద్ధం

కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతుండటంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దోమల నివారణపై దృష్టి సారించింది. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 8వేల మంది జ్వర బాధితులు అధికారికంగా తేలారు. చాలామంది జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇలాంటి పరిస్థితులను వర్షాల సీజన్ ముందే పసిగట్టి దోమల నివారణకు అధికారులు యత్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 29 పీహెచ్‌సీలు, 6 యూపీహెచ్‌సీలు, 234 ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు మండల వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సమన్వయంతోనే సాధ్యం: నగరపాలిక, పురపాలికలు, గ్రామ పంచాయతీల్లోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్స్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. ఇలాంటి ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారే ప్రమాదం పొంచి ఉంది. బహిరంగ ప్రదేశాల్లోని తాగి పడేసిన కొబ్బరి బోండాలు కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఇలాంటి వాటిల్లో దోమలు సత్వరంగా వృద్ధి చెందే ఆస్కారం ఉంది. ప్రభుత్వ శాఖల సమన్వయంతో దోమల నియంత్రణకు మురుగు కాల్వలు, నీటి గుంతల్లో లార్వాలను ధ్వంసం చేసే ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టాలి. వైద్య, ఆరోగ్య శాఖ దోమల నివారణకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుకు నగరపాలిక/పురపాలికలు, గ్రామ పంచాయతీల సమన్వయం తప్పనిసరి. వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. ప్రతి ఇళ్లల్లో డ్రై డే పాటించేలా అవగాహన పెంపొందించాలని ఆశా కార్యకర్తలను సూచించాం.ఎల్.భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా జ్వరాల బాధితులు: 8,856

జ్వర బాధితుల్లో తేలిన టైఫాయిడ్ కేసులు: 110మలేరియా కేసులు: 33డీఎఫ్ కేసులు: 30డీవీ కేసులు: 03డెంగీ కేసులు: 05అందుబాటులో నివారణ అస్త్రాలు..

గంబూషియా చేపలు: 2 లక్షలుఆయిల్ బాల్స్: 20,000

# బాల్యం.. వ్యాయామ విద్యకు దూరం

సిరిసిల్ల : నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావటంతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. సెలవుల్లో ఎక్కువ శాతం ఇళ్లలో గడపటంతో స్నేహితులతో ఆటలాడటానికి, చదువుకోవటానికి పాఠశాలలకు వెళ్తున్నారు. అయితే జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరంగా ఉంటున్నారు. క్రీడల్లో వారికి మార్గదర్శనం చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. జిల్లాలోని ఒక్క ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**వసతులు కూడా అంతంతమాత్రమే**

జిల్లాలో 109 జడ్పీహెచ్ఎస్, 1 యూఆర్ఎస్, 13 కేజీబీవీ, 2 జీహెచ్ఎస్, 336 ఎంపీపీఎస్, 38 ఎంపీయూపీఎస్‌లు ఉన్నాయి. మొత్తం 51 పీడీలు, 4 పీఈటీలు ఉన్నారు. వీరంతా ఉన్నత పాఠశాలల విద్యార్థులకే వ్యాయామ విద్య బోధిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లాలోని 38 ఎంపీయూపీఎస్‌లో ఒక్కరు లేరు. ప్రాథమిక పాఠశాలల్లోనూ పీఈటీలను నియమించాలని ప్రతిపాదనలు ఉన్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. పలు ఉన్నత పాఠశాలల్లో క్రీడలకు



సరైన వసతులు లేవు. క్రీడా మైదానం ఇరుకుగా ఉండటం, ఆట వస్తువులు లేకపోవడం లాంటి సమస్యలు ఉన్నాయి.

సిరిసిల్ల అంబేద్కర్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు ఉన్నప్పటికీ వసతులు సరిగ్గా లేవు. క్రీడామైదానం ఇరుగ్గా ఉంది.

రగుడు మండల ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 60 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పుస్తకాలతో కుస్తీ పట్టటం తప్ప వ్యాయామ విద్యకు నోచుకోవడం లేదు. జిల్లాలోని 38 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల పరిస్థితి అంతే ఉంది.

**ఆటలతో మెదడు చురుకు**

విద్యార్థులు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ మార్కులు, ర్యాంకులు అంటూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మెదడు చురుగ్గా ఉంటుంది. దీనికి ఆటలు దోహదపడతాయి. ఈ విషయంపై ప్రభుత్వం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం చదువుల పేరుతో ఒత్తిడి చేస్తున్నారే తప్ప క్రీడల వైపు వారిని ప్రోత్సహించటం లేదు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి. చైనా, పాశ్చాత్య తదితర ప్రపంచ దేశాలు ప్రాథమిక స్థాయిలోనే పిల్లలోని ప్రతిభను గుర్తించి ఆటల్లో సాన పెడుతున్నాయి. దీంతో అవి ఒలంపిక్స్ వంటి ప్రపంచ స్థాయి పోటీల్లో పతకాలు కొల్లగొడుతున్నాయి. పిల్లలు ఆడుకోవటం వారి ప్రాథమిక హక్కుగా యునెస్కో గతంలోనే తీర్మానించింది. ఇటీవల ప్రఖ్యాత వైద్య జర్నల్ లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం దేశ వ్యాప్తంగా అయిదేళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు వారిలో 1.25 కోట్ల మంది ఊబకాయులు ఉన్నారు. ర్యాంకులు, మార్కులు చుట్టూనే తిరుగుతున్న అశాస్త్రీయ విద్యావ్యవస్థ చిన్నారుల్లో స్థూలకాయ సమస్య పెరుగుదలకు ప్రధాన కారణమవుతోంది.

# నైపుణ్య శిక్షణకు నాంది

దుద్యాల: నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా యువతకు వివిధ రకాల నైపుణ్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్న ప్రభుత్వం తాజాగా నియోజకవర్గానికి ఒక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దుద్యాల మండలం హకీంపేటకు ఏటీసీని మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. సర్వే నెంబరు 252లో నాలుగెకరాల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

**టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో..**

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు వివిధ రకాల నైపుణ్య కోర్సులను అందించనున్నారు. ఈ కోర్సులను చదివితే యువతకు పరిశ్రమల్లో ఉపాధి లభించే అవకాశాలుంటాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దుద్యాల మండలంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో వివిధ రకాల పరిశ్రమలు




ఏర్పాటయ్యే అవకాశముంది. ఏటీసీతో ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరు కోర్సులు.. 244 సీట్లు..**

ఏటీసీలో ఆరు కోర్సులు ప్రవేశపెడుతున్నారు. మొత్తం 244 సీట్లు అందుబాటులో ఉంటాయి. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్ కోర్సు. దీని కాలవ్యవధి రెండేళ్లు. 48 సీట్లు ఉంటాయి. ఏడాది వ్యవధి ఉన్న ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సులో 20 సీట్లు అందుబాటులో ఉంటాయి. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్) కోర్సు కాల పరిమితి రెండేళ్లు. సీట్లు 48 ఉంటాయి. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్ కోర్సు కాలపరిమితి ఏడాది. ఇందులో 40 సీట్లు ఉంటాయి. మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులో 48 సీట్లు ఉంటాయి. దీని వ్యవధి రెండేళ్లు. మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సు కాలపరిమితి ఏడాది. ఇందులో 40 సీట్లు ఉంటాయి.

# నీటి వనరు.. కబ్జాలు కనరు



హైదరాబాద్: హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చే జలాశయాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దాదాపు 1.30 కోట్ల ప్రజలకు జలమండలి 550 ఎంజీడీలే (మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే) సరఫరా చేస్తోంది. ఇందులో సుమారు 40 నుంచి 50 ఎంజీడీలు జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి తీసుకుంటున్నారు. కీలకమైన ఈ జలశయాలు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి.

**తగ్గిన సామర్థ్యం..**

జంట జలాశయాల పరిధిలో నిర్మాణాలు చేపట్టకూడదనే ఆదేశాలున్నాయి. నీటి నిల్వ పరిధి, మరో 100 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేయకూడదు. పరిసర ప్రాంతాల్లోనూ ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదని జీవో 111 విడుదల చేశారు. బఫర్‌జోన్ దాటి ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మాణాలు చేపట్టారు. రిసార్టులు, అతిథిగృహాలు, కన్వెన్షన్ సెంటర్లు, ఫామ్ హౌస్‌ల పేరుతో వందల నిర్మాణాలు వెలిశాయి. రోజుకు 32 మిలియన్ గ్యాలన్లు సరఫరా చేయాల్సిన హిమాయత్ సాగర్ ప్రస్తుతం 8 ఎంజీడీలే అందిస్తోంది. రోజుకు 18 ఎంజీడీలు అందించాల్సిన గండిపేట నిల్వ సామర్థ్యం 40శాతం తగ్గిపోయింది. హిమాయత్‌సాగర్ పరిధిలో 150 వరకు అక్రమ కట్టడాలను గుర్తించారు. గండిపేట జలాశయం చుట్టూ మరో వందకుపైగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని మురుగును నేరుగా జలాశయాల్లోకే వదులుతున్నారు.


అజీజ్‌నగర్, బాకారాం జాగీర్, నాగిరెడ్డిగూడ, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, కవ్వగూడ, నర్కూడ పరిధిలో 59.25 ఎకరాలు కబ్జాకు గురైంది.

నీరు కలుషితం కాకుండా అధికారులు పర్యవేక్షించాలి. నివాసాలు, రిసార్టుల నుంచి మలమూత్రాలు, మురుగును వీటిలోకి వదిలేస్తున్నారు. వర్షాకాలంలో చెరువులు పూర్తిగా నిండినా రెండు జలాశయాల నుంచి 25 ఎంజీడీలకు మించి సరఫరా కావడం లేదు.

**జీవో 111 అంటే ఇలాగేనా..?**

జలాశయాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో 1996లో జీవో 111ను జారీ చేశారు. దీని ప్రకారం జలాశయం చుట్టూ 15 కి.మీ.ల పరిధిలో నిర్మాణాలు నిషేధించారు. కొత్తగా నివాసిత ప్రాంత లేఅవుట్‌లు వేయరాదు. జీవో 111ను కొద్దిగా సవరిస్తూ గత ప్రభుత్వం జీవో 69ను జారీ చేసింది. ఈ పరిధిలో మొత్తం 84 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా కొత్త నిర్మాణాలు జరిగాయి. జలాశయాల చుట్టూ రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు వెలిశాయి. నిబంధనలు మాత్రం అమలు కాలేదు. జలాశయాల కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

# పర్యాటక రంగం.. ఆశాభంగం



హైదరాబాద్: భాగ్యనగర పర్యాటకంపై ఉదాసీనత కొనసాగుతోంది. నూతన విధానం అందుబాటులోకి వచ్చినా కార్యాచరణతో ముందుకు సాగడంలేదు. నగరం నుంచి ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు వివిధ పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేసే లక్ష్యం కార్యరూపం దాల్చడంలేదు. చార్మినార్, పైగా టూంబ్స్, లాడ్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్‌లను అనుసంధానం చేస్తూ చార్మినార్ క్లస్టర్‌ను గోల్కొండ, కుతుబ్‌షాహీ టూంబ్స్, తారామతి బారాదరి, ప్రేమామతిలతో గోల్కొండ క్లస్టర్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలపై ఉదాసీనత కొనసాగుతోంది. ఆర్కియాలజీ, కేంద్ర, సాంస్కృతిక శాఖలు, హెచ్ఎండీఏ మధ్య సమన్వయ లోపం సమస్యలకు దారి తీస్తోంది.

**అన్నీ చూడలేక**

నగరంలో అనేక పర్యాటక ఆకర్షణలున్నా కొన్నింటికే ఆదరణ ఉంటోంది. ప్రధానంగా సందర్శకులు చార్మినార్, గోల్కొండ, బిర్లామందిర్, ఎన్టీఆర్ గార్డెన్, హుస్సేన్‌సాగర్‌కు పరిమితమవుతున్నారు. ఎంతో చారిత్రక వారసత్వ సంపద కలిగి ఉన్న మ్యూజియంలు 3 ఉన్నా ఎక్కువమంది వీటిని సందర్శించడం లేదు. సాలార్‌జంగ్ మ్యూజియానికే తాకిడి ఉంటోంది. నిజాం మ్యూజియం ఉందని తెలిసిన వాళ్లే వెళ్తున్నారు. స్టేట్ మ్యూజియానికి సందర్శకులు కరవయ్యారు. పురావస్తుశాఖ కార్యాలయ ఆవరణలోని శ్రీశైలం పెవిలియన్ మూతపడింది. ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఒకప్పటి ఆకర్షణలు లేవు. చాలామంది అటువైపే చూడటం లేదు. లుంబినీ పార్కు, హుస్సేన్‌సాగర్ బోటింగ్‌కు మాత్రం ఆదరణ తగ్గడంలేదు. గోల్కొండకు వెళ్లేవారు విధిగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు వెళ్లాలనుకున్నా.. అక్కడ కనీస వసతుల్లేవు. బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ పార్కు వంటివి స్థానికులకే పరిమితం అయ్యాయి. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ పర్యాటకంలో పూర్తిస్థాయిలో అంతర్భాగం కాలేదు. ఇటీవల జరిగిన ప్రపంచ సుందరి పోటీల్లో నగర పర్యాటకానికి ఎంతో ప్రచారం లభించింది. సుందరీమణులు కొన్ని ప్రాంతాలనే చూశారు. మెడికల్ టూరిజంలో పర్యాటకశాఖ పాత్ర నామమాత్రమేనని చెప్పొచ్చు.

# టోకెన్ సేకరించి.. టోకున తరలించి



రామడుగు: రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కార్యదర్శులు లబ్ధిదారులకు జారీ చేసిన టోకెన్లను సేకరించి.. అక్రమ దందా కొనసాగిస్తున్నారు. కోరిటపల్లి, షానగర్, గోలిరామయ్యపల్లి, రుద్రారం, మోతె, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లోని మోతె వాగు నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. రామడుగు నుంచి పెగడపల్లి, కోరిటపల్లి నుంచి గంగాధర, వన్నారం నుంచి కొత్తపల్లి, కరీంనగర్ మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ముందు బైక్.. వెనుక ట్రాక్టర్..**

రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారంతా ట్రాక్టర్‌కు ముందు బైకును పంపిస్తారు. ఎక్కడా ఇబ్బంది లేదని చెబితే.. ముందుకెళ్తారు. ఎక్కడైనా పోలీసులు, అధికారులు తనిఖీలు జరిగినట్లు కనిపిస్తే.. బైక్ వాళ్లు వెనుక వచ్చే ట్రాక్టర్‌ను అప్రమత్తం చేస్తారు. ఇలా అధికారులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. రోజుకు సుమారు వంద ట్రాక్టర్లు మోతె వాగు నుంచి తరలిపోతున్నాయి.

నిత్యం అక్రమ రవాణాకు పాల్పడేందుకు ఆయా గ్రామాల మలుపు వద్ద కొంతమందితో నిఘా ఏర్పాటు చేసుకొని దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పోలీసు వాహనం స్టేషన్ నుంచి బయలుదేరగానే నిఘా యువకులు సెల్‌ఫోన్ల ద్వారా ట్రాక్టర్ డ్రైవర్లకు సమాచారం ఇవ్వడంతో ఎవరికీ చిక్కకుండా పోతున్నారు.

**అనుమతికి మించి..**

మండలంలో 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. దీని కోసం ఇసుకను ఉచితంగా అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో ఇంటికి వివిధ దశల్లో 25 క్యూబిక్ మీటర్ల(పది ట్రాక్టర్లు) ఇసుకను ప్రభుత్వం అనుమతించింది. లబ్ధిదారుల పేరిట పంచాయతీ కార్యదర్శులు టోకెన్లు జారీ చేశారు. వీటిని సేకరించి ట్రాక్టర్ల యజమానులు పక్క మండలాలకు ఇసుకను తరలిస్తున్నారు. మోతె వాగుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఎక్కడా అధికారుల తనిఖీ లేకపోవడంతో అక్రమ రవాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు కింద రూ.వేయి తీసుకుంటున్నారు. ఇది బాగానే ఉన్నా.. ఇక్కడి ఇసుకను పక్క మండలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇతరులకు ట్రాక్టర్ ట్రిప్పు రూ.5 వేలు దండుకుంటున్నారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మోతె వాగుకు ఆనుకొని ఉన్న రైతులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు. రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

నా దృష్టికి రాలేదు– రాజేశ్వరి, తహసీల్దార్

మోతె వాగు నుంచి ఇతర మండలాలకు ఇసుక అక్రమ రవాణా నా దృష్టికి రాలేదు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందజేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు టోకెన్లు జారీ చేశారు. స్థానికంగా రీచ్ లేనందున లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ఇసుక రవాణాకు ఛార్జీలపై నిర్దిష్ట ఆదేశాలు రాలేదు.

# గణనీయంగా సన్నాల సాగు!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వం నిరుదు వానాకాలం, యాసంగిల్లో సన్నగింజ ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి కొనుగోలు చేయటంతో ఈ వానాకాలంలోనూ సన్నగింజ వరి రకాల సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. మేలైన సన్నగింజ వరిరకాల విత్తనాలను రైతులకు ఇవ్వటం, సన్నాల సాగులో సమస్యల నివారణ, బోనస్ ఆలస్యం చేయకుండా సకాలంలో చెల్లించటం తదితరాలు రైతులకు చేదోడుగా నిలవనున్నాయి.

ఉమ్మడి జిల్లా రైతులు నిరుదు వానాకాలంలో 9.82 లక్షల ఎకరాల్లో వరి సాగుచేయగా ఇందులో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డుగింజ రకాలు, 3.76 లక్షల ఎకరాల్లో సన్నగింజ రకాలున్నాయి. ఈ వానాకాలంలోనూ ఇదేస్థాయిలో సన్నగింజరకాలను సాగుచేసే అవకాశముంది. సన్నగింజ రకాల్లో సుడిదోమల వంటి చీడపీడల తీవ్రత చాలాఎక్కువగా ఉంటుండటం, సస్యరక్షణ ఖర్చు, మందుల పిచికారీశ్రమ, లోతట్టు వందూరు భూములు అధికంగా ఉండటంతో దొడ్డుగింజ రకాలు కూడా అధికంగానే నార్లు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో చీడపీడలను తట్టుకునే వంగడాలను ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ధాన్యం ఫైన్‌రకాలకు క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,303 మద్దతు ధరుంది. కేంద్రం క్వింటాలుకు రూ.69 చొప్పున పెంచిన ధరలు 2025 సెప్టెంబరు నుంచి ఏడాదిపాటు అమల్లో ఉంటాయి. మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ.500 చొప్పున



బోనస్‌ను రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుంది. నిరుదు వానాకాలం, ఈ యాసంగిల్లో బోనస్ చెల్లింపులో తీవ్రజాప్యంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ముమ్ముందు బోనస్ చెల్లింపు జాప్యాన్ని నివారించాలి.

**అనువైన రకాలు**

నిరుదు వానాకాలంలో 33 సన్నగింజ రకాలను ప్రభుత్వం గుర్తించగా నిబంధనల మేరకున్న జైశ్రీరాం తదితర రకాలను కూడా కొనుగోలు చేశారు. గింజ పొడవు 6 మి.మీ కన్నా తక్కువ, వెడల్పు 2 మి.మీ కన్నా తక్కువుండాలి. పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మి.మీ.కంటే ఎక్కువుండాలి. గింజను గ్రెయిన్ కాలిపర్ మిషన్‌లో వేసి పొడవు, వెడల్పు కొలుస్తారు. జగిత్యాల పరిశోధనస్థానంలో రూపొందించిన జేజీఎల్1798, జేజీఎల్3844, జేజీఎల్3855, జేజీఎల్11727, జేజీఎల్11118, జేజీఎల్17004, జేజీఎల్11470, జేజీఎల్28545, జేజీఎల్27356, జేజీఎల్384, జేజీఎల్3828, కూనారం పరిశోధనస్థానం రకాలు కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, వరంగల్ పరిశోధనస్థానానికి చెందిన రకాలు వరంగల్962, వరంగల్1119, వరంగల్44, వరంగల్347, వరంగల్14, వరంగల్32100, వరంగల్697, రాజేంద్రనగర్ రకాలైన ఆర్ఎన్ఆర్15048(తెలంగాణసోన), ఆర్ఎన్ఆర్21278, ఆర్ఎన్2458, ఆర్ఎన్ఆర్2354, ఆర్ఎన్ఆర్2465, ఆర్ఎన్ఆర్2874, కేఎంఎస్2874, హెచ్ఎంటీ సోనా, బాపట్లకు చెందిన బీపీటీ5204, బీపీటీ 2595, మారుటేరుకు చెందిన ఎంటీయూ1262, ఎంటీయూ1271, ఎంటీయూ1282, నెల్లూరుకు చెందిన ఎన్‌డీఎల్ఆర్7, ఎన్ఎల్ఆర్34449, రుద్రూరు తదితర పరిశోధనస్థానాలనుంచి రూపొందించిన రకాలతో పాటు మరికొన్ని ప్రైవేటు సన్నగింజ రకాలు కూడా ఉన్నాయి.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడి

– డాక్టర్ బి.శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త, జగిత్యాల పరిశోధనస్థానం


130 రోజుల పంటకాలంగల మధ్యకాలిక రకాలను జులై 10 వరకు, 120 రోజుల పంటకాలంగల స్వల్పకాలిక రకాలతో జులై నెలాఖరువరకు నార్లు పోసుకోవచ్చు. ఏ రకమైనా ఆగస్టు నెలాఖరులోపు నాట్లు పూర్తిచేయాలి. నేలల స్థితిగతులు, గతంలోని సాగు అనుభవాలనుబట్టి సన్నరకాలను ఎన్నుకోవాలి. రైతులు తోటిరైతుల వద్ద రైతువిత్తనాన్ని లేదా గతంలో మినీకిట్సుగా తీసుకున్న సన్నవిత్తనాలను కూడా సాగుచేయవచ్చు. సన్నాల్లోనూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడిని పొందవచ్చు.

# గోదావరి పుష్కరాలపై కసరత్తు

ధర్మపురి: మరో రెండేళ్లలో జరగనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటినుంచే సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలయిన ధర్మపురి, కోటిలింగాల, మంథని, కాళేశ్వరంలలో పుష్కర ఘాట్లపై ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. జులై 23, 2027 నుంచి 12 రోజులపాటు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందుకుగానూ ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లి అక్కడి ఏర్పాట్లను రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు పరిశీలించి వచ్చారు. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం లాంటి పుణ్యక్షేత్రాల ద్వారా గోదావరి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో.. ఇందుకోసం రూ.50 కోట్ల వరకు వెచ్చించాలని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా ధర్మపురి క్షేత్రానికి ప్రాధాన్యతనివ్వనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 17 చోట్ల..**

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా



రామయ్యర్ ఆదేశాలతో గత నెలలో పర్యాటక, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకున్నారు. తాజాగా రెండ్రోజుల కిందట దేవాదాయశాఖ కమిషనర్ పుష్కరాల ఏర్పాట్లపై ప్రాథమికంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈవోలతో చర్చించారు. ఉమ్మడి జిల్లాలో ధర్మపురి, కోటిలింగాల, మంథని వద్ద 17 ఘాట్లను ప్రాథమికంగా గుర్తించారు.

**పెద్ద ఎత్తున ఏర్పాట్లు**

ధర్మపురిలో గతంలో సంతోషిమాతా, మంగళిఘాట్, సోమవిహార్, మహాలక్ష్మి పుష్కరఘాట్లను నిర్మించారు. ఏఏ క్షేత్రాల్లో ఎంతమంది హాజరయ్యారో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. నూతన ఘాట్ల నిర్మాణం అవసరం ఉందా? ఉంటే ఎక్కడ నిర్మించాలనే దానిపై ప్రాథమికంగా చర్చించారు. గతంలో నిర్మించినవాటి పరిస్థితి ఎలా ఉంది? మరమ్మతులు అవసరాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తానికి రానున్న పుష్కరాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పెద్దఎత్తున ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతోంది.

# హద్దుమీరి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : నిన్న మొన్నటి దాకా హెచ్‌సీయూ వివాదం సుప్రీంకోర్టులో కొనసాగింది. పచ్చని చెట్లను ధ్వంసం చేయడంతో కోర్టు అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించింది. ఈ సంఘటనతోనైనా మేడ్చల్‌జిల్లా అటవీశాఖ అధికారులు జాగ్రత్త పడకపోగా..యథేచ్ఛగా అటవీ భూమిలోకి చొరపడే అవకాశాన్ని కొంతమందికి కల్పించింది. వివాదాస్పదమైన భూమిలో చెట్లను నరికినా..అబ్బే అదేం వివాదం కాదు.. మేమే ఆ పని చేయించామని చెబుతున్నారు. ఇది మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని అటవీ భూముల్లోనే జరిగింది. కొద్ది రోజులుగా అటవీ భూమిని ఆక్రమించేందుకు చెట్లను నరికేస్తున్నారనే ఫిర్యాదులు అధికారులకు వెళ్తున్నా దృష్టి సారించకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

**ఇంత జరుగుతున్నా...:** శామీర్‌పేట్ బాహ్య వలయ రహదారికి ఆరు



కిలోమీటర్ల దూరంలోని పొన్నాల గ్రామ పరిధిలోని అటవీభూములు సర్వే నంబరులో 130లో 240 ఎకరాలున్నాయి. దీనికి సమీపంలోనే కొంతమంది పట్టాభూములున్నాయి. వాళ్లే ఈ అటవీభూముల్లో తమకు సంబంధించిన పదెకరాల భూమి ఉందని అటవీశాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆ శాఖలోని కొంతమంది అధికారుల సహకారంతోనే మూడురోజులుగా కొందరు జేసీబీతో దాదాపుగా మూడు మీటర్ల వెడల్పులో కిలోమీటరు దూరం అడ్డుగా ఉన్న చెట్లను నరికేశారు. స్థానికుల ఫిర్యాదుతో శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి.. సిబ్బందిని పంపించి జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. రూ.20వేల జరిమానా విధించారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు మేమే చేయాలని చెప్పామని ఫోన్ చేసి చెప్పారు. లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వాలని కోరితే మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని తహసీల్దార్ తెలిపారు. ఈ భూమిలో సర్వే చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదన్నారు.

**సంయుక్త సర్వే**

కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాం. అందులోనూ స్పష్టత రాకపోవడంతో మూడురోజుల క్రితం చైన్ సర్వే చేసేందుకు జేసీబీతో చదును చేయించామని ఫారెస్ట్ రేంజర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎక్కడా చెట్లు నరికివేయలేదని, ముళ్లకంపలు, పొదలు మాత్రమే తొలగించామని వివరించారు.

# భూ భారతి అమలుకు యంత్రాంగం సన్నద్ధం

సిరిసిల్ల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ-భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టం-2025 తీసుకొచ్చింది. జిల్లాలో రుద్రంగి పైలెట్ మండలంలోనే కాకుండా మిగతా రెవెన్యూ గ్రామాల్లోనూ నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. రుద్రంగి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు ఉన్న రైతుల నుంచి 1253 దరఖాస్తులను స్వీకరించింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిశీలన జరుగుతోంది. సమస్యల స్థాయిని బట్టి మండల, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తారు. జిల్లాలో రెవెన్యూ డివిజన్లు 02, మండలాలు 13, రెవెన్యూ గ్రామాలు 171 ఉన్నాయి. ఈనెల 16న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవగాహన సదస్సులో పాల్గొని పలు అంశాలను వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్-2న భూ-భారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముందు క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి పలు చర్యలు తీసుకుంటున్నారు.

**నేడు జీపీవోల నియామకానికి అర్హత పరీక్ష**



ప్రస్తుతం గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు లేరు. మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. జిల్లాలో 172 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటికి జీపీవో (గ్రామ పరిపాలనాధికారి)ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రెవెన్యూ విభాగంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఇతర శాఖలకు వెళ్లారు. వీరిలో తిరిగి రెవెన్యూశాఖకు వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా 85 దరఖాస్తులు రాగా అందులో అర్హులైన 64 మందికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. దీనిలో అర్హత సాధించిన వారిని జీపీవోలుగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని తర్వాత మిగతా ఖాళీల భర్తీకి కొత్తగా నోటిఫికేషన్ వేస్తారా? ఉన్నవారినే డిప్యూటేషన్‌పై నియమిస్తారా అన్న విషయం తేలాల్సి ఉంది. మరోవైపు గ్రామాల్లో భూతగాదాల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నారు. ఆసక్తి ఉన్న కొత్తవారికి శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**అసైన్డ్ కమిటీల ఏర్పాటు**

ప్రభుత్వ భూముల పంపిణీ, అర్హుల ఎంపికకు గతంలో స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన అసైన్డ్ కమిటీలు ఉండేవి. గత ప్రభుత్వంలో ఈ కమిటీలు లేవు. భూ-భారతి చట్టంలో అసైన్డ్ భూముల సమస్యలు ఎక్కువే ఉంటున్నాయి. ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసినట్లుగా పట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం భూములు లేవు. కొన్నిచోట్ల హద్దులు చూపించలేదు. అసైన్డ్ కమిటీలను పునరుద్ధరించి శాస్త్రీయంగా సర్వే నిర్వహించి సాగుచేసుకుని జీవనం సాగిస్తున్న వారికే ప్రభుత్వ భూములను అసైన్డ్ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిలో భాగంగా త్వరలో నియోజకవర్గానికి ఒక అసైన్డ్ కమిటీని నియమించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భూ-భారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక నిబంధనలు ఉండటంతో అర్జీదారుల్లో ఆశలు చిగురించాయి. తెల్లకాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ కేసుపై కోర్టులో స్టే ఉంది. తీర్పువచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లోని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# మోసగాళ్లకు మ్యాట్రి'మనీ'



హైదరాబాద్: కలకాలం తోడుండాల్సిన జీవిత భాగస్వామి అర్థాంతరంగా తనువుచాలిస్తే ఆ వేదన వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితుల్లో మరో తోడు కోసం ఎదురుచూస్తున్న మహిళలే లక్ష్యంగా కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో రిజిస్ట్రేషన్ చేసుకొని కొత్త జీవితం ప్రారంభిద్దామంటూ వంచిస్తున్నారు. నకిలీ ప్రొఫైళ్లతో నమ్మించి.. రూ.కోట్లు కాజేస్తున్నారు. మోసపోయిన వారిలో ఒంటరి మహిళలే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**అచ్చం అలాంటి నేపథ్యంతో**

భాగస్వామిని కోల్పోయి, విడిపోయి దూరంగా ఉంటున్న వారు పిల్లల భవిష్యత్తు, ఒంటరిగా ఉండలేక రెండో వివాహానికి సిద్ధమవుతుంటారు. వీరి పరిస్థితుల్ని అవకాశంగా తీసుకుంటున్న మోసగాళ్లు. అచ్చం అలాంటి నేపథ్యంతో ప్రొఫైళ్లు సృష్టిస్తున్నారు. ఎవరైనా వివాహ ప్రతిపాదన పెడితే స్పందించి.. మోసం మొదలు పెడుతున్నారు.

**విదేశీ సంబంధం అమ్మో..!**

సాధారణంగా విదేశీ సంబంధాలంటే యువతుల తల్లిదండ్రులు ఆసక్తి ప్రదర్శిస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారికి నచ్చే రీతిలో నకిలీ ప్రొఫైళ్లు తయారుచేసి రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. పెళ్లి ప్రస్తావన తెస్తే.. అమెరికాలో ఉద్యోగమని కొన్ని నెలల్లోనే తిరిగొస్తామని చెబుతూ డబ్బు కొట్టేస్తున్నారు.

**ఒక్కడే 24 మందికి టోకరా**

జూబ్లీహిల్స్‌కు చెందిన వైద్యురాలికి మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో ఓ వ్యక్తి పెళ్లి చేసుకుందామని ప్రతిపాదన తెచ్చాడు. ఆమె అంగీకరించింది. తన తల్లి అమెరికాలో వైద్యురాలని.. ఆమె భారత్‌కు రాగానే పెళ్లి చేసుకుందామని నమ్మించి.. రూ.10.94 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. నిందితుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో 24 మంది మహిళల్ని మోసగించినట్లు దర్యాప్తులో తేలింది.

భర్తను కోల్పోయిన ఐటీ ఉద్యోగి రెండో పెళ్లికి సిద్ధమైంది. మ్యాట్రిమోనిలో అమెరికాలోని వైద్యుడి నుంచి ప్రతిపాదన వచ్చింది. 3 నెలల్లో భారత్‌కు వచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమె వద్ద రూ.7 లక్షలు వసూలు చేశాడు. తర్వాత స్పందన లేకపోవడంతో మోసపోయానని తెలుసుకుంది.

**ఇవీ జాగ్రత్తలు**

మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో సంబంధాలను కచ్చితంగా నిర్ధారించుకున్నాకే ముందుకెళ్లాలి

కేవలం ఫోన్ ద్వారా కాకుండా కాబోయే భాగస్వామి ఇంటికెళ్లి మాట్లాడుకోవాలి

ఆన్‌లైన్ పరిచయంతో డబ్బు పంపకూడదు.

విదేశాల్లో ఉన్నట్లు చెబితే ఇక్కడ ఉండే వారి తల్లిదండ్రుల్ని కలిసి వివరాలు తెలుసుకోవాలి.

# ఆక్రమణలపై ఉక్కుపాదం.. ఆహ్లాదానికి అభయం



శేరిలింగంపల్లి : హైటెక్‌సిటీ ప్రాంతంలోని రెండు ప్రధాన చెరువులు తమ్మిడికుంట, సున్నంచెరువులను హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకప్పుడు సాగునీరు, తాగునీరు అందించిన ఈ చెరువులకు పూర్వవైభవం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మోటార్లతో మురుగునీటిని మొత్తం ఖాళీ చేయించి పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. చెరువు కట్టను బలోపేతం చేస్తూ చుట్టూ బండ్ నిర్మిస్తున్నారు. మొత్తం రూ.18 కోట్ల అంచనా వ్యయంతో రెండు చెరువులు అభివృద్ధి చేస్తున్నారు. పూడికతీత, చెరువు చుట్టూ బండ్, కంచె నిర్మాణం, వాకింగ్, సైకిల్ ట్రాక్, పూలమొక్కల పెంపకంతోపాటు ముఖద్వారం నిర్మాణంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

**కబ్జాల నుంచి విముక్తి..**

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులో సున్నంచెరువు విస్తరించి ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సున్నంచెరువును స్వయంగా పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

శిల్పారామం ఎదురుగా దాదాపు 30 ఎకరాల్లో తమ్మిడిచెరువు విస్తరించి ఉంది. చెరువులో కొంతభాగం శిల్పారామం పార్కింగ్ కోసం గతంలో పూడ్చివేశారు. మరోవైపు ఓ సినీనటుడు కన్వెన్షన్ సెంటర్ నిర్మించగా, కొందరు ఎఫ్‌టీఎల్‌లో షెడ్లు నిర్మించారు. గతేడాది రంగంలోకి దిగిన హైడ్రా ఎన్ కన్వెన్షన్‌తోపాటు ఎఫ్‌టీఎల్‌లో షెడ్లను నేలమట్టం చేసింది. ఇప్పుడు చెరువు అభివృద్ధి చేసే క్రమంలో పూడికతీత పనులు సాగుతున్నాయి. మరోవైపు చెరువు బండ్‌ను బలోపేతం చేస్తున్నారు.

ఆరు నెలల్లో పూర్తి: నాగరాజు ఏఈఈ, ఇరిగేషన్ విభాగం, జీహెచ్‌ఎంసీ ఈ రెండు చెరువుల్లో పూడిక పనులు సాగుతున్నాయి. రోజు 600 ట్రిప్పుల పూడిక బయటకు తరలిస్తున్నారు. మరో పక్షం రోజుల్లో పూడిక పనులు పూర్తి చేసి తర్వాత బండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ముందు చెరువు పునరుద్ధరణ పూర్తి చేసి తర్వాత సుందరీకరణ పనులు చేపడతాం. మొత్తం ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

# పగలు మర్కటాలు.. రాత్రి అడవి పందులు



వీర్నపల్లి: పంటల సాగులో ఆది నుంచీ అన్నదాతలకు ఇబ్బందులు పరిపాటిగా మారాయి. నీటి ఎద్దడితో పంటను కాపాడుకున్న కర్షకుల శ్రమకు చివరిలో కోత పడుతోంది. అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తుతోంది. మరోవైపు అటవీప్రాంతంలో ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలపై వన్యప్రాణులు నిత్యం దాడులు చేస్తూ అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పగలు కోతులు, రాత్రి అడవిపందుల దాడులతో దిక్కుతోచని దుస్థితి ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో యాసంగిలో 1.74 లక్షల ఎకరాల్లో అన్నదాతలు వరిసాగు చేశారు. 242 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదట్లో రైస్ మిల్లుల కేటాయింపులో ఆలస్యం కారణంగా ప్రక్రియ నెమ్మదిగా సాగింది. సాంకేతిక సమస్యలు పరిష్కరించినప్పటికీ ప్రస్తుతం లారీల రాకలో జాప్యం, హమాలీల కొరతతో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోంది.

**రక్షణ చర్యలు చేపడుతున్నా..**

గతంలో ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్లను పంపిణీ చేసింది. భారీ పరిమాణం ఉన్న ఈ ప్లాస్టిక్ పరదాలను వర్షాలు కురిసినప్పుడు అన్నదాతలు వినియోగించేవారు. ప్రస్తుతం టార్పాలిన్ల పంపిణీ లేకపోవడంతో చీరలతో కుట్టిన పరదాల్లో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వానలకు కుప్పల చుట్టూ వరద నీరు నిలుస్తోంది. నేల తడితో కిందిభాగంలో ఉన్న గింజలు పూర్తిగా మొలకెత్తుతున్నాయి. రక్షణ చర్యలు చేపడుతున్నప్పటికీ కోతులు, అడవి పందుల దాడులు ఆగడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల్లోని అటవీ సరిహద్దు గ్రామాల్లో అడవి జంతువుల బెడద ఎక్కువైంది. మొలకల వాసనకు రాత్రి సమయంలో అడవి పందులు కుప్పల వద్దకు చేరుతున్నాయి. అడుగున ఉన్న మొలకలను తినేందుకు ధాన్యం కుప్పను చిందరవందర చేస్తున్నాయి.

**వేకువజామున కాపలా కాస్తున్నా**

నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించా. సుమారు 200 బస్తాలు తూకం వేసి పెట్టారు. తరలింపులో ఆలస్యం జరుగుతోంది. వారం రోజులుగా అడవి పందులు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై దాడులు చేస్తున్నాయి. వర్షం కురుస్తున్నా వేకువజామున వచ్చి కాపలాగా ఉంటున్నా. హుస్సేన్, వన్‌పల్లి

**కంటిమీద కునుకు లేదు** ధాన్యం తరలింపులో ప్రభుత్వ యంత్రాంగం చాలా జాప్యం చేస్తుంది. వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు. యాభై రోజుల క్రితం ధాన్యం కోతచేపట్టి కేంద్రానికి తరలించా. దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేశారు. సుమారు 50 క్వింటాళ్ల వరకు సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది. వర్షాలకు ధాన్యం మొలకెత్తుతోంది. వేకువజామున పందులు దాడిలో రెండు క్వింటాళ్ల వరకు నష్టం జరిగింది. గునుగుల దేవేందర్‌రెడ్డి, రైతు, వన్‌పల్లి

# అతివల హితం.. నగదు రహితం

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం కాపులపల్లిలోని స్వశక్తి సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు, రుణ వాయిదాల డబ్బును వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్వాహకురాలికి అప్పగించారు. ఆమె సంఘాల ఖాతాల్లో జమ చేయలేదు. తర్వాత గుర్తించిన సభ్యురాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలో స్వశక్తి మహిళలు నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించారు. అయితే నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా వీవోఏ (గ్రామైక్య సంఘం) ప్రతినిధులకు ఇచ్చారు. వారు ఖాతాల్లో జమ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు అందుబాటులో లేకపోవడంతో పొదుపు సొమ్ము, రుణ కిస్తీల చెల్లింపులో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకులో



జమ చేయకుండా డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సెర్ప్ కార్యాచరణ చేపట్టింది. జిల్లాకు ఒక మండలంలో ప్రయోగాత్మకంగా నగదు రహిత లావాదేవీలపై అతివలకు అవగాహన కల్పించేందుకు సన్నద్ధమవుతోంది.

**పక్కదారి పడుతున్న పొదుపు సొమ్ము**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 42,504 సంఘాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.2,555.15 కోట్ల రుణ లక్ష్యం విధించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేకపోవడంతో మహిళలు స్థానిక సీఎస్‌సీ కేంద్రాలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన రుణ కిస్తీ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఖాతాలో జమ కాలేదని గుర్తించిన తర్వాత బాధితులు ప్రశ్నించినా బాధ్యులు చేతులెత్తేస్తుండటంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

**ఇదీ ప్రణాళిక..**

ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని నగదు రహిత లావాదేవీల అమలుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేస్తారు.

రుణ కిస్తీ, పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తారు.

ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై సభ్యుల సందేహాలు నివృత్తి చేస్తారు. సభ్యులు ఇంటి వద్దనే ఉంటూ బ్యాంకు ఖాతాకు నగదు చెల్లించేలా సన్నద్ధం చేస్తారు.

ప్రతి లావాదేవీకి రశీదు

స్వశక్తి మహిళలు ఇప్పటి వరకు బ్యాంకు లావాదేవీల సమయంలో రశీదులు తీసుకోవడం లేదు. నమ్మకంతో పొదుపు రుణ కిస్తులు చెల్లిస్తున్నా ఏదో ఒక చోట మోసాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి తావు లేకుండా డిజిటల్ బ్యాంకింగ్ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సభ్యురాలూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పిస్తాం. రవికుమార్, అదనపు ప్రాజెక్టు అధికారి, సెర్ప్

# మరోసారీ ముంపు ముప్పు!

ఖమ్మం: వర్షాకాలం సమీపిస్తుండటంతో ఖమ్మం జిల్లాలోని నగరపాలిక, పురపాలికల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యే లోతట్టు ప్రాంతాలకు ఈసారీ ముంపు ముప్పు తప్పేలా లేదు. ముందస్తు సన్నద్ధత చర్యల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖమ్మంలో కన్నీరు'మున్నేరు'..**

ఖమ్మం నగరంలో మున్నేరు పరీవాహక కాలనీలు సారథినగర్, మంచికంటినగర్, వెంకటేశ్వరకాలనీ, పద్మావతినగర్, కాలొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్ గతేడాది జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం కాలనీలకు ఏటా వరద ముప్పు తప్పటం లేదు. వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మున్నేరుకు రెండువైపులా చేపట్టిన కరకట్టల నిర్మాణ పనులు కొనసా..గుతున్నాయి. నిజాంపేట, చెరువుబజార్, వరదయ్యనగర్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల వెంట మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కాల్వలు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మురుగుకాల్వల ఆక్రమణలతో పరిస్థితి మరింత దిగజారింది. ఈసారి వరద తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమించి.. స్థానికంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తామని తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత, సహాయక చర్యలపై 100 రోజుల ప్రణాళికను జూన్ 2 నుంచి అమలుచేస్తామన్నారు.

**మధిరలో మారని తీరు**

మధిర అంబారిపేట పెద్దచెరువుకు రాతి కరకట్ట లేకపోవటం వల్ల ఏటా వానాకాలంలో వరదరాఘవాపురం, హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీకి వరదనీరు పోటెత్తుతుంది. మట్టి కట్ట స్థానంలో కిలోమీటరు మేర రాతికట్ట నిర్మిస్తేనే ముంపు సమస్యకు కొంత అడ్డుకట్ట వేయొచ్చు. బంజారాకాలనీ, లడక్‌బజార్‌లో వరద కాల్వ ఆక్రమణకు గురవటం వల్ల చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి, రహదారులపైకి భారీగా వరద నీరు చేరుతుంది.

కరకట్ట నిర్మాణం కలేనా? వైరా

నల్లచెరువు వాగు నిండి ఏటా ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోంది. సుమారు 200 ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఇక్కడ ముంపు నివారణకు కరకట్ట నిర్మించాలనే డిమాండ్ 15ఏళ్లుగా అమలుకు నోచుకోవటం లేదు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే సమీపంలోని రాజీవ్‌కాలనీకి వరద పోటెత్తుతుంది. ఏటా తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్రంబజార్, శాంతినగర్, సంతబజార్‌లు ఏటా వరద గుప్పిట్లో చిక్కుకుంటాయి. మురుగునీటి వ్యవస్థను పటిష్ఠపరిస్తేనే ముంపు ముప్పు తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

సత్తుపల్లిరాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌ను ఏటా వరదనీరు ముంచెత్తుతుంది. శివారు ప్రాంతాలను ఆనుకుని ఉన్న మురుగుకాల్వలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపు ముప్పును తప్పించవచ్చు.

# తరువు బాధ్యత తరుణికి!

డోన్ : పట్టణాల్లో పచ్చదనం పెంపుపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. అమృత్ 2.0 అమల్లో భాగంగా ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అమృత్ మిత్రలను నియమించారు. ఉమెన్ ఫర్ ట్రీస్ (మొక్కల పెంపకంలో మహిళ) పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) నుంచీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఖాళీ స్థలాలను మెప్మా అధికారులు ఎంపిక చేశారు. మొత్తం 2,990 మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 854 వరకు నాటారు. 'మొక్కల పెంపకంలో మహిళ కార్యక్రమం' అమల్లో భాగంగా బృందాలను ఏర్పాటు చేశారు.. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులుంటారు.



వారే సంరక్షణ బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. వంద మొక్కలు నాటి ఆరు నెలల పాటు వాటి చుట్టూ పాదులు తీయడం, ఎరువులు చల్లడం, నీటిని అందించడం వంటి సంరక్షణ బాధ్యతలు చేపట్టిన ఒక్కో సంఘానికి రూ.3.39 లక్షలు కేటాయించనున్నారు. నిర్వహణ ఖర్చు, రీప్లాంటేషన్ (అవసరమైతే) కోసం నెలకు రూ.2,500 ఇలా వంద మొక్కలకు కలిపి ఆరు నెలలకు రూ.39 వేలు ఇవ్వనున్నారు. పర్సనల్ కాస్ట్ కింద రూ.3 లక్షలు ప్రతిపాదించారు. ఇందులో ఎన్ఆర్‌హెచ్ఎమ్ మ్యాన్‌పవర్ ఛార్జీల కింద నెలకు ఒక్కో మహిళకు రూ.10వేల చొప్పున ఐదుగురు సభ్యులకు రూ.50 వేలు కాగా.. ఆరు నెలలకు ఐదుగురికి రూ.3 లక్షలు కేటాయిస్తారు.

# అక్రమార్కుల కబంద హస్తాల్లో ..

చీపురుపల్లి : వంగర మండలం శివ్వాంలో మంగళచెరువు గర్భం వాస్తవ విస్తీర్ణం 16.14 ఎకరాలు. ఇందులో సుమారు 12 ఎకరాలు ఆక్రమణకు గురై కాలువలా తయారైంది. ఇదే గ్రామంలో కొత్తచెరువు, బలగ చెరువు, అరసాడలో కొత్త చెరువు, బారిక బందను ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. టీడీకే పురంలో 30 ఎకరాల విస్తీర్ణం గల సన్యాసి చెరువు 20 ఎకరాల మేర కబ్జాకు గురైంది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని డీటీ రమణారావు తెలిపారు. అక్రమార్కుల ధన దాహానికి అడ్డులేకుండా పోతోంది. కొండ, గుట్ట, గెడ్డ, వాగు, చెరువు, ప్రభుత్వ స్థలాలు కావేవీ ఆక్రమణకు అనర్హం అన్నట్లు విర్రవీగిపోతున్నారు. ఆయకట్టు పొలాలకు సాగునీరు.. భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పూర్వీకులు తవ్వించిన చెరువులు ఆక్రమణల చెరలో చిక్కుకుని కుచించుకుపోతున్నాయి. దీనికితోడు యథేచ్ఛగా జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలతో గర్భాలు ఛిద్రమవుతున్నాయి. చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో ఆక్రమణలు, అక్రమ తవ్వకాలతో చెరువులు అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. ఫలితంగా ఖరీఫ్‌లో వర్షాధారంతో సాగుచేసే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**అడ్డుకట్ట ఏదీ?**

గుర్ల మండలం గుజ్జింగవలస నాయుడు చెరువు గర్భమంతా మట్టి, కంకర అక్రమ తవ్వకాలతో మదుముల వద్దకు నీరు చేరడం లేదు. మండలంలోని 367 చెరువుల్లో చాలాచోట్ల ఇదే పరిస్థితి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఆదిలక్ష్మి తెలిపారు. గరివిడి మండలం బొండపల్లి పరిధిలో 20 ఎకరాల విస్తీర్ణం గల రామల చెరువు గర్భంలో 7 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని, కొండశంభాం పరిధిలో గెడ్డవాగును పూడ్చేసి అక్రమ నిర్మాణాలు చేశారని అధికారులకు ఫిర్యాదులందాయి. శివరాంలో 24 ఎకరాల విస్తీర్ణం ఉన్న లక్ష్మణరావు చెరువు గర్భంలో సుమారు 9 ఎకరాలు



ఆక్రమించి పొలాల్లో కలిపేసుకున్నారు. సత్వర చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దారు బంగార్రాజు తెలిపారు.

చీపురుపల్లి మండలం ఎలకలపేటలో ఎర్రచెరువు మట్టి తవ్వకాలతో రూపుకోల్పోయింది. గర్భం లోతై మదుములకు నీరందని పరిస్థితి నెలకొందని 23.32 హెక్టార్ల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసకుంటామని తహసీల్దారు ధర్మరాజు చెప్పారు.

రేగిడి మండలం లింగాలవలసలో 30 ఎకరాల ఆయకట్టుకు ఆధారమైన గొల్లబంద 15 ఎకరాల్లో 4 ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్వే జరిపించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కృష్ణలత తెలిపారు.

గరివిడి- గర్భాం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఎర్రచెరువు గర్భం చాలావరకు మాయమైంది. రోడ్డును ఆనుకుని ఉన్న ఈ చెరువు గర్భాన్ని చాలావరకు మట్టితో కప్పేసి వివిధ రకాల భవనాలు నిర్మించారు. గర్భం కుచించుకుపోవడంతో సుమారు 30 హెక్టార్లకు సాగునీరు అందడంలేదు. చెరువు పక్కనే ఉన్న బంగారమ్మ కాలనీ ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టి మమ అనేశారు.

# నక్కపల్లిలో బొమ్మల తయారీ పరిశ్రమ



నక్కపల్లి : పారిశ్రామికాభివృద్ధి దిశగా నక్కపల్లి మండలంలో వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే బల్క్ డ్రగ్ పార్కు, మిత్తల్ స్టీల్ పరిశ్రమలు ఖరారు కాగా, తాజాగా బొమ్మల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. రాజయ్యపేట, అమలాపురం, చందనాడ, డీఎల్‌పురం తదితర తీర ప్రాంతాల్లో సుమారు 4,300 ఎకరాల భూమిని సేకరించారు. కొన్ని గ్రామాల్లో ఇళ్లను తొలగిస్తుండగా, బాధితులకు పరిహారం చెల్లించారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన భూముల్లో 1800 ఎకరాలు బల్క్‌డ్రగ్ పార్కుకు, రెండు వేల ఎకరాలకుపైగా మిత్తల్ స్టీల్‌కు కేటాయించనున్నారు. బల్క్‌డ్రగ్‌కు మరింత భూమి అవసరం కావడంతో పెదతీనార్ల, సీహెచ్ఎల్‌పురం రెవెన్యూ ప్రాంతాల్లో మరో 800 ఎకరాల వరకు సేకరిస్తున్నారు. ఈ రెండు పరిశ్రమలకు సంబంధించిన ప్రక్రియ జోరుగా సాగుతోంది. బొమ్మల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు, సానుకూలతలను హోం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించారు.

విదేశీ సంస్థ బొమ్మల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. 1,054 ఎకరాలు అవసరమని ఆ సంస్థ ప్రతిపాదించగా మంత్రి అనిత ఆదేశాలతో అధికారులు ఎన్.నర్సాపురం, ఉపమాక పరిసర ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. పరిశ్రమ ప్రతినిధులు ఇప్పటికే రెండుసార్లు ఆ రెండు గ్రామాల్లో పర్యటించి భూములను చూసి వెళ్లారు. పరిశ్రమకు సంబంధించిన కార్యాచరణ కొలిక్కి వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరగనున్నాయి.

అచ్యుతాపురం సెజ్‌లోని వస్త్ర తయారీ పరిశ్రమలో కల్పించినట్లే బొమ్మల తయారీ పరిశ్రమలోనూ ఎక్కువ మంది మహిళలకే ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. సుమారు 20 వేల మంది మహిళలకు ఉపాధి కలుగుతుందని అంచనా. ఉపాధి అవకాశాలు మెరుగుపడటం, కాలుష్య సమస్య లేకపోవడంతో ప్రభుత్వమూ సానుకూలంగా ఉంది. మంత్రి అనిత ఇటీవల కలెక్టర్ విజయకృష్ణన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో పలుమార్లు చర్చించారు. కార్యాచరణ వేగవంతం చేసేందుకు ఉన్నతాధికారులు ఇద్దరూ నక్కపల్లి మండలంలో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. భూములకు సంబంధించి తుది నివేదిక ఇవ్వగానే తదుపరి చర్యలు చేపట్టే ఆస్కారముంది.

# రాజధానికి రయ్.. రయ్




నంద్యాల : రాయలసీమ వాసులు రాజధానికి వెళ్లే రైలు మార్గం పనులు వేగం అందుకొన్నాయి. గుంటూరు- గుంతకల్లు మధ్య నల్లమల అరణ్యంలోని దిగువమెట్ట- నంద్యాల మధ్య జరగాల్సిన డబ్లింగ్ పనులకు మోక్షం లభించింది. 'కూటమి' ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో పనులకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఆరు నెలల కిందట అనుమతులిచ్చింది. నల్లమల అటవీ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సొరంగాల నిర్మాణానికి ఏడేళ్ల తర్వాత ప్రారంభయ్యాయి. 2027 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ మార్గంలో ప్రస్తుతం 24 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. మరో నాలుగు ప్రత్యేక రైళ్లు తిరుగుతున్నాయి. ఒకే వరుస ఉండటంతో కొన్ని స్టేషన్లలో నిలిచిపోతున్నాయి. డబ్లింగ్ పనులు పూర్తయితేనే వీటికి ఆటంకాలు తొలగిపోతాయి. కొత్త రైళ్లతోపాటు వందేమాతరం వంటి వేగవంతమైన రైళ్లు నడవనున్నాయి.

**రెండు పెద్ద వంతెనల నిర్మాణం**

నల్లమల అరణ్యంలోని దిగువ మెట్ట- చలమ మార్గంలో రెండు పెద్ద వంతెనలను నిర్మించాల్సి ఉంది. వీటికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తయ్యాయి. అటవీ శాఖ అనుమతులొచ్చాయి. దొరబావి వంతెన దాటిన తర్వాత ఒక పెద్ద వంతెన నిర్మించనున్నారు. ఈ వంతెనకు సమీపంలోనే ప్రవహిస్తున్న ఒక వాగుపై మరో వంతెన నిర్మించాల్సి ఉంది. వీటి పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

**57 కి.మీ. మూడు నెలల్లో పూర్తి చేసేలా**

గుంటూరు- గుంతకల్లు (426 కి.మీ.) రైలు మార్గం డబ్లింగ్ పనులకు 2018లో శ్రీకారం చుట్టారు.. రూ.3,631 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న పనులను మూడు విభాగాలుగా వర్గీకరించారు.

గుంతకల్లు- నంద్యాల మధ్య పనులను గుంతకల్లు రైల్వే డివిజన్‌కు, నల్లపాడు- దొనకొండ మధ్య గుంటూరు రైల్వే డివిజన్‌కు, దొనకొండ- నంద్యాల మధ్య పనులను సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు అప్పగించారు. ఇప్పటి వరకు 347 కి.మీల మేర పనులు పూర్తయ్యాయి. మైదాన ప్రాంతంలో పనులు పూర్తవగా నంద్యాల- దొనకొండ మార్గంలో అటవీ ప్రాంతంలో జరగాల్సి ఉంది.

ఏడేళ్ల తర్వాత అటవీశాఖ అనుమతులు ఇవ్వడంతో ప్రస్తుతం ప్రకాశం జిల్లా దిగువమెట్ట- గాజులపల్లె మధ్య 27 కి.మీలు, నంద్యాల- గాజులపల్లె మధ్య 16 కి.మీలు, నంద్యాల- పాణ్యం మధ్య 14 కి.మీ మేర నిర్మాణాలు జరుగుతున్నాయి. మరో మూడు నెలల్లో ఆయా పనులు పూర్తి చేయాలని రైల్వే అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

**ఈ రెండు సొరంగాలే కీలకం**

గుంటూరు- గుంతకల్లు రైలు మార్గంలో నల్లమల అరణ్యంలోని దిగువమెట్ట- నంద్యాల మధ్య జరగాల్సిన డబ్లింగ్ పనులే కీలకం. పులుల అభయారణ్యం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో 28 కి.మీల పొడవునా డబ్లింగ్ పనులతో పాటు రెండు సొరంగ మార్గాలు నిర్మించాల్సి ఉంది.

చలమ వద్ద 0.34 కి.మీల పొడవున ఒకటి, బొగద సమీపంలోని దొరబావి వంతెన వరకు 1.6 కి.మీ చొప్పున మరో సొరంగం నిర్మించాల్సి ఉంది. ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో సొరంగాల నిర్మాణం జరుగుతోంది.

దొరబావి వంతెన వద్ద పాత సొరంగానికి సమాంతరంగా 35 మీటర్ల అవతల ఏడు మీటర్ల వ్యాసంతో కొత్త సొరంగం పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతానికి ఆధునిక యంత్రాలు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. జంబో డ్రిల్లింగ్ యంత్రం వెళ్లేందుకు కొండను యంత్రాలతో తొలచి చదునుచేశారు.

ప్రస్తుతం చలమ వద్ద ఉన్న 28 మీటర్లు, దొరబావి వంతెన వద్ద 1.20 కి.మీల పొడవునా సొరంగాలు ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న రెండు సొరంగాలు పాత వాటికంటే కొంత పెద్దగా ఉండనున్నాయి.

# ఉపాధి.. అక్రమాల నిధి

శ్రీకాళహస్తి : ఈ చిత్రం మే 28, 2025న ఎన్ఎంఎంఎస్‌లో పొందుపరిచారు. దిగువపుత్తూరు పంచాయతీ సమీప అటవీ ప్రాంతంలో కందకాల తవ్వకం పనులకు సంబంధించింది. ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషుల పేర్లు నమోదు చేశారు. వారిలో నాగరత్నం, అమ్ములు, సుబ్రహ్మణ్యం పనికి రాలేదు చిత్రంలోనూ లేరు. అయినా మస్టర్లు వేశారు.



ఉపాధి నిధుల దోపిడీకి ఎంతకూ అడ్డుకట్ట పడటం లేదు. అధికార, ప్రతిపక్ష నాయకులు కలిసిపోయి వారి ముఖ్య అనుచరులనే క్షేత్ర సహాయకులుగా నియమించుకుంటున్నారు. బంధువులు, అనుచరుల పేరిట నకిలీ మస్టర్లతో వారం వారం రూ.వేలల్లో లబ్ధి పొందుతున్నారు. కేవీబీపురం మండలంలోని దిగువపుత్తూరు, కోటమంగాపురం పంచాయతీల్లో కేరళ, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ముంబయి వంటి ప్రాంతాల్లో స్థిరపడినవారి పేర్లను పొందుపరిచి ఉపాధి నిధులు కాజేస్తున్నారు. దిగువపుత్తూరులో ఓ నాయకుడి భార్యను క్షేత్ర సహాయకులుగా, కోటమంగాపురంలో మేట్లను నియమించుకుని పక్కదోవ పట్టిస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో సాంకేతికతకు బురిడీ కొట్టిస్తున్నారు.

**చనిపోయిన వారికీ బిల్లులు..**

కోటమంగాపురం పంచాయతీలో సుమారు 15 మంది వరకు చనిపోగా వారి పేరుమీద ఉపాధి బిల్లులు పొందేందుకు యత్నించగా కూలీలు అడ్డుకున్నారు. ఇదే పంచాయతీలోని కోటలో తులసయ్య (ఏపీ1002 3027037020015), దయాల్ (ఏప్మీ100 23027037020116), దాము(ఏపీ10023027037020060) ఏడాదిన్నార కిందట చనిపోగా 2024 అక్టోబర్ నుంచి కొన్ని వారాలపాటు బిల్లులు జమ చేయించుకుని కాజేశారు. చర్యలు తప్పవు.. నిధులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవు. స్థానికంగా లేనివారి పేర్లు మస్టర్లు నమోదు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. - సరిత, ఏప్మీడీ, శ్రీకాళహస్తి

# పోటీ.. ప్రభుత్వ సీట్లకే

విజయనగరం : ఉమ్మడి జిల్లాలో పాలీసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. ధ్రువపత్రాలు పరిశీలిస్తారు. అభ్యర్థులు విజయనగరం ఫూల్‌బాగ్‌లోని మహారాజా ఆనందగజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నిక్, పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సహాయక కేంద్రాల్లో ఎక్కడైనా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావొచ్చు. రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ/ఎస్టీ రూ.250 రుసుము చెల్లించాలి. పరిశీలన అనంతరం ఐసీఆర్ ఫారం (కౌన్సెలింగ్‌లో అందజేసిన ధ్రువపత్రాల వివరాలను తెలియజేసే పత్రం) అభ్యర్థికి అందజేస్తారు. రెండు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 21 కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది 11,460 మంది పోటీపడ్డారు. ఆరు ప్రభుత్వ కళాశాలల్లో 1,092 సీట్లు ఉన్నాయి. వీటికే పోటీ నెలకొంది.



**25 నుంచి వెబ్ ఆప్షన్లు**

వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమవుతోంది. 30వ తేదీ వరకు అభ్యర్థులు ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలి. జులై ఒకటిన మార్పునకు అవకాశం కల్పించారు. జులై 3న సీట్లు కేటాయిస్తారు. ర్యాంకుల వారీగా నిర్దేశించిన తేదీల్లో ఐసీఆర్ ఫారం నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో లాగిన్ అవ్వాలి. ఆ సమయంలో అభ్యర్థి చరవాణికి ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదుచేసి, ఇతర వివరాలు పూర్తిచేస్తే కళాశాలల జాబితా అందుబాటులోకి వస్తుంది. అభ్యర్థులు నచ్చిన కళాశాలకు ఐచ్ఛికాలు ఇచ్చుకోవచ్చు. నేరుగా చరవాణికే ఎక్కడ సీటు వచ్చిందో సమాచారం వస్తుందని రెండు జిల్లాల సమన్వయాధికారులు ఆశారమణి, విలియం కేరీ తెలిపారు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లింపు రశీదు, హాల్‌టికెట్, ర్యాంకు, ఆధార్‌కార్డు ఉండాలి. పదోతరగతి మార్కుల పత్రం, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ, బదిలీ ధ్రువపత్రం, ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల నకలుతో రావాలి. పరిశీలన అనంతరం అసలు ధ్రువపత్రాలు అందజేస్తారు.

# ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

ఒంగోలు : వ్యవసాయం కన్నా ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఎక్కువ ఆదాయం సమకూరుతోంది. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం పండ్ల తోట పెంపకానికి ప్రోత్సహిస్తోంది., మొక్కల పంపిణీబీ మూడేళ్ల పాటు నిర్వహణ, నీటి సరఫరా, మందులు, ఎరువులకయ్యే మొత్తాన్ని కూడా అందజేస్తోంది. సాగు ఖర్చుల్లో వంద శాతం మొత్తాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుంది. చిన్న, సన్నకారు రైతుల పొలాలతోపాటుబీ మెట్ట, బీడు భూములు సాగులోకి తీసుకురావడంతో పాటు జల వనరుల సంరక్షణకు చర్యలు తీసుకుంటుంది. ఆగస్టు నెల నుంచి జిల్లాలో విస్తారంగా వర్షాలు పడే అవకాశాలు ఉంటాయి. ఈ మేరకు అక్టోబర్ నెల వరకు సాగుకు అనుకూలం కానుంది.

**మండలానికి రెండొందల ఎకరాలు**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 6,500 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని ప్రతి మండలంలో కనీసం 150 నుంచి 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. మామిడి, బత్తాయి, తైవాన్ జామ, నేరేడు, ఆపిల్ బేర్, చింత,



అంజూర, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ, మల్లె, జామ, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, సపోటా, నిమ్మ తదితర పంటలు రైతులు సాగు చేసుకోవచ్చు. రైతులకు మూడేళ్లపాటు దశల వారీగా ఆర్థిక సాయం అందుతుంది. తైవాన్ జామకు గరిష్ఠంగా రూ.2.25 లక్షలు, కనిష్ఠంగా సపోటాకు రూ.89 వేల వరకు అందుతుంది. బోరు, బావి, మెట్ట భూముల్లోనూ నాటుకోవచ్చు.

**అర్హులు ఎవరంటే..**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారుడు ఉపాధి కార్డు కలిగి ఉండాలి. అయిదెకరాలలోపు సాగు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు అర్హులు. బోరు, బావి, మెట్ట భూముల్లోనూ నాటు కోవచ్చు. గ్రామంలో క్షేత్ర సహాయకుడు లేదా మండల స్థాయిలో ఎంపీడీవో, ఏపీవోను సంప్రదించాలి. పండ్ల తోటల పెంపకానికి సంబంధించిన సమగ్ర వివరాలతో దరఖాస్తు చేయాలి.

# చెన్నయ్యా.. కష్టాలు చూడవయ్యా..!

మార్కాపురం : మార్కాపురంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దర్శనాలకు వచ్చే భక్తులకు ఆలయ అధికారులు ఏడాదిన్నరగా సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానంలో ఏడాదిన్నర నుంచి నాలుగు ప్రాకార గోపురాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అంతేకాకుండా ఆండాళ్లమ్మ దేవాలయంతో పాటు రంగనాయక స్వామి మండపం, భక్తులు విశ్రాంతి తీసుకునే గదులతో పాటు విశాలమైన హాలు తదితర నిర్మాణ పనులు రూ.10 కోట్లతో చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 95 శాతం పూర్తి చేశారు. మిగిలినవి నిలిచిపోయాయి.

**నెలకు 5 వేల మంది భక్తులు రాక:** ఆలయానికి జిల్లాతో పాటు అనంతపురం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, విజయవాడ, గుంటూరు, విజయనగరం, కృష్ణా జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రతి నెల 5 వేల మంది భక్తులు దర్శనానికి వచ్చి తల నీలాలు సమర్పిస్తుంటారు. మూడు రోజులు నిద్రలు చేస్తుంటారు. ప్రస్తుతం భక్తుల స్నానపు గదులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేకనానా అవస్థలు పడుతున్నారు. బయట ప్రైవేటు లాడ్జీల్లో రోజుకు రూ.1500 నుంచి రూ.2 వేలు ఖర్చు చేసి ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆలయం ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా దేవాలయం ఆవరణలో సుమారు పది కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విశ్రాంతికి తాత్కాలిక హాలు ఏర్పాటు చేశామన్నారు. అద్దెకు ఇచ్చే గదులను ఉచితంగా భక్తులకు ఇస్తున్నట్లు తెలిపారు.

# తుంగభద్ర పరవళ్లు

హొలహర్వీ : కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం చేరుతోంది. ఇప్పటికే జలాశయం ఎగువన మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయం కింద ఉన్న దిగువ కాల్వ రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది ఒకే పంటకు నీరు అందిస్తామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీంతో ముందుగానే జలాశయానికి వరద ప్రవాహం వచ్చి చేరుతుండటంతో పశ్చిమ ప్రాంత అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

తుంగభద్ర దిగువ కాల్వ కింద ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు ఈ నీరే ఆధారం. సుమారు వంద గ్రామాలకు పైగా తాగునీరు, ఖరీఫ్‌లో 40 వేల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. ఈ ఏడాది సమృద్ధిగా నీరు ఉంటుందని అధికారుల



అంచనా ఉన్నా.. డ్యాం గేట్ల నిర్వహణను దృష్టిలో ఉంచుకొని 80 టీఎంసీల నీటి నిల్వ ఉంచేలా బోర్డు నిర్ణయం తీసుకుంది. దీంతో ఒక పంటకే నీరు అందించాలనే నిర్ణయంతో రైతులకు ఇబ్బందులు తప్పవు. జలాశయానికి ముందస్తుగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. డ్యాం ఎగువన మరింతగా వర్షాలు కురువాలని రైతులు ఆశిస్తున్నారు.

**శ్రీశైలానికి కొత్తనీరు**

శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 847.10 అడుగులు, నీటినిల్వ 73.9870 టీఎంసీలుగా నమోదైంది. జూరాల ప్రాజెక్టు నుంచి 36,415, సుంకేసుల జలాశయం నుంచి 2,248 క్యూసెక్కుల నీరు వస్తోంది.

# భూ కొలత.. రైతు కలత

కర్నూలు: హద్దులు చూపండి.. సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేయండి.. రస్తా సమస్య పరిష్కరించండి.. విస్తీర్ణంలో తేడాలున్నాయి కొలతలు వేయండంటూ వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు చెత్త బుట్టలో పడేస్తున్నారు. భూ కొలతలకు సంబంధించి వచ్చిన అర్జీలను సర్వేయర్లు చూడటం లేదు.. బాధితులతో మాట్లాడటం లేదు. సర్వేయర్లు పట్టణ ప్రాంతాల్లో తిష్టవేసి స్థిరాస్తి వ్యాపారుల భూ సమస్యలు చక్కబెడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన రైతుల సమస్యలు విస్మరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చూసి సర్వే తేదీని ప్రకటిస్తూ.. దరఖాస్తుదారుడికి సమాచారం చేరవే యాలి. నాలుగు నెలలైనా తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వో, గ్రామ సర్వేయర్.. వీరెవరూ దరఖాస్తుదారురాలికి సమాచారం ఇవ్వడం లేదు. భూముల కొలతలు, సబ్ డివిజన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాల్సి ఉండగా..రెండు, మూడు వారాలైనా తమ లాగిన్లకు వచ్చిన దరఖాస్తులు చూడటం లేదు.

**క్షేత్రస్థాయికి వెళ్తే ఒట్టు**

సర్వే, సబ్ డివిజన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం లేదు. క్షేత్ర స్థాయికి వెళ్లి భూముల కొలతలు వేయడం లేదు. మండల సర్వేయర్లపై రెవెన్యూ డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. భూముల విలువను బట్టి సర్వే చేసేందుకు మండల సర్వేయర్లు ధరలు నిర్ణయించారు. రూ.10 వేల నుంచి రూ.50 వేలు, రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. తామిచ్చే సర్వే నివేదిక ఆధారంగానే ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదవుతాయి... అంటూ బాహాటంగానే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

**భూమి కొట్టేయాలని తప్పుడు నివేదిక**

గోనెగండ్ల మండలం బైలుప్పలకు చెందిన వెంకటేశ్వరరెడ్డికి 2.70 ఎకరాలు వారసత్వంగా సంక్రమించింది.. ఆ భూమిని తన కుమార్తె డీఎస్ మాధవి, అల్లుడు డి.మల్లేశ్వరరెడ్డికి దాన విక్రయం కింద 2018లో రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. ఆ భూమిని ఇతరులు సాగు చేసుకొంటున్నారని సర్వేయర్ రవీంద్రబాబు తప్పుడు నివేదిక ఇచ్చారు. అదేమని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తే న్యాయస్థానంలో తేల్చుకోమని అర్జీదారులకు సలహాఇచ్చారు.

" వీఆర్వో, సర్వేయర్‌లు కలిసి ఆ పొలాన్ని కొట్టేయాలన్న ఉద్దేశంతో కొందరు ఏజెంట్లను పెట్టుకొని ఇలా చేస్తున్నారని మాధవి వాపోతున్నారు.

**ఖాళీ.. కంగాళీ**సి.బెళగల్, గోనెగండ్ల, ఆస్పరి, మద్దికెర, ఆలూరు, కృష్ణగిరి, హొళగుంద, చిప్పగిరి, నందవరం దొర్నిపాడు, గోస్పాడు, శ్రీశైలం, పగిడ్యాల, మహానంది, సంజామల మండలాల్లో డిప్యూటీ సర్వేయర్ల కొరత ఉంది. చిప్పగిరి, నందవరం మండలాలకు గత కొన్ని నెలలుగా ఇన్‌ఛార్జి సర్వేయర్లను నియమించలేదు.

కృష్ణగిరి మండలంలో భూవివాదాలు అధికం. ఈ మండలానికి ఒక విలేజ్



సర్వేయర్‌ను ఇన్‌ఛార్జి మండల సర్వేయర్‌గా బాధ్యతలు అప్పగించడం గమనార్హం. హొళగుంద మండలానికీ విలేజ్ సర్వేయర్‌ను నియమించారు. హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్-4లో పని చేసే సర్వేయర్లు గోనెగండ్ల, ఆస్పరి మండలాలకు ఇన్‌ఛార్జిలుగా నియమించగా.. కలెక్టరేట్‌లో జిల్లా సర్వే ఏడీ కార్యాలయంలో పని చేసే ఇద్దరు టాస్క్‌ఫోర్స్ సర్వేయర్లను సి.బెళగల్, ఆలూరు మండలానికి ఇన్‌ఛార్జిలుగా నియమించారు.

**ఐదు మండలాల్లో అవస్థలు**

ఆదోని మండలం పెద్ద మండలం.. 40కిపైగా గ్రామాలున్నాయి. సాగు భూమి విస్తీర్ణం అధికంగా ఉంది. కోడుమూరు మండలానిది అదే పరిస్థితి. ఈ రెండు మండలాలకు కనీసం ఇన్‌ఛార్జి సర్వేయర్లను నియమించలేదు. ఆత్మకూరు, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ మండలాల్లో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఆత్మకూరు, ఆళ్లగడ్డ పట్టణ ప్రాంతాలు, రూరల్ మండలాలున్నాయి. ఇంత కీలకంగా ఉన్న మండలాలకు సర్వేయర్లు లేకపోవడంతో భూసమస్యలు పరిష్కారం కావడం లేదు. కనీసం ఇన్‌ఛార్జిలను నియమించడం లేదు.

**కావాలని కాలయాపన**కర్నూలు గ్రామీణ మండలం ఉల్చాలలో శారదమ్మకు 13 సర్వేనంబర్లలో కలిపి 30-40 ఎకరాల పొలం ఉంది.. కొలతలు వేసి హద్దులు చూపి ఆన్‌లైన్ అడంగల్‌లో పేర్లు నమోదు చేసుకొనేందుకు సర్వే చేయాలని 2025 ఫిబ్రవరి 18న దరఖాస్తు చేసుకొన్నారు. గడువు ముగిసినా పట్టించుకోలేదని దరఖాస్తుదారు వాపోయారు.

# అప్పుతో నిర్మించి... అలంకారప్రాయంగా మార్చి !




అనంతపురం : రైతులు పండించిన ఉత్పత్తుల నిల్వ కోసం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన గోదాములు అలంకారప్రాయంగా మారాయి. ఉమ్మడి అనంత జిల్లాలో సుమారు 114 గోదాములు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోకుండా ఉన్నాయి. రైతు సేవా సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారా వాటిని నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో ప్రక్రియ ఆలస్యమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. విపత్తులు, గిట్టుబాటు ధరలు లేని సందర్భాల్లో పంటను నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాబార్డు ద్వారా అవసరమైన రుణాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పించింది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టగా పీఏసీఎస్‌లకు నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. నాబార్డు నుంచి నేరుగా పీఏసీఎస్‌లకు రుణాలు మంజూరు చేశారు. 2022లో పనులు మొదలుపెట్టారు. బిల్లుల ఆలస్యం కావడంతో గోదాములు అప్పగించే ప్రక్రియ పూర్తికాలేదు. మరోవైపు పీఏసీఎస్‌ల్లోని వైకాపా పాలకవర్గం గుత్తేదారులను కమీషన్ల కోసం వేధించడంతో చాలాచోట్ల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్ బిల్లులు మంజూరుపై దృష్టి సారించింది. నిర్మాణాలు పూర్తయిన గోదాములను మార్కెటింగ్‌శాఖ అధికారులు జిల్లా సహకార శాఖకు అప్పగించారు.

**రూ.53 కోట్లతో పనులు**

500, 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేపట్టారు. 500 మెట్రిక్ టన్నుల గోదాములకు రూ.40 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాములకు రూ.82 లక్షలు చొప్పున కేటాయించారు. మొత్తంగా ఇరు జిల్లాలకు రూ.53 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు 114 గోదాములు వంద శాతం పూర్తయ్యాయి. ఇందులో ఒక్కటి కూడా వినియోగంలోకి రాకపోవడం గమనార్హం.

**చొరవ చూపితేనే..** ఉమ్మడి జిల్లాలో మిరప, పప్పుసెనగ, వేరుసెనగ, మొక్కజొన్న, కంది పండించే రైతులకు గోదాములు ఎంతో అవసరం. ఇటీవల మిరపకు సరైన ధర లేకపోవడంతో రైతులు నష్టానికే అమ్ముకోవాల్సి వచ్చింది. తుపాను సమయాల్లో గోదాములు అందుబాటులో ఉంటే చాలావరకు నష్టాన్ని తగ్గించవచ్చు. అకాల వర్షాలకు భయపడి పంటను తక్కువ ధరకు అమ్ముకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేటు గోదాముల్లో ధరలు అధికంగా వసూలు చేస్తుండటం..అవి సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తయిన గోదాములను వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# ప్రభుత్వ భూములేగా వేసేయ్ పాగా



ఎలమంచిలి : పరిధిలో విలువైన ప్రభుత్వ భూములు కళ్లముందే ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కొత్తగా మంజూరైన పాఠశాలల ఏర్పాటుకు స్థలాల్లేవని చెబుతున్న అధికారులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను సంరక్షించలేక చేతులెత్తేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైకాపా పాలనలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. భూపరిమితి చట్టంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములూ కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణలకు గురైన భూముల మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగానే ఉంటుంది. రెవెన్యూ అధికారులను ప్రలోభాలకు గురిచేసి రికార్డులను తారుమారు చేసేందుకు ఆక్రమణదారులు యత్నిస్తున్నారు. పంచాయతీగా ఉండే ఎలమంచిలి పురపాలక సంఘంగా ఏర్పడ్డాక భూముల విలువ ఒక్కసారిగా పెరిగింది. ఎలమంచిలి నుంచి పెదపల్లి వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన 80 సెంట్లకుపైగా గెడ్డ పోరంబోకు భూమి ఉంది. దీనికి ఒకవైపు తారు రోడ్డు మరోవైపు మాల గెడ్డ ఉంది. మధ్యలో ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ముందుగా చిన్నపాక వేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గెడ్డ స్థలాన్ని చదును చేసి సాగు భూమిగా మార్చారు. అక్కడితో ఆగకుండా అటు మాలగెడ్డను, మరోవైపున ఉన్న యానాద్రి కాలువను ఆక్రమించి చదును చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవడంతోపాటు ఒకవైపు కాలువ, మరోవైపు గెడ్డ చిక్కిపోయింది. యానాద్రి కాలువ రూపురేఖలు మారిపోయాయి. ఈ భూమి విలువ రూ.4 కోట్లపైనే ఉంటుంది. పట్టణం మధ్యలో జాతీయ రహదారి పక్కన ఉండటం వల్ల ఆక్రమణదారుల కన్నుపడింది. రోజూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే అధికారులకు ఈ ఆక్రమణలు కనిపించకపోవడం గమనార్హం.

పెదపల్లి సమీపంలో భూగరిష్ఠ పరిమితి చట్టంలో ప్రభుత్వానికి సొంతమైన ఎకరం భూమి ఉంది. ఇది చాలా కాలం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. చుట్టూ రాళ్లు వేసి కాపాడారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఇది ఆక్రమణదారుల చెరలోకి వెళ్లింది. చుట్టూ కంచె వేసి సాగు చేస్తున్నారు. ఈ భూమిని తాజాగా విక్రయించినట్లు సమాచారం. అధికారులకు ఈ విషయం తెలిసినా స్వాధీనం చేసుకునేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కొక్కిరాపల్లి పరిధిలోనూ ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంది. దీని విలువ రూ.కోటిపైనే ఉంటుంది. ఆక్రమణల చెరలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుకోవడంతోపాటు ప్రజోపయోగ అవసరాలకు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

**నోటీసులిచ్చి స్వాధీనం చేసుకుంటాం**

వరహాలరావు తహసీల్దార్

గెడ్డ పోరంబోకు భూములను ఆక్రమించడం నేరం. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వ భూములన్నింటినీ స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే చేసి సంరక్షణ చర్యలు చేపడతాం.

# చకచకా హంద్రీనీవా విస్తరణ పనులు



గుంతకల్లు : కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయి. గుంతకల్లు డివిజన్ పరిధిలోని మద్దికెర, కసాపురం నుంచి రాగులపాడు, ఉరవకొండ మీదుగా జీడిపల్లి వరకు ఉన్న 108 కి.మీ.ల పొడవైన కాలువ విస్తరణ పనులను ప్రభుత్వం ఒకటిన్నర నెల కిందట చేపట్టింది. ఇదివరకు కాలువలో 1400 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహించేది. దీంతో సాగు, తాగునీటి కొరత ఉండేది. ఆలోటు పూడ్చేందుకు కూటమి సర్కారు సంకల్పించింది. ఆయా పనులు పూర్తయితే కాలువలో 3,450 క్యూసెక్కుల నీరు పుష్కలంగా ప్రవహించనుంది.

**నీరొచ్చేలోపు పనుల పూర్తికి కార్యాచరణ**

ప్రస్తుతం ఇంజినీర్లు కాలువ విస్తరణ పనులు జోరుగా సాగిస్తున్నారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. పనులను గుత్తేదారులకు అప్పగించారు. కాలువకు నీరు వచ్చేలోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వంగా లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం గుంతకల్లుకొట్టాల గ్రామ సమీపంలో పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా త్వరగా ముగించాలని ఇంజినీర్లు గుత్తేదారులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కాలువ ద్వారా నీటిని పుష్కలంగా అందించేందుకు వీలుగా పనులను చకచకా చేస్తున్నారు. తద్వారా ముఖ్యమంత్రి నుంచి ప్రశంసలు అందుకోవాలని కృషి చేస్తున్నారు. నీరు విడుదల కాగానే గుంతకల్లులోని 1.80 లక్షల మందికి హంద్రీనీవా నీటిని సరఫరా చేయడానికి ఎస్ఎస్ ట్యాంకులకు సిద్ధం చేసే పనులు అధికారులు నిమగ్నమయ్యారు.


**వచ్చేనెల 10లోపు పూర్తి చేస్తాం**

కాలువ విస్తరణ సకాలంలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో గుత్తేదారులతో రాత్రింబవళ్లు పనులు చేయిస్తున్నాం. వచ్చే జులై 10 కంతా పూర్తి చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఆలోపు పూర్తి చేయడానికి అన్నివిధాలా కృషి చేస్తున్నాం. విస్తరణ పూర్తయితే కాలువలో పుష్కలంగా నీరు సరఫరా అవుతుంది. తద్వారా సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయి.

– శ్రీనివాస్‌నాయక్, కార్యనిర్వాహక ఇంజినీరు, హంద్రీనీవా కాలువ

# ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు వేళాయె

వేంపల్లె : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఎంపికైన అర్హుల జాబితా ఈ నెల 23న విడుదల కానుంది. జాబితాను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆర్జీయూకేటీ అధికారులు పొందుపరచనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30, జులై 1న ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఇడుపులపాయలో కౌన్సెలింగ్, అదే రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జులై 2, 3 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీ, జులై 4, 5 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఒంగోలు ట్రిపుల్



ఐటీకి భవనాలు లేకపోవడంతో పీయూసీ రెండేళ్ల కోర్సును ఇడుపులపాయలో, బీటెక్ నాలుగేళ్ల కోర్సును ఒంగోలులోని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 2016లో అప్పటి తెదేపా హయాంలో ఒంగోలు ట్రిపుల్ ఐటీని ప్రారంభించినప్పటి నుంచి ఇడుపులపాయలోనే కౌన్సెలింగ్ నిర్వహించేవారు. ఏ కారణాల చేతో ఈ దఫా ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ప్రక్రియను నూజివీడుకు మార్చారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తైన తర్వాత జులై 14న ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులు ఆయా క్యాంపస్‌లకు చేరుకోవాలి. అదే రోజే తరగతులు ప్రారంభమవుతాయి.

**విద్యార్థులు అందించాల్సిన ధ్రువపత్రాలు**

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేటప్పుడు పది ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ హాల్‌టిక్కెట్, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, టీసీ, రేషన్‌కార్డు, స్పెషల్ కేటగిరి అయితే అందుకు సంబంధించిన ధ్రువపత్రం, నివాస ధ్రువీకరణ పత్రానికి సంబంధించి రెండు సెట్ల ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

**చెల్లించాల్సిన రుసుములు**

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు పీయూసీకి సంబంధించి మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.45వేలు, ఇంజినీరింగ్‌కు సంబంధించి ఏడాదికి రూ.50వేల చొప్పున నాలుగేళ్లు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు హాస్టల్ ఫీజు కింద అదనంగా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. సూపర్ న్యూమరరీ కోటా కింద సీట్లు దక్కించుకున్న వారు ఏడాదికి ట్యూషన్‌ఫీజు కింద రూ.1.50 లక్షలతో పాటు అదనంగా హాస్టల్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది.

**మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు**

ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కించుకున్న విద్యార్థులకు దరఖాస్తుల అభ్యర్థి మెరిట్ కేటగిరి వారిచ్చిన ప్రాధాన్యం ప్రకారం క్యాంపస్ కేటాయిస్తాం. రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఎస్సీ సబ్ ప్లాన్, క్లాసిఫికేషన్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తాం. ఒకసారి క్యాంపస్ కేటాయించిన తర్వాత పరస్పర బదిలీలకు అవకాశం కల్పించే అవకాశం లేదు.

# అతివకు ఆలంబన..!

విజయనగరం : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కూటమి ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల్లోని స్వయం సహాయక సభ్యుల్లో డిగ్రీ చదువుకుని, కంప్యూటర్ నైపుణ్యం ఉన్నవారిని ఎంపిక చేసి 'డిజి లక్ష్మి ఆట్ కియోస్క్' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను మెప్మాకు అప్పగించింది. ప్రతి స్లమ్ లెవెల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఒక కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. ఒక సమాఖ్యలో ఉన్న సుమారు 300 కుటుంబాలు ఈ సేవలు అందుకునేందుకు వీలుంటుంది. మీసేవా కేంద్రాల తరహాలో ఇవి పనిచేస్తాయి. అక్కడే అందే సేవలన్నీ అందుబాటులో ఉంటాయి. పురపాలిక సంఘాల్లోని ఆస్తి, నీటి పన్నులు ప్రజలు చెల్లించొచ్చు. సంఘాల రుణాల వాయిదాలు, విద్యుత్తు బిల్లులు సైతం చెల్లించే వెసులుబాటు కల్పిస్తారు. మహిళా సంఘాలు ఉచితంగా ఈ- గవర్నెన్స్ ఇండియా లిమిటెడ్ తోడ్పాటుతో కేంద్రాలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం చేయూత ఇస్తోంది.

**ముగ్గురికి ఉపాధి..**

ఒక్కో కేంద్రం ద్వారా స్వయం సహాయ సంఘంలోని ముగ్గురు మహిళలు ఉపాధి పొందేలా మెప్మా చర్యలు తీసుకుంటోంది. రూ.30 వేల వరకు ఆదాయం సాధించాలనేది లక్ష్యం. విజయనగరం జిల్లాలో 301 సమాఖ్యలకు 148, పార్వతీపురం మన్యంలో 111 సమాఖ్యలకు 76 ఎంపికలు పూర్తయ్యాయి. ప్రక్రియంతా పూర్తయ్యాక వీరందరికీ



శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే పెద్దఎత్తున బ్యాంకుల నుంచి బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పిస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక చేపడుతోంది. స్వయం శక్తి సంఘంలో కనీసం మూడేళ్లు ఉన్నవారిని గుర్తిస్తున్నారు. ఎంపికైన వారికి రుణం మంజూరు చేస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

మీసేవా కేంద్రాల తరహాలోనే డిజి లక్ష్మిలు పనిచేస్తాయి. అక్కడ అందే అన్ని సేవలు ఇక్కడ అందుతాయి. ప్రతి స్లమ్ లెవెల్ సమాఖ్య పరిధిలో ఒక డిజి లక్ష్మి ఏర్పాటు చేస్తాం. స్వయంశక్తి సంఘంలో అర్హులైన మహిళను ఎంపిక చేస్తున్నాం. రెండు జిల్లాల్లో ఇప్పటికే చాలా వరకు ప్రక్రియ పూర్తయింది. వీరందరికీ శిక్షణ ఇస్తాం. ప్రజలకు సేవలతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయి.– చిట్టి రాజు, ఉభయ జిల్లాల మెప్మా పీడీ

చరకలు



# భూ సేకరణపై ఆందోళన



హిందూపురం : తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూముల్లో రెవెన్యూ అధికారులు వివరాలు సేకరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం గ్రామీణ మండలంలోని మలగూరు, చలివెందుల, రాచపల్లి, మీనుగుంటపల్లి గ్రామాల్లో భూముల వివరాలను సేకరిస్తున్నారు. దీంతో ఆ గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగి భూములు ఇవ్వమని ఖరాఖండిగా చెప్పారు.

**సారవంతం..**

మలగూరు, చలివెందుల గ్రామాల పరిధిలో డీకేటీ భూములు 1,931.53 ఎకరాలు, పట్టా భూములు 259.04 ఎకరాలు, ప్రభుత్వ భూమి 136.88 ఎకరాలు మొత్తం 2,327.45 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాంత భూములన్నీ సారవంతంగా వ్యవసాయ ఆమోదయోగ్యంగా ఉన్నాయి. దీనికితోడు ఈ గ్రామాల పరిధిలో 5 చెరువులు ఉండటంతో హంద్రీనీవా కాలువ నుంచి ఉపకాలువ తీసుకొచ్చి చెరువులు నింపుతుండటంతో రైతులకు ఎలాంటి నీటి సమస్య లేదు. అందువలన రైతులు సాధారణ పంటలతోపాటు దీర్ఘకాలికంగా ఆదాయం అందించే వక్క పంట సాగు చేస్తున్నారు.

**వైకాపా పాలనలోనే ప్రతిపాదనలు** గత వైకాపా ప్రభుత్వ పాలనలోనే ఈ ప్రాంతంలో ఐటీ కాన్సెప్ట్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి 2,191.17 ఎకరాల భూమికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందుకు స్కెచ్‌కూడా అప్పట్లో అధికారులు సిద్ధం చేశారు. ఎందువలనో ఈ ప్రయత్నానికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు వివరాలు అడుగుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. గతంలో పలు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వందలాది ఎకరాలు సేకరించి రైతులకు ఉపాధి చూపుతామన్న వారు కనీసం ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. రైతులకు ఉపాధి చూపకపోవటంతో భూములు ఇచ్చిన రైతుల స్థితి నేడు దీనంగా మారింది. ఇదే పరిస్థితి మాకు దాపురిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూములు వదులుకోం**

మా పెద్దల నుంచి వచ్చిన ఐదు ఎకరాలను ముగ్గురు అన్నదమ్ములం సాగుచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇలాంటి సమయంలో భూములు లేక పోతే మాకు జీవనాధారం లేదు. అందువలన భూములు మాత్రం వదులుకోం. ఈ విషయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ రైతులకు సాయం చేయాలి.

**మహబూబ్‌బాషా**రీ సర్వే చేస్తున్నారు ..మలగూరు, చలివెందుల, రాచపల్లి, మీనుగుంటపల్లి గ్రామాల్లోని భూములు రీ సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావటంతో సిబ్బంది సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం ఎంత భూమిని రైతులు సాగు చేస్తున్నారు. ఎలాంటి పంటలు పండిస్తున్నారు అనే వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తాం. వెంకటేశు, తహసీల్దార్, హిందూపురం

# వీధుల్లో కాదు.. డిపోల్లోనే

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి అడుగులు వేసింది. వైకాపా పాలనలో రేషన్ డిపోలను పక్కనపెట్టి ఇంటింటికి రేషన్ పేరుతో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) ప్రారంభించింది. ఈ వాహనాలను వైకాపా కార్యకర్తలు, మద్దతుదారులకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. వాహనాల ద్వారా పంపిణీ తీరుపై లబ్ధిదారులు ఎప్పటి నుంచో పెదవి విరుస్తున్నారు. ఎండీయూలతో సరకుల పంపిణీపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా అభిప్రాయాలను సేకరించింది. మెజార్టీ లబ్ధిదారుల అభిప్రాయాలకు అనుగుణంగా జూన్ 1 నుంచి రేషన్ డిపోల వద్దనే సరకులు ఇస్తామని ప్రకటించింది. దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడినవారికి మాత్రం నేరుగా ఇంటివద్దనే సరకులు అందించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 5.46 లక్షల రేషన్ కార్డులున్నాయి. రేషన్ డిపోలు 1069 ఉన్నాయి. కార్డుదారులకు సరకులను సరఫరా చేయడానికి రెండు నుంచి మూడు డిపోలకు ఒక వాహనం చొప్పున గత ప్రభుత్వం 374 వాహనాలు కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతను నిరుద్యోగ యువత పేరుచెప్పి వైకాపా కార్యకర్తలకే అప్పగించింది. పేరుకు ఇంటింటికీ సరకులు సరఫరా అన్నా వాహనాలను వీధుల్లో ఒకచోట వాహనం ఆపి సరఫరా చేసేవారు. డిపోల్లో ప్రతినెలా 15 రోజులపాటు సరకులు ఇచ్చేవారు. ఇంటింటి సరఫరా విధానంలో వాహనం వచ్చినరోజు సరకులు తీసుకోకపోతే అంతే సంగతులు. కొందరు వాహనం వెనుకే ఆటో పెట్టుకుని రేషన్ బియ్యాన్ని కార్డుదారుల వద్ద కేజీ రూ. 18 చొప్పున కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయించేవారు. ఇలా రేషన్ బియ్యంలో 80 శాతం నల్లబజారుకు తరలిపోయేది. వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక... తూనికల్లో తేడాలతో కార్డుదారులు ఇబ్బంది పడేవారు. ఈ వాహనాల



ద్వారా సరకులు విక్రయించే వారు అక్రమాలకు పాల్పడుతున్నారని గుర్తించి కేసులు నమోదు చేసినా.. పౌరసరఫరా శాఖ అధికారులు వీరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాలపై దృష్టి సారించడంతో 80 శాతం సరకులు పక్కదారి పడుతున్నాయని గుర్తించారు. దీంతో వాహనాల వ్యవస్థను రద్దు చేసి డిపోల ద్వారా సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది. డిపోల పనివేళల్లో నచ్చిన సమయంలో వెళ్లి సరకులు తీసుకునే వెసులుబాటు కల్పించింది.

రేషన్ సరకుల పంపిణీ కోసం ఒక్కో వాహనం రూ. 6 లక్షల వరకూ ఖర్చు చేసి జిల్లావ్యాప్తంగా మొత్తం 374 వాహనాలు కొనుగోలు చేశారు. ప్రతినెలా ఆపరేటర్‌కి రూ. 21 వేలు చెల్లించేవారు. వాహనాల కొనుగోలుకే రూ. 22 కోట్లు ఖర్చు చేశారు. ఆపరేటర్ల కోసం నెలకు రూ. 78 లక్షలు ఖర్చు చేసేవారు. వాహనాలతోపాటు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు, వేలిముద్రలు వేసే ఈ-పోస్ యంత్రాలు భారీగా కొనుగోలు చేశారు. వాహనాలు ఎత్తివేయడం అభినందనీయం: వాహనాలతో ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ ఎక్కడా జరగలేదు. వీధి చివర వాహనం వద్దకు వస్తేనే సరకులు ఇచ్చేవారు. జూన్ నుంచి డిపోలు వద్ద సరకులు ఇవ్వడానికి చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. లబ్ధిదారులు అందరికీ సరకులు అందుతాయి.

ఈత గోపి, కొండకొప్పాక

అందరికీ అందేలా చర్యలు: ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందిన వెంటనే వాహనాలు నిలిపివేస్తాం. జూన్ నుంచి డిపోల వద్ద సరకులు లబ్ధిదారులు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం.

జయంతి, డీఎం, పౌరసరఫరాల వ్యవస్థ


# ఉన్నత విద్యకు సోపానం

కర్నూలు : కర్నూలు నగరం బి.క్యాంపులో ఉన్న సిల్వర్ జూబ్లీ కళాశాలలో చేరికలకు గానూ సిల్వర్‌సెట్-25కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2025-26 విద్యా ఏడాదికి గానూ డిగ్రీలో సీట్ల భర్తీకి అధికారులు సిల్వర్ సెట్-25 ప్రకటన ఇచ్చారు. ఇక్కడ 280 సీట్లు అందుబాటులో ఉండగా, 1,196 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

**పరీక్ష కేంద్రాలు ఇవే!** కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎమ్మిగనూరులో సెయింట్జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల, వైజాగ్‌లో శ్రీసుమేధ సొల్యూషన్ ఇన్‌స్టిట్యూట్, విజయవాడలో క్యూ టెక్నాలజీస్, అనంతపురంలో పీవీకేకే టెక్నాలజీస్, తిరుపతిలో ఎయిమ్స్ టెక్నాలజీస్, ఒంగోలులో బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు.

**ఉన్నాయిక్కడ..**

ఎన్‌సీసీ రెండు యూనిట్లు, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, వర్చువల్




క్లాస్ రూమ్స్ రెండు, ఐటీ రిసోర్స్ కింద కంప్యూటర్ ల్యాబ్, కామర్స్ ల్యాబ్, జేకేసీ ల్యాబ్, ఈఎల్ఎల్ ల్యాబ్, స్కిల్‌హబ్ ఉన్నాయి. ఇక్కడ చేరే విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు ఉన్నాయి.

**బీకాం ఎక్కువగా...**

సిల్వర్ జూబ్లీ కళాశాలలో చదివేందుకు పోటీ ఎక్కువగా ఉంది. బీఏలో 40, బీకాంలో 40, బీఎస్సీలో 120, లైఫ్ సైన్సులో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బీఏకు 114, బీకాంకు 521, లైఫ్‌సైన్స్‌కు 175, గణితానికి (బీఎస్సీ) 386 దరఖాస్తులు వచ్చినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఎక్కువగా బీకాం కోర్సుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. మే 29న రాష్ట్రంలో ఉన్న పలు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే హాల్ టికెట్లను %www://sjgckurnool.edu.in, cuklap.ac.in% వెబ్‌సైట్లో అందుబాటు ఉంచారు.

# ఈ ఏడాదైనా.. అధ్యాపకుల కొరత తీరేనా?




అనంతపురం : అనంత జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు లేక బోధన కుంటుపడుతోంది. ఇది పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడం, ఏటా పదవీ విరమణ చేస్తుండటంతో పోస్టులు ఖాళీ అవుతున్నాయి. దీంతో బోధించే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. మరోవైపు ఒప్పంద అధ్యాపకులతో తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అధ్యాపకులను విధుల్లోకి తీసుకుంటే సకాలంలో పాఠ్యాంశాలు పూర్తి చేసి పరీక్షల్లో ఆశించిన మేర ఫలితాలు వచ్చే అవకాశముంది. నాలుగేళ్లుగా అధ్యాపకుల నియామకాల నోటిఫికేషన్ వెలువడుతున్నా సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. దీంతో అధ్యాపకుల కొరత ఈ ఏడాదైనా తీరుతుందా.. అనేది సందేహంగా మారింది. 2012లో కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకాలు పూర్తిగా నిలిపివేశారు.

**కేవలం ప్రిన్సిపల్ పోస్టే..**

జిల్లాలో ప్రభుత్వ కళాశాలల భవనాలు నిర్మించినా.. అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదు. ప్రిన్సిపల్ పోస్టు మాత్రమే రెగ్యులర్‌గా నియమించారు. బోధనకు సంబంధించి అధికంగా ఒప్పంద, అతిథి అధ్యాపకులతో నడిపిస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు లేకపోవడంతో అతిథిలతోనే బోధన సాగుతోంది. వారు సైతం ఏడాది మధ్యలోనే ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఉన్న వారే సబ్జెక్టులను బోధించాల్సి వస్తోంది. బెళుగుప్ప, బొమ్మనహాళ్ తదితర కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేరు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు ఉన్నా ఉత్తీర్ణత శాతం తక్కువగానే ఉంది.

**హేతుబద్ధీకరణతో సమస్య పరిష్కారం**

కొన్ని జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు తక్కువగా ఉన్నారు. ఒప్పంద, అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. సమస్య పరిష్కరించడానికి అధ్యాపకుల హేతుబద్ధీకరణ చేస్తున్నాం. అన్ని కళాశాలల్లో అధ్యాపకులు ఉండేలా చర్యలు చేపట్టాం. ఈ విద్యాసంవత్సరంలో సమస్య పరిష్కారమవుతుంది

వెంకటరమణ నాయక్, వృత్తివిద్యాశాఖాధికారి, అనంతపురం

**జిల్లాలో ఇలా..**ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 23

ఉండాల్సిన అధ్యాపకులు: 433

ఉన్నవారు: 387

వారిలో రెగ్యులర్..: 113


ఒప్పంద ప్రాతిపదికన..: 209

అతిథి అధ్యాపకులు: 48

# ఎట్టకేలకు పండమేరు మరమ్మతు పనులు

అనంతపురం : అనంతనగర శివారులోని ఆర్డీటీ క్రీడా మైదానం వద్ద ఉన్న పండమేరు పాతవంతెన మరమ్మతు పనులు ఆరంభమయ్యాయి. గత సంవత్సరం అక్టోబరులో వంతెన మరమ్మతుకు గురైంది. వంతెన కంపిస్తుండడంతో వాహనాల రాకపోకల లేకుండా చేశారు. అప్పటి నుంచి వరుస కథనాలు వెలువరించింది. వాహనదారుల ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలతో వరుస కథనాలు వెలువడ్డాయి. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే వంతెన బాగు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఈ వంతెన ఉన్నందున కేంద్రం అనుమతి కోసం జాప్యమైంది. ఎట్టకేలకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ నుంచి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ ముగిసింది. ముంబయికి చెందిన ఓ గుత్తేదారు సంస్థ టెండరు దక్కించుకుంది. ఇటీవల పనులు ఆరంభించారు. అనంతపురం నుంచి ధర్మవరం వైపు వెళ్లే మార్గంలో ఉన్న ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. నాలుగు వరుసల ఈ రహదారిపై పక్కపక్కనే రెండు వంతెనలు ఉన్నాయి. పాత వంతెన మరమ్మతుకు గురికావడంతో కొత్త వంతెనపైకి రాకపోకలు మళ్లించారు. వంతెన మూతపడి ఒక్కసారిగా కొత్త వంతెనపైకి మలుపు తిరిగే సమయంలో వాహనాలు రోడ్డుకు అడ్డంగా వస్తున్నాయి. అక్కడికి రాగానే భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి

**66 బేరింగ్‌లు ధ్వంసం కావడంతో..**



వంతెన కింద వైపున్న 66 బేరింగులు ధ్వంసం అయ్యాయి. వాటి అమరిక, వంతెన మరమ్మతుకు రూ.కోటి వెచ్చించారు. ప్రస్తుతం వంతెన అతుకులను తొలగిస్తున్నారు. తర్వాత వంతెనను విభాగాలుగా వేరు చేస్తారు. రోడ్డు ఫ్లాట్‌ఫారం పైకి ఎత్తిన తరువాత బేరింగులు ఏర్పాటు చేస్తారు. పైకి ఎత్తిన ఫ్లాట్‌ఫారం యథాతథంగా అమర్చుతారు. కొత్తగా రోడ్డు నిర్మాణం చేస్తారు. మొత్తం వంతెన పూర్తి చేయడానికి కనీసం 3 నెలల సమయం పడుతుంది.

**వేగవంతంగా చేయిస్తాం...**పండమేరు పాత వంతెన మరమ్మతు పనులు రూ.కోటితో చేయిస్తున్నాం. పనులు ఆరంభమయ్యాయి. మొత్తం పనులు పూర్తి కావడానికి కొద్దిగా సమయం పడుతుంది. వేగవంతంగా పనులు చేయించి, వాహనాల రాకపోకల సమస్యలు పరిష్కరిస్తాం. సుధాకర్‌రెడ్డి, ఈఈ, జాతీయ రహదారులు

# పాత వస్తువులకు.. కొత్త కళ..

నంద్యాల : కొత్తొక వింత పాతొక రోత' అనే సామెతను పక్కనపెట్టి ఇంట్లో ఉన్న పాత సామగ్రితోనే కొత్త రకమైన వస్తువులు తయారు చేసి చూపిస్తున్నారు రమాదేవి. ఈమెకు చిన్నతనం నుంచే బొమ్మలంటే ఎంతో ఆసక్తి. పాత రోజుల్లో ప్రాచుర్యంలో ఉండే వస్తువులను బంకమట్టితో తయారు చేసేవారు. కాలక్రమేణా వ్యర్థాలతో చిన్నచిన్న ఆకృతులను సృష్టించి నేటి తరం పిల్లలకు వాటి ఉపయోగాలు, అర్థాలను వివరిస్తున్నారు. గ్రామీణ వాతావరణం, అక్కడ ఉపయోగించే వస్తువులు, పండుగలు ఎలా జరుపుతారో తెలిపే ఘట్టాలను బొమ్మలుగా సృష్టించి పట్టణాల్లో పెరిగే పిల్లలకు తెలియజేస్తున్నారు. ఆమె చేసిన కళాకృతులు పలు రాష్ట్రాల్లో ప్రదర్శించడంతో నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. మినియేచర్ కళ తనకెంతో



ఇష్టమని, ఈ కళను నేటితరం పిల్లలకు పరిచయం చేయాలనే దృక్పథంతో ఉచితంగానే శిక్షణ ఇస్తున్నట్లు రమాదేవి చెబుతున్నారు. ఎవరైనా తనను సంప్రదించినట్లయితే నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించేందుకు సిద్ధమంటున్నారు రమాదేవి.

సూక్ష్మ వస్తువులు కొలువైన మినీ ప్రపంచం ఆమె నివాసం. అందులో ఎన్నో వింతలు, విశేషాలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. గత వైభవాలుగా చెప్పుకునే పాతతరం వస్తువులెన్నో ఆమె చేతిలో చిన్న పరిమాణంలో బొమ్మలుగా రూపుదిద్దుకుంటాయి. వ్యర్థాలతో చిన్నచిన్న ఆకృతులను తయారు చేసే 'మినియేచర్' కళను నగరంలో విస్తరించేలా చేస్తున్నారు మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీకి చెందిన గుత్తుల రమాదేవి. ఈ కళపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మురళీనగర్

# నీటి కిట్టు.. వాడితే ఒట్టు

నంద్యాల : మద్దికెర సచివాలయానికి ప్రభుత్వం సరఫరా చేసిన ఎఫ్‌టీకే కిట్టు. కొంతకాలం నుంచి దీన్ని వినియోగించలేదు. అట్టపెట్టెలో భద్రంగా దాచారు. సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నాసరే ఇక్కడ నీటి నమూనాలు సేకరించడం లేదు. గ్రామీణ ప్రజలకు తాగునీటిని అందించే పథకాల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. నీటి నాణ్యత పరీక్షించి సరఫరా చేయాల్సి ఉన్నా ఈ విధానం సక్రమంగా అమలు కావడం లేదు. చినుకులు కురుస్తున్నాయి.. కొత్త నీరు వచ్చి చేరుతోంది. కలుషితమయ్యే ముప్పు అధికంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి ప్ర'జల'ను అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి నాణ్యత పరీక్షల కోసం ఇచ్చిన ఫీల్డ్ టెస్టింగ్ కిట్లను (ఎఫ్‌టీకే) మూలనపడేశారు.

కర్నూలు జిల్లాలోని 484, నంద్యాలలో 489 గ్రామాలకు గతేడాది నీటి పరీక్షా కిట్లు అందజేశారు. ఒక్కోదానికి రూ.1700 వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలోని 973 గ్రామ పంచాయతీలకు రూ.16,54,100 వ్యయం చేశారు. వీటి వినియోగంపై పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పర్యవేక్షణ బాధ్యతను సచివాలయ ఇంజినీరింగ్ సహాయకు



లకు అప్పగించారు. వాటిని వాడకుండా అటకెక్కించారు.

**ఎలాంటివి తెలుసుకోవచ్చు**

ఫీల్డ్ టెస్టింగ్ కిట్లతో నీటికి సంబంధించిన తొమ్మిది రకాల నీటి నాణ్యత పరీక్షలు చేయొచ్చు. నీటి గాఢత, అమ్లాలు, క్షారాలు, ఉప్పు, ఫ్లోరైడ్ శాతం ఇతర లవణాల శాతం తెలుసుకోవచ్చు.

పీపీఎం ఎంతశాతం ఉందన్నదీ నిర్ణయిస్తారు. సాధారణంగా నీటిలో గాఢత, అమ్లాలు, క్షారాలు ఎక్కువగా ఉంటే కడుపునొప్పి, గ్యాస్‌ట్రబుల్ వంటి అనారోగ్య సమస్యలు ఇబ్బందిపెడతాయి.

పీపీఎం 2 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు తేలితే ఆ నీళ్లు తాగడానికి పనికిరావు. వాటి శుద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇంత ప్రాధాన్యమున్న కిట్లను ఒక్క గ్రామంలోనూ వినియోగించకపోవడం గమనార్హం.

**ఊసేలేని నమూనాల సేకరణ**

గ్రామ పంచాయతీల్లో కుళాయి, తాగునీటి పథకాల నీటి నమూనాలు సేకరించాలి. ప్రజలు సచివాలయానికి నేరుగా తీసుకొచ్చే నీటిని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరీక్షించాలి. ఎక్కడా ఈ ప్రక్రియ జరగడం లేదు.ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ఫలితాల్లో తేడా వస్తే కర్నూలు జిల్లాలోని నాలుగు, నంద్యాల జిల్లాలోని నాలుగు వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్స్‌కు వీటి నమూనాలు పంపాల్సి ఉంటుంది. అధికారులు ఈ మాటే మరిచారు. ఎక్కడైనా అతిసారం ప్రబలినప్పుడు హడావుడి చేస్తున్నారు. పరీక్షల నివేదికలను సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. రెండు జిల్లాల్లోని 672 సచివాలయాల్లో ఎక్కడా ఇది జరగడం లేదు.

# మామిడి కోతలకు తొందరొద్దు!

చిత్తూరు : జిల్లాలో మామిడి సీజన్ జూన్ నుంచి జోరందుకోనుంది. ప్రస్తుతం బేనీషా, కాదర్, పుల్లేరా రకాలనే మార్కెట్ యార్డులకు తరలిస్తున్నారు. బేనీషా రకం ధరలు కాస్తా తగ్గుతుండటంతో ఇది ముమ్ముందు మరింత పతనమవుతుందని రైతులు తొందరపడి కోతలు చేపట్టవద్దని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో మంచి ధర వస్తుందని చెబుతున్నారు. పక్వానికి రాని బేనీషా రకాలను తేవడం వల్ల సరైన ధర లభించక నష్టపోవాల్సి వస్తోందని, పక్వానికి వచ్చిన కాయలనే తీసుకురావాలని మండీ యజమానులు చెబుతున్నారు. బేనీషా, తోతాపురి(లైన్ కాయలు) వ్యాపారులు, ఎగుమతిదారులు చిత్తూరు వచ్చారని, వారం రోజుల్లో వ్యాపారం ఊపందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తోతాపురి మామిడిని గుజ్జు పరిశ్రమలు జూన్ మొదటి వారం నుంచి సేకరించనున్నాయని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. చిత్తూరులో మామిడి ధర ఇలా..: చిత్తూరులోని మార్కెట్ యార్డుకు బేనీషా, కాదర్, పుల్లేరా, తోతాపురి(లైన్ కాయలు) చేరుతున్నాయి. శనివారం టన్ను బేనీషా ధర రూ.19-25 వేలు, కాదర్ రూ.28-32 వేలు, పుల్లేరా రూ.10-12 వేలు పలుకుతుండగా.. తోతాపురి లైన్ కాయలు రూ.18-20 వేలు ధర పలికాని మండీ యజమానులు పేర్కొన్నారు.

# అక్కడ కోడి కూయదు.. ఇక్కడ చెప్పులు తొడగరు!

పాకాల :ఓ ఊర్లో ఏమో కోడి కూత వినపడదు.. మరో గ్రామంలో ప్రజలు చెప్పులు వేసుకోవడం అపచారంగా భావిస్తారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను ఇరు గ్రామాల ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో కోళ్లు పెంచడం సహజం.. తెల్లారితే కోడి కూత వినబడటమూ సర్వసాధారణం. కానీ శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ తిమ్మరాజుపల్లెలో కోడి కూత వినపడదు.. గ్రామంలో కోడి కూత వినబడకూడదు.. అని పెద్దలు విధించిన కట్టుబాటును నేటి తరంలోనూ ప్రజలు పాటిస్తున్నారు.
తిమ్మరాజుపల్లెలో దాదాపు 120 కుటుంబాలున్నాయి. ప్రతి ఇంటా వలస జీవనాలను తరతరాలుగా కొనసాగిస్తున్నారు. ఊరంతా ఒకే బంధువర్గానికి చెందినవారే. గ్రామ సమీపంలోని తూర్పు దిక్కున అడవిలో ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు. వందేళ్ల కిందట పెద్దబ్బ అనే వృద్ధుడి కలలో తిమ్మరాయస్వామి ప్రత్యక్షమై.. గ్రామంలో కోడి కూత వినబడితే అరిష్టమని చెప్పడంతో అప్పట్నుంచి గ్రామస్థులు ఈ కట్టుబాటును పాటిస్తున్నారు. నేటి ఆధునిక యుగంలోనూ నాటి కట్టుబాటును తూ..చ తప్పకుండా కొనసాగిస్తున్న తిమ్మరాజుపల్లె జనం దైవ భక్తితో పాటు పెద్దల మాటకు విలువనిస్తూ ప్రత్యేకతను చాటుకొంటున్నారు.

**తిరు నగరం.. హరితశోభితం**

ఇదేదో మిద్దె పంట.. ఉద్యానంలోని మొక్కలు అనుకుంటే పొరపాటే.. తిరుపతి వినాయకసాగర్ వద్ద ఉన్న మురుగు శుద్ధి కేంద్రంలో నీటిశుద్ధి కోసం పెంచుతున్నవి. నగరం నుంచి వచ్చే మురుగు నీటిని వినాయ



క సాగర్ వద్ద వివిధ దశల్లో శుద్ధి చేస్తారు. ఈ క్రమంలో క్లోరిన్ కలుపుతారు.. నీటిలో ఏమైనా వ్యర్థాలు.. లార్వా, క్రిములు ఉంటే ఇక్కడ ఏర్పాటు చేసిన మొక్కలు వాటిని ఆకర్షిస్తాయి. మురుగునీటిలో పెరిగిన మొక్కలిలాప్రాంతంలో హరితశోభితంగా దర్శనమిస్తున్నాయి.

**వేమనఇండ్లులో తరతరాల సంప్రదాయం**

చెప్పులు లేకుండా బయటకెళ్లడం కష్టసాధ్యం. కానీ పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ, వేమనఇండ్లు గ్రామంలో మాత్రం ప్రజలు భూమిని దేవతగా భావించి చెప్పులు లేకుండా నడుస్తున్నారు. నేలపై పాదం మోపాలన్నా క్షమాపణలు చెప్పి కాలు కింద పెడతారు. పాదరక్షలు ధరించి నేలపై నడవడాన్ని అపరాధంగా భావిస్తారు. బయటి ప్రాంతాల వారు సైతం ఈ ఆచారాన్ని పాటించాల్సిందేనని ఆ ఊరి ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో నెలవైన శ్రీవేంకటేశ్వరస్వామిని కొలుస్తారు. ఇక్కడ పాతిక కుటుంబాలు, 90 మంది జనాభా నివాసముంటోంది. అందరూ ఒకే ఇంటి పేరు కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషం.

**ఇల్లు చేరాకే భోజనం**

ఉదయం భోంచేసి బయటి ప్రాంతాలకు వెళ్లిన వారు.. మళ్లీ ఇంటికి తిరిగి వచ్చాకే భోజనం చేస్తారు. ఒక్కో సందర్భంలో తినాల్సి వస్తే స్నానం చేశాకే గ్రామంలోకి ప్రవేశిస్తారు. బయటి వ్యక్తులను తాకినా ఇదే ఆచారాన్ని పాటిస్తారు. పరిసర గ్రామాల ప్రజలు వీరి సంప్రదాయాలను ఇప్పటికీ గౌరవిస్తున్నారు.

# అప్పన్న భూముల్లో అక్రమార్కుల పాచిక

విశాఖపట్నం : విలువైన సింహాచలం అప్పన్న స్వామి భూములకు రక్షణ లేకుండా పోతోంది. కొంతకాలంగా జరుగుతున్న ఆక్రమణల తీరే ఇందుకు నిదర్శనం. 2008లో 12 వేల కట్టడాలను అధికారికంగా గుర్తిస్తే ఆ తర్వాత 50 వేలకు పైగా పుట్టుకొచ్చాయి. వేల సంఖ్యలో పుట్టగొడుగుల్లా వెలియడం.. దేవస్థానం భూపరిరక్షణ విభాగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందనే విమర్శలొస్తున్నాయి.
**పంచగ్రామాల సమస్యతో:** పంచగ్రామాల్లోని సింహాచలం భూముల్లో నెలకొన్న సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతంలో గుర్తించిన అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంది. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు మరిన్ని అక్రమ నిర్మాణాలకు తెగబడుతున్నారు. ఇందుకు ఏకంగా నకిలీ ఎల్ఆర్సీ (స్థల క్రమబద్ధీకరణ ధ్రువీకరణ పత్రం)లతో బురిడీ కొట్టిస్తున్నారు. కొందరు గతంలో ఇచ్చినట్లు పత్రాలు సృష్టిస్తున్నారు. వాటి ఆధారంగానే నాయుడుతోట, వేపగుంట, అప్పన్నపాలెంలో అక్రమ నిర్మాణాలు దర్జాగా సాగిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ నిర్మాణాలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇవన్నీ కొందరు దేవస్థానం ఉద్యోగుల సహకారంతోనే జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.
ఇదే తగిన సమయమని: కొద్ది రోజులుగా సింహాచలం, వేపగుంట, చీమలాపల్లి అడవివరం, ఇతర కొండవాలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు ఎక్కువైపోయాయి. దేవస్థానంలో భూముల పరిరక్షణకు ప్రత్యేక విభాగం ఉన్నా అడ్డుకోలేకపోతోంది. ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు, ఏఈవోలు, కమ్యూనిటీగార్డులు, సెక్యూరిటీగార్డులున్నా చూసీచూడనట్లు ఉంటున్నారు. పలు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో ఓ ఏఈవోను సింహాచలం దేవస్థానం నుంచి మరో చోటుకు బదిలీ చేశారు. అలాగే కుమ్మరి వీధిలో స్థానిక నేత భారీ భవనాన్ని యథేచ్ఛగా నిర్మించేస్తున్నా అడ్డుకోలేదు.
చర్యలేవి: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమ నిర్మాణాలు దర్జాగా సాగాయి. అందులో దేవస్థానం భూపరిరక్షణ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ఏఈవోల పాత్ర ఉన్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని అప్పట్లో నివేదిక ఇచ్చినా ఫలితం లేకపోయింది. వారిని అక్కడే కొనసాగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇదే పరిస్థితి.
మిగిలిన వాటి ఆధారంగా: గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా సింహాచలం భూముల క్రమబద్ధీకరణకు 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో 2500 మందికి ఎల్ఆర్సీ పత్రాలు మంజూరు చేశారు. అనుమతి కోసం డబ్బులు చెల్లించిన వారు 700 మంది వరకున్నారు. పెండింగులో 2800 దరఖాస్తులు ఉన్నాయి. నాటి జీవోను అప్పట్లోనే నిలిపేయడంతో ఎల్ఆర్సీ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. మిగిలిన వాటి ఆధారంగా కొందరు తాజాగా అవకతవకలకు పాల్పడుతున్నారు. వాస్తవానికి అప్పట్లో ఎంత మందికి ఎల్ఆర్సీలు ఇచ్చారు, ఎన్ని పెండింగులో ఉన్న వివరాలు బయట పెట్టకపోవడం అక్రమాలకు తావిస్తోంది.

# ఇంకెన్ని ప్రాణాలు పోవాలి?



గుంతకల్లు : వందల ఏళ్లనాటి రైల్వేస్టేషన్.. రోజూ 200 దాకా రైళ్లు పరుగులు పెడుతుంటాయి.. ప్రయాణికులు వేళ సంఖ్యలో ఉంటారు.. రూ.కోట్లలో ఆదాయం.. అంతటి ఘన చరిత్ర ఉన్న గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో నేటికీ కాలం చెల్లిన భవనాలను వినియోగిస్తున్నారు. గదులు పెచ్చులూడితే పైపై మెరుగులు దిద్ది వదిలేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. శిథిల గదులను కూల్చేసి నూతన కట్టడాలు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో 6, 7 ప్లాట్‌ఫారాల మధ్య ఆంగ్లేయులు 155 సంవత్సరాల కిందట నిర్మించిన భవనాల్లోనే స్టేషన్‌ను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పై అంతస్తులో భవనాలు శిథిలావస్థకు చేరడంతో పదేళ్ల కిందట కండెం చేశారు. కిందనున్న భవనాల్లో ప్రయాణికుల విశ్రాంతి గదులతోపాటు హెూటళ్లను నిర్వహిస్తున్నారు. గదుల్లో పటుత్వం తప్పుతుండటంతో జనరల్ విశ్రాంతి గది గోడకున్న సిమెంటు పెచ్చులూడి శుక్రవారం కర్నూలుకు చెందిన బాలుడు మృతి చెందిన విషయం విదితమే. ఇక్కడున్న గదుల పటిష్ఠత గురించి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. స్టేషన్‌లో పలుచోట్ల గోడల పరిస్థితి ఇలాగే ఉంది. తాత్కాలిక మరమ్మతులు చేసి గుత్తేదారులు లాభపడుతున్నారు కానీ ప్రయాణికులకు ప్రయోజనం లేకుండా పోతోంది. ఎక్కువ సంఖ్యలో రైళ్లు (రోజూ 120) 6, 7 ప్లాట్‌ఫారాల గుండా వెళుతుంటాయి. ఈ రెండు ప్లాట్‌ఫారాలు నిత్యం ప్రయాణికులతో నిండి ఉంటున్నాయి. వర్షం పడితే నీరు చేరుతుంది. ప్రయాణికులు నిలబడటానికి కూడా వీలు ఉండదు. ఉన్నతాధికారులు తరచూ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్నారే.. కానీ శాశ్వత మరమ్మతులు చేయించలేకపోతున్నారు.

**రూ.20 కోట్లు కేటాయింపు**

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని పాత స్టేషన్ భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడానికి, యార్డు విస్తరణ, అన్ని ప్లాట్‌ఫారాలకు చెందిన లైన్ల అనుసంధానం కోసం రైల్వే బోర్డు రూ.20 కోట్లు కేటాయించినట్లు రైల్వే అధికారులు చెప్పారు. పనులను అమలు చేసే బాధ్యతను రైల్వే బోర్డు గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) కార్యాలయం అధికారులకు అప్పగించింది. స్టేషన్‌లోని పాత భవనాలతో పాటు పాత టికెట్ బుకింగ్ కార్యాలయాన్ని తొలగించి కొత్త రైల్వేలైన్లు, భవనాలను నిర్మించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పనుల్లో భాగంగా కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం ఇప్పటికే అధికారులు రూ.4 కోట్లు వ్యయం చేసి నాలుగేళ్ల కిందట భవనాలను నిర్మించారు. ప్రస్తుతం ఇవి నిరుపయోగంగా ఉన్నాయి.

# నాణ్యతే విజయ రహస్యం!



బుక్కరాయసముద్రం : పలు పెట్రోల్ బంక్‌లలో కల్తీ జరుగుతోందని వాహనదారులు నిత్యం ఎక్కడో చోట ఆరోపిస్తున్నారు. దీనికి బలం చేకూర్చేలా కొంతకాలం క్రితం అధికారుల తనిఖీల్లో అక్రమాలు వెలుగుచూశాయి. అనంత నగరంలోని రెండు పెట్రోల్ బంక్‌లను సైతం సీజ్ చేశారు. ఇలాంటి తరుణంలో అనంతపురం–తాడిపత్రి ప్రధాన మార్గం.. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని జైళ్లశాఖ వ్యవసాయ క్షేత్రంలో జీవితఖైదీలు 9 ఏళ్లుగా పెట్రోల్ బంక్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ వినియోగదారుల వద్ద మంచిపేరు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రంలో 42 మంది జీవితఖైదీలు ఉన్నారు. వారిలో మార్పు తీసుకురావడానికి జైలు అధికారులు వివిధ రకాల పనులు చేయిస్తుంటారు. గతంలో పశువులు, గొర్రెల పెంపకం, వ్యవసాయం చేయించేవారు. 2016లో ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురం–తాడిపత్రి రహదారికి ఇరువైపులా రెండు పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏమాత్రం లాభాపేక్ష లేకుండా నామమాత్ర కమీషన్‌తోనే ఖైదీలే నిర్వహిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత.

**రోజూ రూ.10 లక్షల వరకు..**

ఇంధనం కొలత, నాణ్యతలో విధిగా నిబంధనలు పాటిస్తుండటంతో వినియోగదారులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అనంత నగరానికి సమీపాన ఉండటంతో ఉద్యోగులు, వ్యాపారులు సైతం ఇక్కడికి వచ్చి వాహనాల్లో ఇంధనం నింపుకొని వెళ్తున్నారంటే ఈ పెట్రోల్ బంక్‌లపై ఎంత నమ్మకం ఉందనే విషయం అర్థమవుతోంది.
రెండు షిఫ్టుల్లో 10 మంది చొప్పున ఖైదీలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ రెండు పెట్రోల్ బంక్‌లలో రూ.8 లక్షల నుంచి 10 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. కమీషన్ ద్వారా ప్రతి నెలా జైళ్లశాఖకు రూ.6 లక్షల వరకు వస్తుంది. ఈ ఆదాయాన్ని జైళ్లశాఖ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. బంక్‌లలో రోజంతా పని చేసే జీవితఖైదీలకు రూ.200 చొప్పున చెల్లిస్తారు. ఇందులో రూ.100 ఖైదీల ఖర్చులకు... మిగిలింది వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. విడుదలయ్యే సమయంలోనే అందిస్తారు.
**ఎక్కడా రాజీపడం..** పెట్రోల్ బంక్‌లు ప్రారంభించినప్పటి నుంచి నాణ్యతలో ఎక్కడా రాజీ పడలేదు. ఖచ్చితమైన కొలతలతో వినియోగదారులకు ఇంధనం నింపుతున్నాం. జీవితఖైదీలు నిరుత్సాహం, ఒత్తిడికి గురవకుండా చక్కగా పని చేసుకునే అవకాశాన్ని కల్పించాం. బంక్‌ల వద్ద జైలు వార్డెన్లు పర్యవేక్షిస్తుంటారు. షఫివుర్ రెహమాన్, పర్యవేక్షకులు, ఖైదీల వ్యవసాయ క్షేత్రం

# వలస నేలపై అనుబంధాల పొదరిళ్లు

ఒంగోలు: ప్రకాశం..వలసలకు నిలయం. జిల్లాలో ఇప్పుడిప్పుడే పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నిర్మాణం వేగం పుంజుకుంది. ఆ తరహా సంస్కృతి వేగంగా పెరుగుతోంది. పిల్లల చదువుల కోసమో, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తమో పల్లెలను వదిలి పట్టణాలకు వచ్చిన వారికి అనుబంధాలకు నిలయాలుగా మారుతున్నాయి.

**సమాచారం వేగిరం**

నిర్వహణ కమిటీ సూచన మేరకు భద్రతా సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలను ఆయా కుటుంబాలకు చేరవేస్తున్నారు. వైద్య శిబిరాలు, పిల్లలకు వేసే టీకాలు, వ్యాధుల నివారణపై సమాచారం అందిస్తున్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకించి ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో ఆరోగ్యం, యోగా, ఉపవాసం, ఆయుర్వేదం తదితర మార్గాలపై సమాచారం పంచుకుంటున్నారు.

**ఆటలు.. వసతులు**

బహుళ అంతస్తులు అత్యంత సంతృప్తికరమైన జీవన విధానానికి నిలయాలు మారుతున్నాయి. ఇళ్లు ఆధునికంగా ఉండటంతో పాటు వ్యాయామశాలలు, ఈత కొలనులు, తోటలు, లాండ్రీ సౌకర్యాలు సమకూర్చుకుంటున్నారు. పిల్లల కోసం ఆట స్థలం, ఇండోర్ కోర్టులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పిల్లలకు ఈత కొలనులు నిర్మించుకుంటున్నారు.

**అదో మినీ భారతం**

జిల్లాలోని కొన్ని బహుళ అంతస్తుల భవనాలు మినీ భారత్‌ను తలపిస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారూ నివాసం ఉంటున్నారు. వీరంతా పండుగలు, వేడుకల్లో స్థానికులతో మమేకం అవుతున్నారు. ఒంగోలులోని బీకే గేటెడ్ కమ్యూనిటీ ఇందుకు నిదర్శనం. నవ వసంతాన్ని స్వాగతిస్తూ డిసెంబరు 31న ఇక్కడ సందడి చేస్తారు. అర్ధరాత్రి కేకును కోసి.. కొత్త వత్సరం రాకను పండగలా నిర్వహించుకుంటారు. వినాయక చవితి, దేవీ నవరాత్రులను తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. రంగుల వేడుకైన హెూలీని హెూరెత్తిస్తారు.

**కష్టసుఖాల్లో తోడునీడ**

పెళ్లిలు, ఇతర శుభకార్యాలయాల్లో ఆనందాలను పంచుకునే వారు.. ఆత్మీయులు పోగొట్టుకొని విషాదంలో ఉన్న కుటుంబాలకు ఒకరికొకరు ఆసరాగా ఉంటున్నారు. దూరం నుంచి బంధువులు వచ్చే వరకు వేచి ఉండకుండా సమాచారం చేరవేత నుంచి.. అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్ల వరకు దగ్గరుండి చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇతరులు ఇబ్బందులు పడకుండా మృతదేహాలను ఉంచడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.**సందడే సందడి**మహిళలు కిట్టీ పార్టీలు నిర్వహించుకుంటూ తోటివారితో స్నేహంగా ఉంటున్నారు. కొందరు కలిసి భక్తి బృందంగా ఏర్పడి పూజా కార్యక్రమా లు చేస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతున్నారు. పిల్లలు ఆడుకోవడానికి సమవయస్కులకు కొదవలేదు. అంతా కలిసి ఇంటింటా తిరుగుతూ సందడి చేస్తుంటారు.
**ప్రతి భవనంలో ఆలయం**దేవాలయాలను బహుళ అంతస్తుల భవనాల్లో తప్పనిసరిగా నిర్మిస్తున్నారు. శ్రావణం, కార్తికం, ధనుర్మాసంలో నెల రోజులు సామూహికంగా ఆరాధన పర్వాలు సాగిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా నిర్మించుకున్న పెద్దపీట వేస్తున్నారు.

# సుఖీభవ హక్కుకు రీసర్వే చిక్కు

అనకాపల్లి : రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్‌తో కలిపి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇందులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పేరుతో వారికి త్వరలో ఆర్థిక సాయం అందించనున్నారు. కానీ గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పిదాలు... రైతులకు ఇప్పుడు శాపంగా మారాయి. అప్పట్లో అస్తవ్యస్తంగా సాగిన రీసర్వేతో ఇప్పుడు కొందరికి పెట్టుబడి సాయం ప్రశ్నార్థకంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో సాగు భూములను రీసర్వే చేశారు. దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లను (ఎల్‌పీఎం) తీసుకువచ్చారు. సర్వే నంబరు ఒక వ్యక్తికి ఒక్కటే ఉంటుంది. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. రీ సర్వే తర్వాత నలుగురైదుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. ఎల్‌పీఎంలో ఏ రైతు పేరు నమోదు చేస్తే... మిగిలినవారి భూవిస్తీర్ణం మొత్తం ఆయన పేరుమీదే నమోదైంది. ఇలాంటి ఉమ్మడి ఎల్‌పీఎం నంబర్లు అన్నదాత సుఖీభవ లబ్ధికి చిక్కుముడిగా మారాయి. ఒక్క రైతు పేరే రికార్డుల్లో ఉండటంతో మిగిలిన వారికి లబ్ధి అందే పరిస్థితి కనిపించడం లేదు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో శీరంశెట్టి నూకరాజుకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో భూమి ఉంది. రెండు చోట్ల రెండు వేర్వేరు ఆధార్ నెంబర్లు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధార్ నంబరు తప్పుగా నమోదైంది. చాలామంది ఫోన్ నెంబర్లు తప్పుగా ఉన్నాయి.
మునగపాక మండలం చూచుకొండలో 35, మునగపాకలో 55 మంది



రీసర్వే డేటా రావడం లేదు. రీసర్వే చేసిన ప్రతి గ్రామంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ మండలంలో 17,536 మంది సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించగా... ఇంతవరకు 13,199 మంది రికార్డులు మాత్రమే సరిగ్గా ఉన్నట్లు గుర్తించారు.

**అర్హత తెలిసేదిలా..**

రైతు సేవాకేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారి లాగిన్లకు ఇచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం సరిగా ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తారు. అక్కడ నుంచి వ్యవసాయాధికారి లాగిన్‌కు పంపుతారు. ఆ తర్వాత జిల్లా వ్యవసాయాధికారికి చేరుతుంది. అక్కడ ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తారు.

సాగుదారులు: 5,10,110
సుఖీభవకు అర్హులు: 4,47,577
పరిశీలనలో ఉన్నవి: 14,058
తిరస్కరణ: 19,284
పెండింగ్: 90,097

పరిశీలిస్తున్నాం: రీసర్వే చేసిన గ్రామాల్లో కొన్ని ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమే. ముఖ్యంగా ఆధార్ నంబర్లు సరిగా ఉండటం లేదు. ఆధార్ లింకయిన ఫోన్ నంబర్లు ఉండాలి. కొన్ని చోట్ల ఫోన్ నంబర్లు తప్పుగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల ఎల్‌పీఎంలు సరిగా లేవు. వీటన్నింటిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా. అర్హులైన ప్రతి రైతుకు సుఖీభవ లబ్ధి దక్కేలా చూడాలని ప్రయత్నిస్తున్నాం. ఎం.రామారావు, ఏడీ, అనకాపల్లి

# రైల్వే జోన్ పనులు చకచకా

ఆరిలోవ : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. తెలుగు ప్రజల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లు ఆలస్యమైంది. జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించలేదని 2023లో అప్పటి రైల్వేశాఖ మంత్రి ప్రకటన చేసిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో 54 ఎకరాల భూమిని కేటాయించింది.
ఆ భూములు రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నాయని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో జోన్ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు.కథనంతో తొలగిన అడ్డంకి: కోల్‌కతాకు చెందిన ఓ సంస్థ టెండరు దక్కించుకుంది. మార్చి నెలలో పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక రామకృష్ణాపురం ప్రజలు తమకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 20 రోజులపాటు



పనులు జరగనీయలేదు. ఈ సమస్యను పరిష్కరించడంలో జాప్యమవుతోందని ప్రచురితమైంది.
స్పందించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళన చేస్తున్న రైతులకు దగ్గరలోని ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇప్పిస్తామని చెప్పి జోన్ పనులకు ఆటంకం లేకుండా చేశారు. దీంతో ఏప్రిల్ నెలాఖరు నుంచి తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రధాన భవనం నిర్మాణం కోసం భూమిని తవ్వుతున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 90 మంది కార్మికులు స్థలంలోనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని పనులు వేగంగా చేస్తున్నారు.
ప్రాజెక్టు పూర్తికి రెండేళ్ల గడువు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైల్వే జోన్‌పై ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రధానమంత్రి, రైల్వేశాఖ మంత్రితో దఫదఫాలుగా చర్చలు జరిపి మార్గం సుగమం చేసింది. భూమి కేటాయింపు విషయంలో స్పష్టమైన ప్రకటన చేసింది. భూసార పరీక్షలు చేయించి ఫలితాలు వచ్చిన తరువాత టెండరు ప్రక్రియ ప్రారంభమయ్యేలా కృషి చేసింది. తూర్పు కోస్తా రైల్వే జోన్ కార్యాలయం గతేడాది డిసెంబరులో టెండరు పిలిచింది. జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.149 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించాలన్నది ప్రతిపాదన. ఈ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి చేయాలని గడువుగా పెట్టుకున్నారు.




## అనసూయ... మోడర్న్ డిజైన్స్‌లో స్టన్నింగ్ గ్లామర్!

టాలీవుడ్‌లో యాంకర్‌గా, నటిగా బలమైన గుర్తింపు తెచ్చుకున్న అనసూయ భరద్వాజ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె పర్పుల్ అండ్ యెల్లో కాంబినేషన్‌లో డిజైనర్ అవుట్‌ఫిట్ ధరించి ఇచ్చిన ఫొటోషూట్ పోజులు సోషల్ మీడియాలో హీట్ పెంచుతున్నాయి. ఈ అందమైన కలర్ కాంబినేషన్‌లోని డ్రెస్, ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అనసూయలోని ఫ్యాషన్ ఫ్లేర్‌ను మరోసారి నిరూపించాయి. ఈ ఫొటోలలో అనసూయ ధరించిన డిజైనర్ చోలీ, అలాగే లైట్ యెల్లో ఫ్లోయింగ్ స్కర్ట్ అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పింక్ బ్యాక్‌గ్రౌండ్‌లో వేసిన కొన్ని పోజులు మరో లెవెల్‌లో ఉండగా, అవుట్‌డోర్ ఫొటోలు మరింత నాచురల్‌గా అనిపించాయి. స్పష్టంగా



చెప్పాలి అంటే... ఈ లుక్‌లో అనసూయ ఫ్యాషన్ ఐకాన్‌లా మెరిసి పోయారు. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, 'జబర్దస్త్' షో ద్వారా మాస్ అభిమానులకు దగ్గరైంది. ఆ తరువాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి సినిమాల్లో నటిగా తన వేరియేషన్ చూపించి మంచి పేరు సంపాదించుకుంది. ఆమె నటనకు గల డెఫినిషన్ ఒక్కటే... ఎంత మైనస్ రోల్ అయినా, ఎంత బోల్డ్ క్యారెక్టర్ అయినా న్యాయం చేస్తుంది. ఇటీవల ఆమె ఓటీటీ ప్రాజెక్ట్స్‌లోనూ యాక్టివ్‌గా మారింది. సినిమాలకే కాకుండా అనసూయ ఫ్యాషన్ గేమ్‌లోనూ ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో ఉంటుంది. ప్రతి ఫొటోషూట్‌లోనూ ఒక కొత్త ప్రయోగాన్ని చేస్తూ, తన వయస్సు మీద కాదు తన స్టైల్ మీద దృష్టి పెట్టే తత్వం ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ట్రెండీ లుక్‌లతో పాటు ట్రెడిషనల్ డ్రెస్‌ల్లోనూ ఆమెకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.

## నటి పిల్లల్ని ట్రోల్ చేస్తే కార్‌తో గుద్దించేస్తుందట

సోషల్ మీడియా యుగంలో ట్రోలింగ్ సర్వ సాధారణంగా మారింది. ప్రతి చిన్న అంశంపైనా చర్చలు, కామెంట్లు తీవ్రంగా మారాయి. ఇటీవల స్టార్ కిడ్స్ పై ఘోరమైన ట్రోలింగ్ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ లో నటవారసుల అందచందాలు, విలాసాలు, లెగసీ వైఫల్యాలపై టార్గెట్ చేస్తూ కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే తన పిల్లలను ఎవరైనా కించపరుస్తూ కామెంట్ చేస్తే సీనియర్ నటి కాజోల్ అయితే ఏం చేస్తుందో తెలుసా? ఇదే ప్రశ్న కాజోల్ ని ప్రశ్నించింది మీడియా.. దీనికి స్పందించిన ఈ మేటి కథానాయిక.. -నా కార్ ఎదుటకు రావొద్దని చెబుతాను.. ఎందుకంటే మీదికి ఎక్కించి తొక్కించేస్తాను! - అని సరదాగా వార్నింగ్ ఇచ్చారు. కాజోల్ ప్రస్తుతం మా సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఈ హారర్ థ్రిల్లర్ లో తన కుమార్తెను కాపాడుకునే తల్లి పాత్రలో కాజోల్ అద్భుతంగా



నటించారని ప్రశంసలు కురుస్తున్నాయి. నిజ జీవితంలోను తన పిల్లల జోలికి వస్తే కాజోల్ ఎలా ప్రవర్తిస్తారు? అనేది ప్రశ్న. ఒకప్పుడు అస్సలు సహించే స్థితిలో లేనని కాజోల్ తెలిపారు. -పిల్లలను కాపాడుకునే తల్లిగా, ఒకప్పుడు చాలా సీరియస్ గా ఉండేదానిని... ఇప్పుడు కొంత కూల్ గా ఉన్నాన-ని కూడా కాజోల్ అన్నారు. సోషల్ మీడియాలు, ట్రోలింగ్ జీవితాల్లో చిన్న భాగం.

దానికి బదులుగా సానుకూల అంశాలపై దృష్టి పెట్టాలని తన పిల్లలకు సలహా ఇచ్చినట్టు కాజోల్ తెలిపారు. సోషల్ మీడియాల్లో అలా మాట్లాడేవారు ఒక శాతం లేదా 0.1 శాతం మాత్రమే ఉంటారు. ఆ వ్యాఖ్యల్లో నిజమెంతో ఎవరికీ తెలీదు. అలాంటి వాటిపై కాదు..మీరు మంచిపై దృష్టి పెట్టాలి! అని కాజోల్ అన్నారు.

## హృతిక్ - తారక్: ఎదురుపడితే బస్తీ మే సవాల్!



భారతీయ సినీరంగంలో ఇద్దరు పెద్ద సూపర్ స్టార్లు హృతిక్ - ఎన్టీఆర్‌తో సినిమా చేయడంలో ఉన్న ఛాలెంజ్ గురించి అయాన్ ముఖర్జీ తాజా ఇంటర్వ్యూలో ఓపెనయ్యాడు. 'వార్ 2' స్టార్లు నువ్వా నేనా? అంటూ బాహా బాహీకి దిగితే, అభిమానులను సంతృప్తి పరిచేలా ఇరువైపులా ఆలోచించి ప్రతి సన్నివేశాన్ని అత్యంత జాగ్రత్తగా మలచాలి. పైగా యాక్షన్ ఎపిసోడ్స్ లో ఎవరినీ తక్కువగా చూపించకూడదు. పోటాపోటీగా ఢీకొట్టేలా సరైన ఘర్షణ వాతావరణాన్ని ఆ రెండు పాత్రల మధ్యా పుట్టించాలి. ఒకరితో ఒకరు తలపడుతున్నారంటే దానికి సరైన లాజిక్ కావాలి. అందుకే యాక్షన్ సీన్స్ ని తెరకెక్కించేందుకు చాలా సమయం పట్టిందని అన్నాడు అయాన్. హృతిక్-ఎన్టీఆర్ మధ్య నువ్వా నేనా అని పోటీపడేంత ఘర్షణ ఎలివేట్ కావడానికి తీవ్రమైన కథాంశాన్ని సృష్టించడం ప్రధాన సవాల్‌గా మారిందని అయాన్ ముఖర్జీ అంగీకరించాడు. "వార్ లాంటి ఫ్రాంచైజీని ముందుకు తీసుకెళ్లడం.. మన సొంత ముద్ర వేయడం చాలా పెద్ద బాధ్యత. మొదటి భాగంలో ఏది వర్కవుటైందో దానిని గౌరవిస్తూనే, కొత్త కథను చెప్పాలి. కానీ అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని కూడా భావించాను" అని అయాన్ ముఖర్జీ చెప్పారు. ప్రతిదీ ఫ్యాన్ బేస్ ఆధారంగా అయాన్ ముఖర్జీ ఆలోచించానని చెప్పారు. అంటే హృతిక్ అభిమానులతో పాటు, ఎన్టీఆర్ అభిమానులను సంతృప్తి పరిచే స్థాయి యాక్షన్ సన్నివేశాల కోసం చాలా ఎక్కువ సమయం తీసుకున్నానని తెలిపాడు. ఆ రెండు పాత్రలు ఎదురు పడితే ఎదురయ్యే ఘర్షణ ఎప్పటికీ మర్చిపోనిదిగా ఉండాలి. అందుకోసం చాలా ఆలోచించాల్సి వచ్చిందని అన్నాడు. ముఖ్యంగా వార్ చిత్రంలో హృతిక్ రోషన్- టైగర్ ష్రాఫ్ మధ్య భీకరమైన పోరాట సన్నివేశాలున్నాయి. వాటన్నిటినీ మించేలా ఇప్పుడు కొత్త యాక్షన్ సీక్వెన్సులను చూపించాలి... ఫ్రాంఛైజీకి కొత్త దర్శకుడిగా ఇది అతడికి సవాల్ లాంటిది. అయితే అయాన్ ముఖర్జీ ప్రస్తావించని మరో ముఖ్యమైన అంశం ఒకటి ఉంది. ఇప్పటికే ధూమ్ సిరీస్, క్రిష్ ఫ్రాంఛైజీ సినిమాల్లో హృతిక్ యాక్షన్ అవతార్ ని, ప్రదర్శనను పీక్స్ లో ఎంజాయ్ చేసారు ప్రజలు. అందువల్ల ఆ సినిమాల యాక్షన్ స్థాయిని మించేలా వార్ 2లో సీక్వెన్సులను రూపొందించాల్సి ఉంటుంది. అలా చేయలేని పక్షంలో అయాన్ ముఖర్జీ పూర్తిగా విఫలమైనట్టు. ఈ సవాల్ ని అతడు ఎలా అధిగమించాడో థియేటర్లలో ప్రజలు స్వయంగా చూసి చెప్పాలి.

ఇటీవల విడుదలైన టీజర్ పై విమర్శలొచ్చాయి. నాశిరకం గ్రాఫిక్స్ తో యాక్షన్ ఎపిసోడ్స్ తేలిపోయాయని విమర్శించారు. ఈ విమర్శల్ని ఫైనల్ ఔట్ పుట్ లో తిప్పి కొట్టాలి. ట్రైలర్ తో దానిని సవరించి తన సినిమా గొప్ప ఎత్తున ఉంటుందని నిరూపించాల్సి ఉంది. ఎన్టీఆర్- హృతిక్ ప్రత్యేకమైన జోడీ అని నిరూపిస్తూ, ప్రేక్షకులకు ప్రత్యేకమైనది అందిస్తానని అయాన్ చెబుతున్నాడు. అయితే అది మాటలను మించి చేతలుగా మారాలని ఆకాంక్షిద్దాం.

## సుందరి ఇలా భయపడితే ఎలా?



స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి రిలీజ్ అయితే బాక్సాఫీస్ వద్ద వార్ తప్పదు. రిలీజ్ ల విషయంలో హీరో లెవరు రాజీ పడే పరిస్థితి ఉండదు. ఒకరికొకరు సై అంటూ దూసుకొస్తారు. పోటీగా ఎన్ని సినిమాలున్నా సరే ఆ సీజన్ టార్గెట్ గా బరిలోకి దిగుతుంటారు.

బాక్సాఫీస్ వద్ద ఇలాంటి పోటీ వాతావరణం ఎన్నోసార్లు చూసిం దే. అన్ని చిత్ర పరిశ్రమలోనూ ఇలాంటి పోటీ కనిపిస్తుంటుంది. ఇలాంటి కాంపిటీషన్ నుంచి ఎగ్జిట్ అయ్యేది చిన్నా చితకా చిత్రాలు తప్ప! పెద్ద చిత్రాలేవి తప్పుకోవు. అయితే బాలీవుడ్ లో ఓ స్టార్ హీరో, హీరోయిన్ నటిస్తున్న చిత్రం మాత్రం ఇలాంటి పోటీ నుంచి ఎగ్జిట్ అయి ఆశ్చర్య పరిచింది. వివరాల్లోకి వెళ్తే జులైలో బాలీవుడ్ నుంచి చాలా సినిమాలు రిలీజ్ అవుతు న్నాయి. చాలా కాలంగా కొత్త రిలీజ్ లు లేక బోసి బోయిన బాలీవుడ్ థియేటర్లు జులైలో కొత్త రిలీజ్ లతో కళకళ లాడనున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా తుషాల్ జలోటా తెరకెక్కించిన %-%పరమ్ సుందరి - కూడా జులై 25న రిలీజ్ తేదీ ఫిక్స్ చేసుకుంది. అధికారికంగా రిలీజ్ తేదీ కూడా ప్రకటించారు. అయితే ఇప్పుడీ సినిమా వాయిదా పడిందని సమాచారం. అందుకు కారణం ఆ నెలలో చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతోనే తమ చిత్రాన్ని వాయిదా వేసుకో వాలని మేకర్స్ భావిస్తున్నారుట. అన్ని అనుకూలంగా ఉంటే ఆగస్టులో రిలీజ్ చేయాలనుకుంటున్నా రుట. దీంతో పరమ్ సుందరి కంటెంట్ పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజల్ట్ ముందే ఊహించి పోటీలో ఎందుకని వాయిదా వేస్తున్నారా? లేక పోటీని తట్టుకుని నిలబ డలేదని వాయిదా వేస్తున్నారా? ఇదేం చిన్న సినిమా కాదే? స్టార్ క్యాస్టింగ్ ఉన్న చిత్రమే ? వాయిదా ఏ కారణంగా అంటూ నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ చిత్రాన్ని దినేష్ విజన్ నిర్మిస్తున్నారు.

## తప్పు ఎక్కడ జరిగింది శ్రీనిధి...?

కన్నడ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వడం తోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2016 లో మిస్ సుప్రానేషనల్ కిరీటాన్ని గెలుచుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సమయంలోనే ఈ అమ్మడికి కన్నడ సినిమా ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు వచ్చాయి. చిన్న ఆఫర్లను సున్నితంగా తిరస్కరించి యశ్ కి జోడీగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'కేజీఎఫ్' సినిమాలో నటించింది. కేజీఎఫ్ మొదటి పార్ట్‌లో శ్రీనిధి శెట్టి పాత్ర పెద్దగా లేదు. అయినా కూడా ముద్దుగుమ్మకు మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ కేజీఎఫ్ 2 విడుదల అయిన తర్వాతే తాను కొత్త సినిమాలకు కమిట్ అవుతాను అంటూ భీష్మించుకు కూర్చుకుంది. దాంతో చాలా



కన్నడ సినిమా ఆఫర్లతో పాటు ఇతర భాషల సినిమా ఆఫర్లు కూడా చేజార్చుకుంది. కేజీఎఫ్ 2లో కూడా శ్రీనిధి శెట్టి పాత్ర అంతంత మాత్రమే. అయినా కూడా ఆ సినిమా దక్కించుకున్న విజయం నేపథ్యంలో పాన్ ఇండియా రేంజ్‌లో శ్రీనిధి శెట్టికి మంచి గుర్తింపు దక్కింది. దాంతో ఆఫర్లు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. కానీ ఈమె పాత్రల ఎంపిక విషయంలో అతి జాగ్రత్త వహించినట్లు తెలుస్తోంది. కేజీఎఫ్ 2 సినిమా సమయంలోనే తమిల స్టార్ హీరో విక్రమ్‌తో కలిసి కోబ్రా సినిమాలో నటించింది. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది, దాంతో ఆ సినిమాను కనీసం చెప్పుకునే పరిస్థితి శ్రీనిధి శెట్టికి లేదు. కేజీఎఫ్ సమయంలో వరుసగా ఆఫర్లు వచ్చినా పెద్దగా పట్టించుకోని శ్రీనిధి శెట్టి కోబ్రా తర్వాత ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. లక్కీగా తెలుగులో ఈ అమ్మడికి రెండు ఆఫర్లు వచ్చాయి. నానికి జోడీగా హిట్ 3 లో నటించే అవకాశం దక్కించుకున్న శ్రీనిధి శెట్టి ఆ తర్వాత సిద్దు జొన్నలగడ్డ సినిమా తెలుసు కదా లో ఇద్దరు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా నటించింది. హిట్ 3 మంచి విజయాన్ని సొంతం చేసుకున్నా కొన్ని కారణాల వల్ల ఆమెకు ఆశించిన స్థాయిలో రీచ్ రాలేదు. హిట్ 3 కారణంగా శ్రీనిధి శెట్టికి ఒక్కటంటే ఒక్క ఆఫర్ కూడా వచ్చిన దాఖలాలు లేవు అని ఇండస్ట్రీ వర్గాల టాక్. తెలుసు కదా సినిమాలో నటిస్తున్న కారణంగా అంచనాలు భారీగా పెట్టుకుంది. యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న సిద్దు జొన్నలగడ్డ కచ్చితంగా ఈ సినిమాతో సాలిడ్ సక్సెస్‌ను అందుకుంటాడనే విశ్వాసం అందరిలోనూ వ్యక్తం అవుతుంది. అందుకే తెలుసు కదా విడుదల కోసం వెయిట్ చేస్తుంది.

## ఎన్టీఆర్ తో మరో దర్శకుడు.. సెట్టయినట్లేనా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం తెలుగు సినీ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీ హీరోలలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఇప్పటికే బాలీవుడ్‌లో హృతిక్ రోషన్‌తో కలిసి "వార్ 2" సినిమాతో గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమవుతున్నాడు. ఇకపోతే తెలుగు సినిమా పరంగా ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ డ్రాగన్ షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. ఇక ఈ ప్రాజెక్ట్ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో రూపొందే దేవర 2, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో మరో సినిమా లైన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ లైనప్ మధ్యనే ఇంకో క్రేజీ కాంబినేషన్ కూడా బజ్‌లోకి వచ్చి ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అదే కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో ఎన్టీఆర్ చేయబోయే సినిమా. తాజాగా నెల్సన్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నిర్మాత నాగవంశీ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ఈ హైప్‌కి బలాన్నిస్తోంది. మా డియరెస్ట్ నెల్సన్ దిలీప్ కుమార్ కి హ్యాపీ బర్త్



డే. అతి త్వరలోనే బిగ్ స్క్రీన్ ట్రీట్ మళ్లీ వెనక్కి రాబోతుంది అనే కామెంట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇది కచ్చితంగా ఎన్టీఆర్‌తో చేసే సినిమాకే సంకేతమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. నెల్సన్ గతంలో విజయ్ తో "బీస్ట్", రజనీకాంత్ తో "జైలర్" వంటి భారీ ప్రాజెక్ట్స్‌ను తెరకెక్కించాడు. "జైలర్" మెగా బ్లాక్ బస్టర్ కావడంతో తమిళ ఇండస్ట్రీలో అతడికి మంచి మార్కెట్ ఏర్పడింది. అలాంటి నెల్సన్ ఇప్పుడు ఎన్టీఆర్ లాంటి మాస్ హీరోతో జతకడితే, అది అసలైన ఫైర్ కాంబో కానుంది. పైగా పాన్ ఇండియా రేంజ్‌లో సెట్ చేయదగిన కాంబినేషన్ ఇది కావడం విశేషం. ఇప్పటికే ఎన్టీఆర్ లైనప్ చాలా బిజీగా ఉంది. కానీ పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ ప్రాజెక్ట్ ముందుగా ప్లాన్ చేసిన లైనప్‌లో కొన్ని మార్పులు జరగొచ్చని అంటున్నారు. ఎప్పుడు అయినా గ్రీన్ సిగ్నల్ వస్తే, నెల్సన్ - ఎన్టీఆర్ మూవీ త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళే అవకాశముంది. ఈ కాంబి నేషన్ ఖచ్చితంగా భారీ మాస్ ఎంటర్టైనర్‌కి అవకాశం కల్పించనుంది. మరి ఏం జరుగుతుందో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536